www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
వరంగల్
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 134
సోమవారం | 11-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: విదియ ఉ.10:34 తదుపరి తదియ; నక్షత్రం: శతభిషం మ.1:00 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా.7:05-8:37; దుర్ముహూర్తం: మ.12:45-1:36, మ.3:17-4:08; అమృతఘడియలు: ఉ.6:03-7:36, తె.4:14-5:46; రాహుకాలం: ఉ.7:30-9:00; సూర్యోదయం: 6:00; సూర్యాస్తమయం: 6:39
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారత్‌పై అణుబాంబులేస్తాం!

మేం మునిగితే.. సగం ప్రపంచాన్ని మాతో తీసుకెళ్తాం



- సింధు నది భారతీయుల ఆస్తి కాదు
- ఆ నదిపై ఆనకట్ట కడితే క్షిపణులతో పేల్చేస్తాం
- పాకిస్థాన్‌తో పెట్టుకుంటే భారత్‌కే నష్టం
- పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ వ్యాఖ్యలు
- అమెరికా గడ్డ పైనుంచి భారత్‌కు హెచ్చరికలు

2

భారత్ అనేది తళతళ మెరిసే మెర్సిడెస్ లాంటిది. హైవేపై ఫెరారీలా పరుగెడుతుంది. పాకిస్థాన్ ఓ డకోటా ట్రక్కు..! ఇసుక, రాళ్లతో నిండిన డంప్ లారీ..! రెండూ ఢీకొంటే.. ఎవరు నష్టపోతారు??

- అమెరికాలోని ప్రవాస పాకిస్థానీలతో భేటీలో మునీర్





హైదరాబాద్ అమీర్‌పేటలోని గంగుబాయి బస్తీలో వరద పరిస్థితిపై ఓ బాలుడిని అడిగి తెలుసుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి; అదే బస్తీలో హైడ్రా కమిషనర్ రంగనాథ్, అధికారులతో కలిసి సమస్యలు తెలుసుకుంటున్న రేవంత్

వరద సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రత్యేక ట్రంక్ లైన్ ఏర్పాటు.. అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశం

- హైదరాబాద్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆకస్మిక పర్యటన
- బల్కంపేట, గంగుబాయి బస్తీ, మైత్రీవనం ప్రాంతాల్లో పరిశీలన
- హడావుడి లేకుండా సాదాసీదాగా వెళ్లిన ముఖ్యమంత్రి
- స్థానికుల్ని అడిగి సమస్యలు తెలుసుకుంటూ అక్కడికక్కడే ఆదేశాలు
- సీఎంతో మంత్రి తుమ్మల భేటీ.. వ్యవసాయ శాఖ అంశాలపై చర్చ

మళ్లీ తెరుచుకున్న సాగర్ గేట్లు.. నిండుకుండల్లా కృష్ణా ప్రాజెక్టులు

14 జలాశయాల గేట్లు ఓపెన్.. అన్ని చోట్లా జల విద్యుదుత్పత్తి

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వానలు.. 2 జిల్లాల్లో కాల్వలకు గండ్లు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలోని బస్తీల్లో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక ట్రంక్ లైన్ ఏర్పాటుచేసి ఈ సమస్యను పరిష్కరించాలని, అందుకు అవసరమైన ప్రణాళికలను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవలి భారీ వర్షాలకు నగరంలోని పలు కాలనీలు, ప్రాంతాల్లోకి వరద రావడం, ఇళ్లలోకి నీరు చేరిన నేపథ్యంలో.. ఆదివారం వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా పర్యటించారు. అమీర్‌పేట ప్రాంతంలోని మైత్రీవనం, గంగుబాయి బస్తీ, బౌద్ధనగర్, బల్కంపేటలోని బస్తీలను పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబర్తి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ముంపు

మిగతా 13వ పేజీలో...



తెలంగాణలో 21 వరకు భారీ వర్షాలు


- పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలెర్ట్
- హైదరాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు

13

అందరికీ బాస్ అనుకునేవారు..

భారత వృద్ధిని ఓర్వడం లేదు

- భారత్ సూపర్ పవర్‌గా మారడాన్ని ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదు
- ట్రంప్‌ను ఉద్దేశిస్తూ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శలు
- రక్షణ రంగంలో దేశం స్వయం సమృద్ధి సాధించిందని వెల్లడి



భోపాల్, ఆగస్టు 10: తామే అందరికీ బాస్ అనుకునేవారు భారత వృద్ధిని ఓర్వడం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఉద్దేశించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ మండిపడ్డారు. ఎవరు ఏం చేసినా భారత్ సూపర్ పవర్‌గా మారడాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. ఆదివారం మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో రైల్వే ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడారు. "భారతదేశం అభివృద్ధి చెందుతుండటాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారు. అందరికీ తాను బాస్ అనుకునేవారు.. భారత్ ఇంత వేగంగా ఎలా అభివృద్ధి చెందుతోందని ఆశ్చర్యపోతారు. భారత్‌లో తయారయ్యే ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసినప్పుడు వాటి ధర పెరిగిపోయేలా చేయడంపైనే దృష్టిపెడతారు.." అని ట్రంప్‌ను

మిగతా 2వ పేజీలో...

టాప్-3 దిశగా..

- దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా పురోగతి
- ట్రంప్‌కు మోదీ పరోక్ష కౌంటర్
- ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక భారత్ సాంకేతికత, మేకిన్ ఇండియా
- ప్రపంచంతో పోటీపడడమే కాదు.. నాయకత్వం కూడా వహించాలి: మోదీ
- బెంగళూరు మెట్రో ఫేజ్-3కు శంకుస్థాపన.. ఎల్లో లైన్ సేవలు షురూ
- 3 వందేభారత్ రైళ్లు జాతికి అంకితం
- మెట్రోలో విద్యార్థులతో మోదీ ముచ్చట్లు

అమెరికా తీరు దాదాగిరీ..

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ విమర్శలు

2

తుమ్మిడిహెట్టి కట్టి తీరతాం

- త్వరలోనే పనులు ప్రారంభిస్తాం
- ఇచ్చంపల్లి నుంచే నదుల అనుసంధానం
- కేంద్రానికి ప్రతిపాదనలు చేశాం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్
- దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- భూసేకరణకు నిధులు ఇస్తాం: భట్టి
- 'జవహర్ ఎత్తిపోతల'కు శంకుస్థాపన

13



రాహుల్‌కు బిహార్ ఓటమి భయం

- అందుకే నకిలీ ఓట్లు అంటూ ప్రచారం
- కాంగ్రెస్ గెలిచిన రాష్ట్రాల్లో నకిలీ ఓట్లు లేవా
- ఢిల్లీ టూర్లు ఆపి రేవంత్ హైదరాబాద్.. వాసుల కష్టాలు చూడాలి: రాంచందర్‌రావు
- బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గువ్వల

12

ఉపరాష్ట్రపతి బరిలో 'ఇండియా' అభ్యర్థి!

- మిత్రపక్షాలతో ఖర్గే చర్చలు
- ఎన్డీయే నేత నిర్ణయం తర్వాతే విపక్ష కూటమి అభ్యర్థి ఖరారు
- మా ఐక్యతను చాటుతాం: నేతలు
- విపక్ష ఎంపీలకు నేడు ఖర్గే విందు
- పార్లమెంటులో ఎన్డీయేదే పైచేయి
- మ్యాజిక్ ఫిగర్ 391.. 'ఇండీ'కి 313

2

మోదీతో వెంకయ్య భేటీ

- ఆర్‌ఎస్‌ఎస్ నేతలతోనూ మంతనాలు
- ఉప రాష్ట్రపతి, బీజేపీ అధ్యక్షుడి ఎన్నిక.. పార్టీ వ్యవహారాలు, రాజకీయాలపై చర్చ



నాంపల్లిలో నిర్మించిన బహుళ అంతస్తుల పార్కింగ్ కాంప్లెక్స్

నాంపల్లిలో ఆటోమేటెడ్ పార్కింగ్ కాంప్లెక్స్

- దేశంలోనే తొలి ప్రాజెక్టు.. ప్రారంభానికి సిద్ధం
- పీపీపీ విధానంలో రూ. 102 కోట్లతో నిర్మాణం
- 2 వేల గజాల్లో భవనం.. 10 అంతస్తుల్లో పార్కింగ్
- 250 కార్లు.. 200 ద్విచక్రవాహనాల్ని పెట్టుకోవచ్చు
- భవనాన్ని పరిశీలించిన మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలి అత్యాధునిక ఆటోమేటెడ్ పార్కింగ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌లో ప్రారంభానికి సిద్ధమవుతోంది. హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో.. రూ.102 కోట్ల వ్యయంతో 'నోవమ్' సంస్థ నిర్మిస్తున్న ఈ బహుళ అంతస్తుల

మిగతా 12వ పేజీలో...



మంత్రులకు కొండపల్లి బొమ్మలు అందిస్తున్న జనసేన ఎమ్మెల్సీ

మంగళగిరిలో తెలంగాణ మంత్రులు

- ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన భట్టి, ఉత్తమ్, కోమటిరెడ్డి, వాకిటి శ్రీహరి
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హెలీప్యాడ్‌లో దిగిన మంత్రులు
- ఎమ్మెల్సీ హరిప్రసాద్ స్వాగతం

13

'ఓటు చోరీ'పై ఉద్యమం షురూ

- ప్రచారానికి వెబ్‌పోర్టల్‌ను ప్రారంభించిన కాంగ్రెస్.. అందులో రిజిస్టర్ చేసుకోవాలని ప్రజలకు పిలుపు
- డిజిటల్ ఓటర్ల జాబితాకు మద్దతివ్వాలని అభ్యర్థన.. ఇది ప్రజాస్వామ్య రక్షణకు పోరాటం: రాహుల్

న్యూఢిల్లీ, ఆగస్టు 10: కేంద్ర ఎన్నికల సంఘం, బీజేపీపై రాహుల్ చేస్తున్న ఓట్ల చోరీ ఆరోపణలపై దేశవ్యాప్త ప్రచారానికి కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టింది. ఇందు కోసం ఒక వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది. 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా, ఈసీ నుంచి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసేందుకు votechori.in అనే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చింది. 9650003420 అనే నంబర్‌కు కాల్ చేయడం ద్వారా ఎస్ఎంఎస్ రూపంలో వచ్చే లింకులో కూడా రిజిస్టర్ చేసుకోవచ్చని పేర్కొంది. డిజిటల్ ఓటర్ల జాబితాను కోరుతున్న ప్రతిపక్ష నేత రాహుల్‌కు మద్దతు తెలపాలని కోరింది. ఓట్ల చోరీ అనేది 'ఒక వ్యక్తి-ఒక ఓటు' అనే ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రంపై

మిగతా 2వ పేజీలో...

గల్లంతైన ఓటర్ల జాబితా ప్రచురించాలనే నిబంధన లేదు!

- కారణాలు వెల్లడించాలనే నిబంధనలు కూడా లేవు
- అలాంటి జాబితా అడిగే హక్కు పిటిషనర్లకు లేదు
- సుప్రీంకోర్టుకు తెలిపిన ఎన్నికల కమిషన్

ఓ మహిళ రెండుసార్లు ఓటేశారని నిరూపించండి

రాహుల్‌కు కర్ణాటక ఈసీ నోటీసులు

2

దూసుకెళ్తున్న బిల్డ్ నౌ

- 69 అంతస్తుల భవనానికి 64 సెకన్లలోనే అనుమతి!
- 37 నిమిషాల్లోనే 13,665 దరఖాస్తుల పరిశీలన.. సులభంగా భవన నిర్మాణ అనుమతులు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ, లే అవుట్ అనుమతులు అత్యంత వేగంగా పారదర్శకంగా జారీ చేసేందుకు సర్కారు ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన బిల్డ్‌నౌ అప్లికేషన్ దూసుకుపోతోంది. ఎన్ని అంతస్తుల భవన నిర్మాణ దరఖాస్తు అయినా క్షణాల్లో స్ర్కూటినీ పూర్తవుతోంది. దరఖాస్తుదారులతో పాటు అధికారులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారింది. గతంలో టీజీబీపాస్ అప్లికేషన్‌ను వాడిన సమయంలో అధికారులకు రోజుల తరబడి సమయం పట్టేది. దీంతో దాని స్థానంలో బిల్డ్ నౌ అప్లికేషన్‌ను తెచ్చారు. రాష్ట్రానికి చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు స్టార్టప్ ద్వారా ఈ బిల్డ్‌నౌ అప్లికేషన్‌ను అభివృద్ధి

మిగతా 13వ పేజీలో...

భారత్‌పై అణుబాంబులేస్తాం!

- మేం మునిగితే.. సగం ప్రపంచాన్ని మాతో తీసుకెళ్తాం
- సింధూనది భారతీయుల ఆస్తి కాదు: పాక్ ఆర్మీ చీఫ్



వాషింగ్టన్, ఆగస్టు 10: భారత్‌పై అణుబాంబులు వేస్తామని పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ హెచ్చరించారు. అమెరికా గడ్డ పైనుంచి భారత్‌కు హెచ్చరికలు జారీచేశారు. అంతేకాదు.. పాకిస్థాన్ ఉనికికే ముప్పు వాటిల్లితే.. సగం ప్రపంచాన్ని తమ వెంట తీసుకెళ్తామంటూ పైశాచికంగా మాట్లాడారు. రెండ్రోజుల క్రితం జరిగిన అమెరికా సెంట్రల్ కమాండ్(సెంట్కామ్) మైఖేల్ కురిల్లా పదవీ విరమణ, ఆయన స్థానంలో అడ్మిరల్ బ్రాడ్ కూపర్ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో మునీర్ పాల్గొన్నారు. అనంతరం మిత్రదేశాల రక్షణ శాఖల అధిపతులతో సమావేశమై, చర్చలు జరిపారు. గ్రాండ్ హయాత్ హోటల్‌లో ప్రవాస పాకిస్థానీలతో భేటీ అయ్యారు. ఆయా సందర్భాల్లో ఆయన భారత్‌ను లక్ష్యంగా చేసుకుని, తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా గడ్డ పైనుంచి ఒక దేశానికి అణుబెదిరింపులు చేయడం గతంలో ఎన్నడూ జరగలేదు. భారత్ సింధూజలాల ఒప్పందాన్ని రద్దు చేయడంపై మునీర్ తీవ్రంగా మాట్లాడారు. "సింధూనది భారతీయుల ఆస్తి కాదు. భారత ప్రభుత్వం సింధూ జలాలను ఆపడం వల్ల 25 కోట్ల మందిపై తీవ్ర ప్రభావం పడుతుంది. వారు(భారత్) ఆనకట్టలు నిర్మిస్తే.. మేం క్షిపణులతో పేల్చేస్తాం. పాకిస్థాన్ వద్ద క్షిపణులకు కొదవ లేదు" అని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ ఉనికికి ముప్పు ఏర్పడితే.. భారత్‌పై అణుబాంబులు వేసేందుకు వెనకాడబోమని, తాము మునిగిపోతూ.. సగం ప్రపంచాన్ని తమతో తీసుకెళ్తామని చెప్పారు. నిజానికి ఈ కార్యక్రమాల్లో ఆహూతులు ఫోన్లను వెంట తీసుకెళ్లడానికి అనుమతుల్లేవు. దాంతో.. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని ఉటంకిస్తూ 'ద ప్రింట్' ఇచ్చిన కథనంతో మునీర్ వ్యాఖ్యలు వెలుగులోకి వచ్చాయి. తమతో యుద్ధంలో భారత్ ఎంతో నష్టపోయిందని మునీర్ ఎద్దేవా చేశారు. 'స్పోర్ట్స్‌మన్ స్పిరిట్‌'తో భారత్ తనకు జరిగిన నష్టాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. భారత్‌ను అధునాతన మెర్సిడెస్‌గా పేర్కొంటూ.. ఫెరారీలా హైవేపై దూసుకెళ్తోందన్నారు. అదే సమయంలో.. పాకిస్థాన్‌ను డంప్ ట్రక్కుగా పేర్కొంటూ.. రెండూ ఢీకొంటే.. నష్టం ఎవరికో గుర్తించాలన్నారు.

'ఓట్ చోరీ'పై ఉద్యమం షురూ!

(మొదటి పేజీ తరువాయి)

దాడి అని రాహుల్ ఆదివారం 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేందుకు అవకతవకలు లేని ఓటర్ల జాబితా అవసరమని నొక్కిచెప్పారు. 'మేం ఎన్నికల సంఘాన్ని ఒక్కడే డిమాండ్ చేస్తున్నాం.. పారదర్శకంగా వ్యవహరించి, డిజిటల్ ఓటర్ల జాబితాలో ప్రజలకు అందుబాటులో ఉంచండి. తద్వారా ప్రజలు, రాజకీయ పార్టీలు స్వీయ ఆడిట్ చేసుకుంటారు' అని పేర్కొన్నారు. వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవడం ద్వారా ఈ డిమాండ్‌కు మద్దతివ్వాలని కోరారు. 'ఇది ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు చేస్తున్న పోరాటం' అని కాంగ్రెస్ నేత చెప్పారు. కాంగ్రెస్ ప్రారంభించిన వెబ్‌సైట్‌లోకి వెళ్లగానే.. ఓట్ల చోరీ రుజువులు, ఈసీ నుంచి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేయడం, ఓట్ చోరీని రిపోర్ట్ చేయడం అనే అంశాలు కనిపిస్తాయి. వీటితో పాటు ఓట్లను కొల్లగొట్టేందుకు బీజేపీ, ఈసీ కుమ్మక్కై ఎన్నికల మోసానికి పాల్పడ్డాయన్న రాహుల్ ఆరోపణల వీడియో ఉంది. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల విభాగం (డీఎఫ్ఏ) చైర్మన్‌గా ఉన్న సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి ఆనంద్ శర్మ ఆదివారం రాజీనామా చేశారు. విభాగం పునర్నిర్మాణంలో సహకరించేందుకు, అందులోకి యువ నేతలను తీసుకొచ్చేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఆనంద్ శర్మ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో సభ్యుడిగా కూడా ఉన్నారు.

టాప్-3 దిశగా భారత్

మా ఆర్థిక వ్యవస్థ వేగంగా పురోగతి.. ట్రంప్ వ్యాఖ్యలకు పరోక్షంగా మోదీ కౌంటర్

- ప్రపంచంతో భారత్ పోటీ పడటమే కాదు నాయకత్వం కూడా వహించాలి: మోదీ
- బెంగళూరులో మెట్రో ఫేజ్-3కి శంకుస్థాపన

బెంగళూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): భారత ఆర్థిక వ్యవస్థను 'డెడ్ ఎకానమీ' అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన విమర్శలకు ప్రధాని మోదీ పరోక్షంగా స్పందించారు. ప్రపంచంలో టాప్-3 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని కౌంటర్ ఇచ్చారు. సంస్కరణ, పనితీరు, పరివర్తన అనే స్ఫూర్తి నుంచి ఈ వేగం వచ్చిందన్నారు. స్పష్టమైన ఉద్దేశం, నిజాయితీ ప్రయత్నాలతో ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. ఆదివారం బెంగళూరులో మెట్రో ఫేజ్-3 పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం బహిరంగ సభలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక భారత సాంకేతిక పరిజ్ఞానం, మేక్ ఇన్ ఇండియా శక్తి దాగున్నాయని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం తొలిసారి సరికొత్త భారత్‌ను చూసిందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారత్ పోటీ పడటమే గాక నాయకత్వం కూడా వహించాలని ఆకాంక్షించారు. మన నగరాలు స్మార్ట్‌గా, వేగంగా, సమర్థంగా ఉన్నప్పుడు మాత్రమే మనం అభివృద్ధి చెందుతామని అన్నారు. 21వ శతాబ్దంలో నగర ప్రాజెక్టులు, నగరాల మౌలిక సదుపాయాలు అత్యంత అవసరమని అన్నారు. 11 ఏళ్ల క్రితం ఆర్థిక పరంగా దేశం పదోస్థానంలో ఉండేదని, ప్రస్తుతం నాలుగో స్థానానికి ఎదిగిందని అన్నారు.



బెంగళూరులోని ఆర్‌వీ రోడ్ మెట్రో స్టేషన్‌లో మోదీ

ఈ మూడు రంగాల్లో వేగంగా వృద్ధి

2014 నాటికి మన దేశంలో ఐదు నగరాల్లో మాత్రమే మెట్రో రైల్వే సేవలు పరిమితంగా ఉండేవని మోదీ పేర్కొన్నారు. ఇప్పుడు 24 నగరాల్లో 1000 కిలో మీటర్లకు పైగా మెట్రో నెట్‌వర్క్ విస్తరించిందని చెప్పారు. "2014కు ముందు దేశంలో దాదాపు 20,000 కి.మీ. రైలు మార్గాన్ని విద్యుద్దీకరించారు. గత 11 సంవత్సరాల్లో ఎన్డీయే ప్రభుత్వంలో 40,000 కి.మీ.కు పైగా రైలు మార్గాన్ని విద్యుద్దీకరించాం. 2014 నాటికి దేశంలో 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్య 160కు పైగా పెరిగింది. జలమార్గాలను కూడా ఇదే రీతిలో అభివృద్ధి చేశాం. 2014 నాటికి కేవలం 3 జాతీయ జలమార్గాలు పనిచేస్తుండగా, ఇప్పుడు ఈ సంఖ్య 30కి పెరిగింది" అని మోదీ వివరించారు.

3 వందే భారత్ రైళ్ల ప్రారంభం

ఒకరోజు బెంగళూరు పర్యటనలో భాగంగా మూడు వందేభారత్ రైళ్లతో పాటు ఎల్లోలైన్ మెట్రో సేవలను మోదీ జాతికి అంకితం చేశారు. బెంగళూరు నుంచి బెళగావి నగరానికి వందేభారత్ రైలుకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఇదే వేదికగా అమృత్‌సర్ నుంచి మాతా వైష్ణోదేవికత్రాకు, నాగ్‌పూర్ నుంచి పుణెకు వందేభారత్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. బెంగళూరు నగరానికి తలమానికంగా ప్రధానంగా ఐటీ కంపెనీలు, పారిశ్రామిక వాడలకు అనుబంధమైన ఆర్‌వీరోడ్డు-బొమ్మసంద్ర మధ్య ఎల్లోలైన్ మెట్రో సేవలను ప్రధాని ప్రారంభించారు. ఎలక్ట్రానిక్ సిటీలో మెట్రో ఫేజ్-3 జేపీనగర్ 4వ స్టేజ్ నుంచి కనకపుర అవుటర్ రింగ్ రోడ్డు దాకా, మాగడి రోడ్డు హొసహళ్లి నుంచి కడబగెరె దాకా 44.65 కిలోమీటర్ల మెట్రో నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

మెట్రోకు 87% రాష్ట్ర నిధులే: సిద్దరామయ్య

మెట్రో ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం 87.37% ఖర్చు చేస్తుండగా కేంద్రం వాటా 12.63% మాత్రమేనని కర్ణాటక సీఎం సిద్దరామయ్య తెలిపారు. ఎలక్ట్రానిక్ సిటీలో జరిగిన సమావేశంలో ప్రధాని సమక్షంలోనే ముఖ్యమంత్రి మెట్రో ప్రాజెక్టులకు రాష్ట్ర వాటా పెరుగుతోందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో ఖర్చు చేయాల్సి ఉందని, 12 శాతం మాత్రమే కేంద్రం భరిస్తోందని అన్నారు. ఈ సమావేశంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. 2014కు ముందు కర్ణాటకకు రైల్వే బడ్జెట్‌లో రూ.835 కోట్లు మాత్రమే కేటాయించారని, మోదీ ప్రధాని అయ్యాక ప్రస్తుతం 7500 కోట్లకు పెంచారని తెలిపారు. మరోవైపు, వేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగళూరు ప్రగతికి ప్రత్యేక గ్రాంటు ఇవ్వాలని మోదీని, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కోరారు. బెంగళూరులో నీటి సరఫరా, చెత్త సేకరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.1.5 లక్షల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో అత్యధికంగా పన్నులు చెల్లించే రాష్ట్రాల్లో కర్ణాటక రెండో స్థానంలో ఉందని, కేంద్ర ఖజానాకు సుమారు 4.5 లక్షల కోట్లు సమకూరుస్తోందని వివరించారు.

భారత వృద్ధిని ఓర్వడం లేదు


(మొదటిపేజీ తరువాయి)

ఉద్దేశించి విమర్శించారు. కానీ ఇప్పుడు భారత్ అభివృద్ధి చెందుతున్న వేగాన్ని చూస్తే.. ప్రపంచంలో ఏ శక్తి కూడా భారత్ సూపర్ పవర్ కాకుండా ఆపలేరని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఒకప్పుడు ఆయుధాలు, ఇతర రక్షణ ఉత్పత్తుల కోసం విదేశాలపై ఆధారపడేవారమని, ఇప్పుడు రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించామని తెలిపారు. మన రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు వేగంగా పెరుగుతున్నాయన్నారు. మోదీ ప్రధాని అయిన సమయంలో భారత రక్షణ ఎగుమతులు రూ.600 కోట్లు అయితే.. ఇప్పుడు రూ.24 వేల కోట్లు దాటాయని చెప్పారు. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో 2014లో 11వ స్థానంలో ఉన్న భారత్.. ఇప్పుడు నాలుగో స్థానానికి చేరిందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, భారత్‌పై అడ్డగోలు సుంకాలతో అమెరికా వ్యవహరిస్తున్న తీరును కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తప్పుబట్టారు. "కొన్ని దేశాలు ఆర్థిక బలంతో, వారివద్ద ఉన్న ఆధునిక సాంకేతికతలను చూసుకుని ఇతర దేశాలపై దాదాగిరీ చేస్తాయి. అదే మన దేశం అంతకన్నా మంచి టెక్నాలజీలు, వనరులు సమకూర్చుకున్నా.. ఎవరిపైనా దాదాగిరీ చేయదు. ఎందుకంటే ప్రపంచమంతా క్షేమంగా ఉండాలనేది మన సంస్కృతి మనకు నేర్పింది." అని గడ్కరీ పేర్కొన్నారు.

ఎల్లరిగూ నమస్కార: మోదీ

ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా బెంగళూరుకు వచ్చానని మోదీ అన్నారు. కన్నడిగులను ఆకట్టుకునేలా కన్నడ భాషలో 'ఎల్లరిగూ నమస్కార (అందరికీ నమస్కారం) అంటూ ప్రసంగం ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్‌లో బెంగళూరు, ఇక్కడి యువత కీలక పాత్ర పోషించారని అన్నారు. దేశంలో ఐటీ, రక్షణ రంగాల్లో స్వావలంబన సాధించడంలో బెంగళూరు పాత్ర కీలకమని కొనియాడారు. ప్రపంచ ఐటీ రంగంలో బెంగళూరుది ప్రత్యేక స్థానమని అన్నారు. ప్రస్తుతం బెంగళూరు దేశంలో అతి పెద్ద మెట్రో సంచారం గల రెండో నగరమని అన్నారు. ప్రధాని మోదీ నగరంలోని జయనగర్ రాగిగుడ్డ స్టేషన్ నుంచి ఎలక్ట్రానిక్ సిటీ దాకా మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కార్మికులు, మెట్రో అధికారులతో ముచ్చటించారు.

లోకం తీరు



ఓట్ల సవరణకు తోడైన ఓట్ల చోరీ

- మోదీ సర్కారుపై ముప్పేటదాడికి విపక్షాలు సిద్ధం

న్యూఢిల్లీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మోదీ సర్కారుపై పార్లమెంట్‌లో మరింత దూకుడుగా వ్యవహరించాలని విపక్షాలు పట్టుదలతో ఉన్నాయి. బిహార్‌లోని సమగ్ర ఓట్ల సవరణ అంశంతోపాటు ఓట్ల చోరీ అంశాన్ని కూడా బలంగా వినిపించాలని విపక్షాలు భావిస్తున్నాయి. దీంతోపాటు బీజేపీని గెలిపించేందుకు ఎన్నికల కమిషన్ చేసే ప్రయత్నాలపై కూడా సభలో చర్చించాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ నేత ఒకరు తెలిపారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై సభలో ఎప్పుడూ చర్చ జరగలేదంటూ తప్పించుకోవడానికి వీలులేదని, ఈసీ పనితీరుపై పార్లమెంట్ లో చర్చ జరిగిన సందర్భాలున్నాయని కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాకూర్ శనివారం మీడియాకు తెలిపారు. ఎన్నికల్లో ధనబలాన్ని నియంత్రించేందుకు చట్టాలు చేయాల్సిన అవసరం, బిహార్, త్రిపురలో ఎన్నికలు వాయిదా పడడం, ఫోటో ఐడీ కార్డు, 1993లో ఎన్నికలను వాయిదా వేయాలనే సీఈసీ నిర్ణయం, ఎన్ఆర్ఐలకు ప్రాక్సీ ఓటింగ్ వంటి అనేక అంశాలపై పార్లమెంట్‌లో చర్చ జరిగిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం బిహార్‌లో యుద్ధ ప్రాతిపదికపై ఓట్ల సవరణ చేపట్టడంపై ఎందుకు చర్చించరని నిలదీశారు. ఒక పక్క విపక్షాలు సోమవారం సభను స్తంభింపజేసే అవకాశాలున్నప్పటికీ కొన్ని అంశాలపై చర్చకు వారు అంగీకరించవచ్చని సమాచారం. జాతీయ క్రీడా బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపాలంటూ డిమాండ్ చేయాలని విపక్షాలు భావిస్తున్నాయి. దీనిపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అదే సమయంలో భారత్‌పై అమెరికా ఏకపక్షంగా టారిఫ్ లను విధించడం, ప్రభుత్వ విదేశాంగ విధానం విఫలం కావడంపై కూడా ప్రశ్నించేందుకు ప్రతిపక్షాలు ఉభయ సభల్ని సాగనిచ్చే అవకాశాలున్నాయి.

గల్లంతైన ఓటర్ల జాబితా ప్రచురించాలనే

నిబంధన లేదు!

కారణాలు వెల్లడించాలనే నిబంధనలు కూడా లేవు

- అలాంటి జాబితా అడిగే హక్కు పిటిషనర్లకు లేదు
- సుప్రీంకోర్టుకు తెలిపిన ఎన్నికల కమిషన్
- బిహార్ ఓటర్ల తొలగింపుపై మూడో అఫిడవిట్ దాఖలు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: ముసాయిదా ఓటర్ల జాబితాలో గల్లంతైన వారి పేర్లతో ప్రత్యేకంగా ఒక జాబితాను ప్రచురించాలనే నిబంధనలేమీలేవని భారత ఎన్నికల కమిషన్(ఈసీఐ) స్పష్టంచేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో శనివారం అదనపు అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న బిహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సర్వే (ఎస్ఐఆర్) చేపట్టిన ఈసీ 65 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. వారంతా చనిపోయిన లేదా వలసపోయినవారు అని పేర్కొంది. 7.24 కోట్ల మందితో కూడిన ముసాయిదా ఓటర్ల జాబితాను ఈసీ ప్రచురించింది. బిహార్ ఎస్ఐఆర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లన్నింటిపై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఈనెల 12న ఈ పిటిషన్లపై మరోసారి విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో పేర్లు గల్లంతైన వ్యక్తుల జాబితాను ప్రచురించాలని కోరుతూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) దాఖలు చేసిన పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ ఈసీఐ తాజా అఫిడవిట్‌ను దాఖలు చేసింది. కారణాలు వెల్లడించకుండా 65లక్షల మంది పేర్లు తొలగించారంటూ ఏడీఆర్ చేసిన ఆరోపణకు స్పందనగా సుప్రీంకోర్టులో ఈసీఐ దాఖలు చేసిన మూడో అఫిడవిట్ ఇది. జాబితాలో పేరు చేర్చకపోవడానికి కారణం వెల్లడించాల్సిన అవసరంలేదని ఈసీఐ పేర్కొంది. తొలగించిన ఓటర్ల పేర్లతో జాబితా కావాలని అడిగే హక్కు పిటిషనర్లకు లేదంది. ముసాయిదా జాబితాలో వ్యక్తుల పేర్లు చేర్చకపోవడానికి కారణాలు వెల్లడించాలని నిబంధనల్లో లేదని తెలిపింది. జాబితాలో పేరులేని వారు తమ పేరు చేర్చాలని డిక్లరేషన్ సమర్పించేందుకు అవకాశం ఉందని, అలాంటి ఓటర్లు సంబంధిత పత్రాలు సమర్పించేందుకు సహేతుకమైన అవకాశం కల్పిస్తామని తెలిపింది. అందువల్ల ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లన్నింటినీ కొట్టివేయాలని ఈసీఐ కోరింది. ముందస్తు నోటీసు జారీ చేయకుండా, సంబంధిత అధికారి నుంచి సహేతుకమైన ఆదేశంలేకుండా ఏ ఒక్కరి పేరూ 2025 ఆగస్టు 1న ప్రచురించిన బిహార్ ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించమని ఈసీఐ పేర్కొంది. 'బిహార్ ఎస్ఐఆర్ కేసులో పిటిషనర్లు కోర్టును తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారందరిపై భారీగా జరిమానాలు విధించాల్సి ఉంది' అని పేర్కొంది.



ఉపముఖ్యమంత్రికి రెండు ఓటరు కార్డులు

- ఆయనపై ఏం చర్యలు తీసుకున్నారు: తేజస్వీ

పట్నా, ఆగస్టు 10: బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్‌కుమార్ సిన్హాకు రెండు ఓటరు కార్డులు ఉన్నాయని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు. ఆయనపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఆదివారం పట్నాలో తేజస్వీ విలేకరులతో మాట్లాడుతూ.. 'విజయ్ కుమార్ సిన్హా రెండు వేర్వేరు జిల్లాల్లోని రెండు వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఓటరు. లఖీసరాయ్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో సిన్హా పేరు ఉంది. పట్నా జిల్లాలోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలోనూ ఆయన పేరుంది. దీనికి ఎవరు బాధ్యత వహించాలి? సిన్హానా? లేక ఎన్నికల కమిషనా? సిన్హాపై ఏం చర్యలు తీసుకుంటున్నారు? అని నిలదీశారు. తేజస్వీ ఆరోపణలపై విజయ్ కుమార్ సిన్హా స్పందించారు. 'నాతోపాటు నా కుటుంబసభ్యుల పేర్లు బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఉన్నాయి. లఖీసరాయ్‌లో మా పేర్లు చేర్చాలని 2024 ఏప్రిల్‌లో దరఖాస్తు చేశాం. అదే సమయంలో బంకీపూర్ నుంచి మా పేర్లు తొలగించాలని ఫామ్ ఇచ్చాను. ముసాయిదా జాబితాలో నా పేరుండటంతో బంకీపూర్‌లో నా పేరు తొలగించాలంటూ దరఖాస్తు ఇచ్చాను' అని సిన్హా స్పష్టం చేశారు.

ఆరోపణలపై ఆధారాలు ఇవ్వండి

- రాహుల్‌కు కర్ణాటక ఈసీ నోటీసులు



బెంగళూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 'ఓట్ల చోరీ' జరిగిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కర్ణాటక రాష్ట్ర ఎన్నికల అధికారి స్పందించారు. రాహుల్‌కు ఆదివారం నోటీసులు జారీ చేశారు. ఈనెల 7న ఢిల్లీలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో చేసిన ఆరోపణలకు సంబంధించిన తగిన వివరాలను డాక్యుమెంట్ల రూపంలో ఇవ్వాలని సూచించారు. ఆధారాలు సమర్పిస్తే సమగ్ర దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు. పీపీటీలో చూపిన డాక్యుమెంట్లు కేంద్ర ఎన్నికల సంఘం రికార్డుల నుంచి తీసుకున్నవని, పోలింగ్ బూత్ అధికారి ఇచ్చిన రికార్డుల ప్రకారం శకున్‌రాణి అనే మహిళ రెండుసార్లు ఓటు వేసినట్లు ఆరోపించారని పేర్కొన్నారు. అది కూడా ఒకే ఐడీ కార్డుతో రెండుసార్లు ఓటు వేశారన్నారు. శకున్‌రాణిని విచారిస్తే ఆమె ఒకసారి మాత్రమే ఓటు వేసినట్లు తెలిపారని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో శకున్ రాణి లేదా మరెవరైనా రెండుసార్లు ఓటేశారని నిరూపించేందుకు తగిన ఆధారాలు సమర్పించాలని కోరారు. సీఈవో కార్యాలయం చేపట్టిన ప్రాథమిక విచారణలో అసలు రాహుల్ ప్రజంటేషన్ సమయంలో చూపిన టిక్ మార్క్ చేసిన డాక్యుమెంట్‌ను ఎన్నికల అధికారి జారీ చేయలేదని పేర్కొన్నారు.

చదరంగంలా ఆపరేషన్ సిందూర్

- సంప్రదాయ యుద్ధాలకు ఇది భిన్నం: ఆర్మీ చీఫ్ ద్వివేది



న్యూఢిల్లీ, ఆగస్టు 10: ఆపరేషన్ సిందూర్ వంటి సైనిక చర్య తమకు కొత్త అనుభవం అని, సంప్రదాయ యుద్ధాలకు ఈ తరహా ఆపరేషన్లు భిన్నమైనవని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. ఆపరేషన్ కొనసాగిన నాలుగు రోజులూ తమకు పరిస్థితి కొత్తగానూ, సంక్లిష్టంగానూ అనిపించిందన్నారు. ఎత్తుకు పైఎత్తు వేస్తూ ఒకరకంగా చదరంగంలాగా ఈ ఆపరేషన్ సాగిందని ఉపేంద్ర ద్వివేది వ్యాఖ్యానించారు. "సంప్రదాయ యుద్ధంలో సర్వశక్తులు ఒడ్డి పోరాడతాం. ఉన్న అన్ని వనరులను ఉపయోగిస్తాం. తిరిగి వస్తే వచ్చినట్లు... లేదంటే లేదు. కానీ.. ఆపరేషన్ సిందూర్ అలా కాదు! శత్రువు తదుపరి అడుగు ఏమిటో తెలియదు. మనం ఏం చేస్తామో వాళ్లకూ తెలియదు. వాళ్లు ఒక ఎత్తు వేస్తే... మనం దానికి పైఎత్తు వేశాం. ఇది సరికొత్త పోరాట పంథా!" అని ద్వివేది పేర్కొన్నారు. యుద్ధం సుదీర్ఘకాలంపాటు కొనసాగుతుందని భావించినప్పటికీ... టెస్టు మ్యాచ్ నాలుగు రోజులకే ముగిసిందని వ్యాఖ్యానించారు. అదే సమయంలో... మనమంతా త్వరలోనే మరో 'యుద్ధం' చేయాల్సి ఉంటుందని... అందుకు సిద్ధంగా ఉండాలని.. బహుశా అది 'కాలు కదపకుండా చేసేది' అని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు.

సిందూర్ వేళ సైన్యానికి సంపూర్ణ స్వేచ్ఛ

ఆపరేషన్ సిందూర్ విషయంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని, ప్రభుత్వంవైపు నుంచి ఇలాంటి స్పష్టత, విశ్వాసం చూడటం ఇదే మొదటిసారని, దీంతో... క్షేత్రస్థాయిలో సమర్థంగా వ్యవహరించే అవకాశం లభించిందని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. "ఏప్రిల్ 25న మేం ఉత్తర కమాండ్‌ను సందర్శించాం. ఆపరేషన్ సిందూర్ ప్రణాళికను రూపొందించాం. 9ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా ఎంచుకున్నాం. అందులో... ఏడింటిని ధ్వంసం చేశాం. ఈ దాడిలో పెద్దసంఖ్యలో ఉగ్రవాదులు మరణించారు. ఈ దాడులను వాళ్లు ఊహించలేదు" అని ఆయన వివరించారు. "పాకిస్థాన్‌తో ఎలాంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. జవాను స్థాయిలో సాంకేతికత అందుబాటులోకి రావాలి. ఇండియన్ ఆర్మీలో 12 లక్షల మంది సైనికులున్నారు. ప్రతి ఒక్కరి చేతిలో డ్రోన్ ఉండాలి. ఇదే.. 'ఈగల్ ఆన్ ది ఆర్మ్'" అని ఆయన పేర్కొన్నారు.

మోదీతో వెంకయ్య నాయుడు భేటీ

- ఆర్ఎస్ఎస్ నేతలతోనూ మంతనాలు
- ఉప రాష్ట్రపతి, బీజేపీ అధ్యక్షుడి ఎన్నిక..
- పార్టీ వ్యవహారాలు, రాజకీయాలపై చర్చ

న్యూఢిల్లీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) గత రెండు రోజులుగా ఢిల్లీలో ఉన్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు.. ప్రధాని మోదీ సహా పలువురు ఆర్ఎస్ఎస్, సంఘ్ పెద్దలను కలుసుకున్నారు. కొద్ది రోజులుగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ మధ్య జరుగుతున్న పరిణామాలు, దేశ రాజకీయాలు, ఉప రాష్ట్రపతి నియామకం ఇతర సంస్థాగత అంశాలపై నేతలు వెంకయ్య సలహాలను కోరినట్లు తెలిసింది. శనివారం వెంకయ్య.. ప్రధాని నివాసానికి వెళ్లి దాదాపు 40 నిమిషాలపాటు ఏకాంతంగా చర్చలు జరిపారు. ట్రంప్ టారిఫ్‌ల పట్ల భారత్ స్వతంత్ర నిర్ణయం తీసుకోవాలని, ఆ దేశంతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తూనే మన ఆర్థిక, విదేశాంగ విధానం స్వతంత్రంగా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్న విషయంలో వెంకయ్య అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం. ఇక బీజేపీ అధ్యక్షుడి నియామకం కూడా త్వరలో జరుగుతుందని మోదీ ఆయనకు చెప్పినట్లు తెలిసింది. ఆదివారం ఉదయం వెంకయ్య ఢిల్లీలోని దేశ బంధు గుప్త రోడ్‌లో నూతనంగా నిర్మించిన ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఆర్ఎస్ఎస్ నేతలతో పాటు పలువురు ప్రముఖులతో దాదాపు గంటకుపైగా ఏకాంతంగా చర్చలు జరిపారు. దేశ రాజకీయాలు, బీజేపీ అధ్యక్షుడి నియామకం, ఇతర అంశాలపై వారు మాట్లాడుకున్నట్లు తెలిసింది. ఆదివారం సాయంత్రం వెంకయ్య నివాసానికి బీజేపీ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి(సంస్థాగత వ్యవహారాలు) శివప్రకాశ్ వచ్చి సుదీర్ఘ చర్చలు జరిపారు. పార్టీ సంస్థాగత వ్యవహారాలపై వారు చర్చించినట్లు తెలిసింది. ఆ తర్వాత ఐబీ అధికారులు వెంకయ్యను కలిశారు. ఇక, బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నట్లు తెలిసింది. ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్‌తో పాటు కొంత మంది దక్షిణాది నేతల పేర్లు కూడా చర్చలో ఉన్నాయి.

ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఇండియా కూటమి అభ్యర్థి!

- మిత్రపక్షాలతో ఖర్గే చర్చలు
- ఎన్డీయే నేత నిర్ణయం తర్వాతే విపక్ష కూటమి అభ్యర్థి ఖరారు

న్యూఢిల్లీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నిక ఏకపక్షం కాకుండా చేసేందుకు, విపక్షాల ఐక్యతను చాటి చెప్పేందుకు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో ఇండియా కూటమి తరఫున అభ్యర్థిని నిలపాలని భావిస్తోంది. దీనికి సంబంధించి ఏఐసీసీ చీఫ్ ఖర్గే కూటమి నేతలతో చర్చించినట్టు తెలిసింది. ఉప రాష్ట్రపతి పదవికి ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామా, ఎన్డీయే కూటమి వ్యవహరిస్తున్న తీరుపై ఇండియా కూటమి ఎంపీలు తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి ఎన్నికను ఏకపక్షంగా వదిలేయకుండా తాము కూడా గట్టి పోటీ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే, తొలుత ఎన్డీయే అభ్యర్థి ఎవరనేది తేలిన తర్వాత ఆ అభ్యర్థికి దీటుగా ఇండియా కూటమి అంతే బలమైన అభ్యర్థిని బరిలో నిలవాలని ఎంపీలు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో, ఎవరిని బరిలో నిలపాలనే అంశంపై మాత్రం ఎలాంటి చర్చలు జరగలేదని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అభ్యర్థి ఎంపికపై ఎవరూ తొందరపడి ప్రకటనలు చేయవద్దని ఇండియా కూటమి నేతలకు ఖర్గే సూచించినట్టు తెలిసింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఢిల్లీలో ఓ హోటల్‌లో ఇండియా కూటమి ముఖ్యులు, ఎంపీలకు ఖర్గే విందు ఏర్పాటు చేసినట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఆ సమావేశంలో ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఇండియా కూటమిని బరిలో నిలిపే అంశంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముందని సమాచారం. తద్వారా విపక్షాలు ఐక్యంగా ఉన్నాయన్న సంకేతాన్ని పంపించాలన్నది కీలక నిర్ణయంగా కనిపిస్తోంది. ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్లు వేయడానికి అవకాశం ఉంది.

ఎన్డీయే విజయం ఖాయం

బీజేపీ నేతృత్వంలో కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి తరఫున బరిలో నిలిచే ఉప రాష్ట్రపతి అభ్యర్థి విజయం లాంఛనమేనని తెలుస్తోంది. పార్లమెంటు ఉభయ సభల్లో ప్రస్తుత సభ్యుల సంఖ్య 781. వీరిలో ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మెజారిటీ రావడానికి 391 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం లోక్‌సభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలం ఉండగా, రాజ్యసభలో 129 మంది సభ్యుల మద్దతు ఉంది. ఇండియా కూటమికి లోక్‌సభలో 234 మంది సభ్యులు, రాజ్యసభలో 79 మంది సభ్యుల బలముంది. అంటే.. ఉభయ సభల్లో కలిపి ఎన్డీయేకు 422 మంది, విపక్షానికి 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో.. ఎన్డీయే అభ్యర్థి విజయం ఖాయమని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

నేడు నిరసన

'ఓట్ల చోరీ' అంశాన్ని నిరసిస్తూ.. విపక్ష ఇండియా బ్లాక్ ఎంపీలు.. సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించనున్నారు. పార్లమెంటు నుంచి కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం వరకు జరిగే ఈ ప్రదర్శనలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ సహా ఆయా పార్టీల పార్లమెంటరీ పక్ష నాయకులు, ఇండియా బ్లాక్ పార్టీల ముఖ్యనేతలు, ఎంపీలు పాదయాత్రగా బయలు దేరి ఎన్నికల సంఘం కార్యాలయానికి చేరుకుంటారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

రైతు బీమాకు స్వీయ ధ్రువీకరణ

- దరఖాస్తులను అన్నదాతలే ఇవ్వాలి
- రైతుతోపాటు నామినీ ఆధార్ తప్పనిసరి
- అర్జీలకు మరో మూడు రోజులే గడువు
- 18-59 ఏళ్ల వారికి అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రైతు బీమా పథకం పునరుద్ధరణకు గడువు దగ్గరపడింది. 2024-25 బీమా గడువు ఈ నెల 13కు ముగుస్తోంది. మళ్లీ 2025-26కి ప్రీమియం చెల్లిస్తే ఈనెల 14 నుంచి కొత్త పాలసీ అమల్లోకి వస్తుంది. అయితే రైతు బీమా పథకంలో చేరే రైతులు సెల్ఫ్ డిక్లరేషన్(స్వీయ ధ్రువీకరణ) తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంది. అలాగే రైతులు తమతో పాటు నామినీకి చెందిన ఆధార్ కార్డు, పట్టా పుస్తకం దరఖాస్తుకు జతచేసి.. స్వయంగా వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాలి. రైతు బీమా పథకం 2018లో మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ)తో ఒప్పందం చేసుకొని ఈ పథకాన్ని అమలు చేస్తోంది. పట్టాదారుడై ఉండి, బీమా పథకంలో చేరిన రైతు ఏ కారణంతో చనిపోయినా, వారి కుటుంబానికి ఎల్ఐసీ రూ.5 లక్షలు చెల్లిస్తుంది. ఏడేళ్లుగా ఈ పథకం అమలవుతోంది. ఇందులో 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సున్న రైతులను లబ్ధిదారులుగా చేర్చారు. అంటే 1966 ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14 మధ్యలో పుట్టినవారికి ఈ పథకంలో చేరే అవకాశం ఉంటుంది. తాజాగా వ్యవసాయ శాఖ చేపడుతున్న కసరత్తులో.. 18 ఏళ్లు నిండి పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న రైతులను ఈ పథకంలో చేరుస్తారు. 59 ఏళ్లు నిండిన రైతులను జాబితా నుంచి తొలగిస్తారు. ఈ ప్రక్రియను ఈనెల 12, 13 తేదీల్లో చేపట్టనున్నారు. అయితే ఈ పథకంలో కొత్తగా చేరే వారు స్వీయ ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాల్సి ఉంటుంది. వ్యవసాయ అధికారులు(ఏవోలు), వ్యవసాయ విస్తరణాధికారు(ఏఈవో)ల వద్ద రైతు బీమా దరఖాస్తు పత్రాలు ఉంటాయి. రైతులు ఆ దరఖాస్తును పూర్తి చేసి, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు కాపీలను జతచేసి, దరఖాస్తు పత్రంపై సంతకం చేసి ఏఈవోకు అందజేయాలని వ్యవసాయశాఖ ఆదేశాలు జారీచేసింది. అదేక్రమంలో నామినీ ఆధార్ కార్డు, వివరాలను కూడా ఏఈవోలకు ఇవ్వాలి. కాగా, ఈ ఏడాది జూన్ 5 నాటికి పట్టాదారు పాస్ పుస్తకం జారీ చేసిన రైతులకు ఈ పథకంలో చేరే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఆరో తేదీ నుంచి జారీ చేసిన పాస్ పుస్తకాలను ఈ ఏడాదికి పరిగణనలోకి తీసుకోబోమని వ్యవసాయశాఖ వెల్లడించింది.

మూడు రోజులే అవకాశం..

ప్రస్తుత (2024-25) సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 42.16 లక్షల మంది రైతులు బీమా పథకంలో లబ్ధిదారులుగా ఉన్నారు. ఇందులోంచి 59- 60 ఏళ్ల వయస్సున్న రైతులను తొలగిస్తారు. 18 ఏళ్లు నిండిన రైతులను కొత్త లబ్ధిదారులుగా చేరుస్తారు. అయితే ఈ సంఖ్య ఎంత వరకు ఉంటుందనేది 14 నాటికి స్పష్టత వస్తుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ నెల 8న రైతు బీమాకు సంబంధించిన నియమ నిబంధనలను జారీ చేశారు. కమిషనరేట్ నుంచి జారీ చేసిన సర్క్యులర్‌ను జిల్లా, మండల, క్లస్టర్ అధికారులకు అంతర్గతంగా పంపించారు. కానీ రైతులకు సమాచారం చేరేలా అధికారులు విస్తృత ప్రచారం కల్పించలేదనే విమర్శలు వస్తున్నాయి.



యాదగిరిగుట్ట గర్భాలయం ఉభయ క్యూలైన్లలో భక్తులు

భక్తజన సంద్రం.. యాదగిరి క్షేత్రం

యాదగిరిగుట్ట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రం భక్తులతో కోలాహలంగా మారింది. శనివారం రాఖీ పండుగ, ఆదివారం సెలవు కావడంతో భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో తిరువీధుల్లో సందడి నెలకొంది. ఇష్టదైవాలను దర్శించుకునేందుకు సుమారు 35 వేల మంది భక్తులు తరలివచ్చారు. ఉభయ క్యూలైన్లలో ఉదయం నుంచి రాత్రి వరకు బారులు తీరారు.

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): భ్రమరాంబికా మల్లికార్జునస్వామి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో నంద్యాల జిల్లాలోని శ్రీశైల క్షేత్రం కిటకిటలాడింది. ఆదివారం కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, ఆ తర్వాత స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

గట్టు ఎత్తిపోతలకు గ్రహణం

నిలిచిపోయిన ఎత్తిపోతల పథకం పనులు.. 1.32 నుంచి 3 టీఎంసీలకు సామర్థ్యం పెంపు

- గతేడాది మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ
- ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్

గద్వాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వలసలకు నిలయమైన ఆ మండలంలో రిజర్వాయర్ మంజూరు కావడంతో ప్రజలు సంబరపడ్డారు. నీళ్లు లేక బీడుగా ఉన్న భూముల్లో పచ్చని పంటలు పండుతాయని ఆశ పడ్డారు. అయితే, నిర్మాణ దశలో ఉన్న పనులు ఒక్కసారిగా ఆగిపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. జోగులాంబ గద్వాల జిల్లాలో వెనుకబడిన గట్టు ప్రాంతంలో ప్రజల జీవనాన్ని మెరుగుపరిచేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.580 కోట్లతో గట్టు ఎత్తిపోతల పథకం పనులను ప్రారంభించింది. గట్టు, కేటీదొడ్డి, ధరూర్ మండలాల్లో 33 వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందించడానికి ప్రణాళికలు రూపొందించింది. ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి 2.80 టీఎంసీలను ఎత్తిపోయడానికి అక్కడ అప్రోచ్ కెనాల్, పంపు హౌస్ నిర్మించడంతో పాటు రాయపురం దగ్గర 1.32టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం, 3.2 కి.మీ. అప్రోచ్ కెనాల్ నిర్మించాలని ప్రతిపాదించింది. ఇందుకోసం మొదట విడతగా టెండర్లు పిలువగా రూ.328 కోట్లతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ 2023 నుంచి పనులను ప్రారంభించారు. రాయపురందగ్గర రిజర్వాయర్ నిర్మాణం, అప్రోచ్ కెనాల్ పనులు గత జనవరి వరకు సాగాయి. కొన్ని నెలల నుంచి కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు.

ప్రభుత్వం వద్ద పెంపు ప్రతిపాదన..

గత ఏడాది సెప్టెంబరులో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గట్టు ఎత్తిపోతల పథకం పరిశీలన కోసం వచ్చినప్పుడు స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లా మంత్రులు గట్టు ఎత్తిపోతల సామర్థ్యం పెంచాలని కోరారు. జూరాల నిల్వ సామర్థ్యం తగ్గిపోతున్నందున 15 టీఎంసీల నుంచి 20 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌ను నిర్మించాలని, అవసరమైతే గ్రావిటీ ద్వారా కర్ణాటకలోని లక్ష ఎకరాలకు సాగునీరు అందించి రెండు రాష్ట్రాల సహకారంతో నిర్మించాలని కోరారు. అయితే, ఇందుకోసం రూ.2 వేల కోట్ల ఖర్చవుతుందని ఆ ప్రతిపాదనను తిరస్కరించారు. ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచే నీటిని తీసుకొని 1.32 టీఎంసీలున్న రిజర్వాయర్‌ను 3 టీఎంసీలకు పెంచాలని నిర్ణయించారు. దీనివల్ల గట్టు మండలం మొత్తానికి సాగునీరు అందించవచ్చని సూచించారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు 3 టీఎంసీలకు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం వద్ద ఫైల్ పెండింగ్ లో ఉంది. ప్రస్తుతం 1.32 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న రిజర్వాయర్‌లో మార్పులు వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు పనులను నిలిపివేశారు. పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే రీడిజైన్‌తో మళ్లీ నిర్మాణ పనులను ప్రారంభించాల్సి ఉంది.



రాయపురం వద్ద రిజర్వాయర్ పనులు నిలిచిపోయిన దృశ్యం

ప్రజల ఎన్నో ఏళ్ల కల..

ఎత్తిపోతల పథకం గట్టు ప్రజల ఎన్నో ఏళ్ల కల. వైఎస్ రాజశేఖరరెడ్డి మొదట ఈ పథకాన్ని మంజూరు చేసినా తర్వాత మరుగున పడింది. కేసీఆర్ సీఎం అయిన తర్వాత శంకుస్థాపన చేసినా.. ఆయన రెండోసారి సీఎం అయిన తర్వాతే గట్టు ఎత్తిపోతల పథకానికి మోక్షం లభించింది. పనులు శరవేగంగా సాగుతున్న సమయంలో సామర్థ్యం పెంపు ప్రతిపాదనలతో బ్రేక్ పడింది.

ఆమోదం లభించగానే మొదలు పెడతాం



గట్టు ఎత్తిపోతల పథకం సామర్థ్యం 1.32 టీఎంసీల నుంచి 3 టీఎంసీల పెంపునకు ప్రతిపాదనలు పంపించాం. ఇంకా ప్రభుత్వ ఆమోదం లభించలేదు. ఆమోదం లభించగానే మళ్లీ శరవేగంగా పనులు జరుగుతాయి. కాంట్రాక్టర్ సామగ్రిని సేకరించుకుంటున్నారు.

- రహీముద్దీన్, ఎస్ఈ, ఇరిగేషన్ శాఖ, గద్వాల జిల్లా

జూలైలో భూగర్భ జలాల్లో గణనీయ వృద్ధి నమోదు

- వర్షాలతో 8.37 మీటర్లకు పెరుగుదల
- 12 జిల్లాల్లో పరిస్థితి ఇంకా ఆందోళనకరమే

హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూగర్భ జలమట్టాల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. వాటి సగటు లోతు మేలో 10.07 మీటర్లకు పడిపోగా, వర్షాలతో జూన్‌లో 9.47 మీటర్లకు, జూలైలో 8.37 మీటర్లకు పెరిగింది. మేతో పోలిస్తే సగటున జూన్‌లో 0.6 మీటర్లు, జూలైలో 1.69 మీటర్ల మేర పెరిగింది. అయితే, గత ఏడాది జూలైతో పోలిస్తే ఈ ఏడాది జూలైలో మాత్రం 0.13 మీటర్ల మేర తక్కువగానే ఉంది. రాష్ట్ర భూగర్భ జల వనరుల శాఖ జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా పరిశీలించి రూపొందించిన నివేదిక ఈ విషయాలను వెల్లడించింది. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో వర్షాలు విస్తారంగా కురిశాయి. దీంతో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. గోదావరి పరీవాహకంలో మాత్రం వర్షాభావ పరిస్థితులతో కొన్ని జిల్లాల్లో భూగర్భ జలాలు జూన్‌తో పోలిస్తే జూలైలో తగ్గిపోయాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా మెదక్ జిల్లాలో 14.16 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. అత్యల్పంగా ఖమ్మం జిల్లాలో 3.87 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. 2024 జూలైతో పోలిస్తే 2025 జూన్‌లో 15 జిల్లాల్లో భూగర్భ జలాల్లో వృద్ధి నమోదైంది. మరో 18 జిల్లాల్లో క్షీణత కనిపించింది.

త్వరలోనే మరో అమెరికా ఉపగ్రహ ప్రయోగం : ఇస్రో చైర్మన్

చెన్నై, ఆగస్టు 10: ఇటీవలే నాసా భాగస్వామ్యంతో రూపొందించిన భూపరిశీలన ఉపగ్రహం నిసార్‌ను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చిన ఇస్రో.. త్వరలోనే మరో అమెరికా ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది. 2 నెలల్లో అమెరికాకు చెందిన 6,500 కిలోల కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తామని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి నారాయణన్ ఆదివారం వెల్లడించారు. చెన్నైలోని కట్టంకులత్తూర్‌లో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 34 దేశాలకు చెందిన 433 ఉపగ్రహాలను సొంత రాకెట్ల ద్వారా ప్రయోగించే స్థాయికి ఇస్రో ఎదిగిందని అన్నారు.

కూలి డబ్బులు అడిగినందుకు హత్య

- ములుగు జిల్లా సర్వాయిలో ఘటన



రాజబాబు(ఫైల్)

కన్నాయిగూడెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మేస్త్రీని కూలి డబ్బులు అడిగినందుకు అతడి బావమరిది ఓ కూలిపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం సర్వాయిలో శనివారం జరిగింది. కన్నాయిగూడెం మండలం ఏటూరు గ్రామానికి చెందిన మడే రాజబాబు(36) భార్యతో కలిసి అత్తగారి ఊరైన సర్వాయిలో నివాసం ఉంటున్నాడు. శనివారం అతడిని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన కుమ్మరి బాబు అనే తాపీ మేస్త్రీ పనులకు పిలవగా కాస్త ఆలస్యంగా వెళ్లాడు. సాయంత్రం పనులు ముగిశాక డబ్బులు అడగ్గా సగం కూలినే ఇస్తానని చెప్పాడు. అదేమని ప్రశ్నించగా అసలు డబ్బులే ఇవ్వను ఏం చేసుకుంటావో చేసుకో అంటూ మేస్త్రీ వెళ్లిపోయాడు. అనంతరం ఇంటికి చేరిన రాజబాబు జరిగిన విషయాన్ని ఇంట్లో చెబుతుండగా వారి పొరుగింట్లో ఉండే మేస్త్రీ బామ్మర్ది కోరం రంజిత్ విన్నాడు. తన బావను డబ్బులు ఎలా అడుగుతావంటూ రాజబాబును చంపుతానని బెదిరించి వెళ్లాడు. రాత్రి అందరూ నిద్రించాక రాజబాబు ఇంటికి వెళ్లిన రంజిత్ అతడిపై కత్తితో దాడి చేశాడు. దీంతో రక్తపు మడుగులో పడి ఉన్న రాజబాబును అతని కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. రాజబాబు భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు పిచికారీ చేసిన వ్యవసాయ కూలీ మృతి

- మరొకరి పరిస్థితి విషమం



సంపంగి సిద్ధు

గుండాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): క్రిమి సంహారక మందు ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం కాచనపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ సంపంగి సిద్ధు(17) ఆదివారం మృతి చెందాడు. అతని వెంట ఉన్న రైతు పరిస్థితి విషమంగా ఉంది. సిద్ధు ఇటీవల అదే గ్రామానికి చెందిన వర్స మహేష్ అనే రైతు పొలంలోకి పురుగుల మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. ఇంటికి తిరిగొచ్చాక సిద్ధుకు వాంతులు కావడంతో.. కుటుంబసభ్యులు స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స అందించారు. మరుసటి రోజు రైతు మహేష్‌కూ తీవ్రస్థాయిలో వాంతులయ్యాయి. పరిస్థితి విషమించడంతో.. మెరుగైన చికిత్స నిమిత్తం ఇద్దరిని ఖమ్మంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే సిద్ధు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. రైతు మహేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో.. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

వారెవ్వా పులస...

- ధర కేజీ పాతికవేలైనా తగ్గేదేలే
- ఏపీలోని గోదావరిలో దొరికే స్పెషల్
- తొలి వరదల కాలం మూడు నెలలే



(పోలవరం-ఆంధ్రజ్యోతి)

ఏపీలో వర్షాకాలంలో గోదావరికి వరద వచ్చిందంటే చాలు... గోదారోళ్లకు పండగే. వాళ్ల చూపంతా గోదారి మీద ఏటకెళ్లే మత్స్యకారులపైనా, ఆళ్లుపట్టి తెచ్చే పులసపైనే ఉంటుంది. పుస్తెలమ్మైనా సరే పులస కూర తినాలన్న నానుడి గోదారోళ్ల జీవితంతో పెనవేసుకుంది. 'హిల్సా ఇలీషా' శాస్త్రీయ నామంతో పిలుచుకునే ఈ చేప ఆరోహక వలస జాతికి చెందినది. సముద్రంలో ఉన్నప్పుడు దీనిని ఇలస(విలస) అని పిలుస్తారు. ఇవి సంతానోత్పత్తి కోసం ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్, టాంజానియా వంటి సుదూర ప్రాంతాల నుంచి ఖండాంతరాలు ప్రయాణించి హిందూ మహాసముద్రం గుండా బంగాళాఖాతంలోకి వస్తాయి. బే ఆఫ్ బెంగాల్‌లోకి వచ్చిన ఇలస... మన రాష్ట్రంలో గోదావరిలోకి, ఒడిశాలోని మహానందిలోకి వరద ప్రవాహానికి ఎదురు ఈదుతుంది. ఈ రెండు నదులూ అటవీ ప్రాంతాల గుండా, కొండలు, గుట్టలు దాటుకుంటూ ప్రవహిస్తాయి. ఈ క్రమంలో ఆ నదీ జలాలకు వచ్చే రుచికి ఈ చేప ఫిదా. అందుకనే మధ్యలో ఎన్ని 'సంగమ' ప్రాంతాలున్నా వాటినన్నింటినీ వదులుకొని గోదావరి వరద నీరు కలిసే అంతర్వేది వద్ద, మహానంది కలిసే పారాదీప్ వద్ద ఈ చేప ఆయా నదుల్లోకి అడుగుపెడుతుంది. మహోగ్రంగా సాగే ఈ రెండు నదుల వరద ప్రవాహానికి ఈ చేప అత్యంత వేగంగా ఎదురీదుతుంది. జూన్, ఆగస్టు మాసాల మధ్య గుడ్లు పెట్టడానికి గోదారిలోకి వచ్చి మత్స్యకారుల వలలకు చిక్కుతుంది. గుడ్లు పెట్టిన తరవాత అక్టోబరు నాటికి ఇవి తిరిగి సముద్రం బాట పడతాయి. సముద్రంలో ఉన్నంత సేపూ ఇలస చేప వెన్ను నుంచి తల వరకూ నల్ల రంగులో ఉంటుంది. నదిలో సుమారు 150 నుంచి 250 కిలోమీటర్లు మేర ప్రయాణించే సరికి చేప రంగు పూర్తిగా మారుతుంది. నలుపిరిగి... పాలవెండి వర్ణాన్ని సంతరించుకుంటుంది. రంగుతోపాటే... పేరుకూడా ఇలస నుంచి పులసగా మారుతుంది. అంతే కాదండోయ్... రుచిలోకూడా అనూహ్యమైన మార్పు వస్తుంది. అందుకే సీజన్‌లో డిమాండును బట్టి కిలో పులస రూ.25 వేలు పలికిన సందర్భాలు కూడా ఉన్నాయంటే ఆశ్చర్యమే.

ఉన్నత విద్యాసంస్థల్లో 'నషా ముక్త్ భారత్ అభియాన్'

- యూజీసీ, ఎన్‌సీటీఈ ఆధ్వర్యంలో ఏఐసీటీఈ ఆన్‌లైన్ సమావేశం

న్యూఢిల్లీ, ఆగస్టు10: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రారంభించిన నషా ముక్త్ భారత్ అభియాన్(ఎన్ఎంబీఏ) కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం పిలుపునిచ్చారు. క్యాంపస్‌ల్లో ఈ కార్యక్రమం అమలు తీరు, వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నత విద్యాసంస్థల అధినేతలతో ఆయన చర్చించారు. యూజీసీ, ఎన్‌సీటీఈ సహకారంతో జాతీయ స్థాయిలో ఈ ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ఎన్ఎంబీఏ ప్రచార కార్యక్రమం ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్త డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. ఆగస్టు 1 నుంచి 31 వరకూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహించే వివిధ కార్యక్రమాల ద్వారా 3కోట్ల మందికిపైగా అవగాహన కల్పించనున్నారు.

9వ తరగతికి 'ఓపెన్ బుక్' పరీక్షలు

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు: సీబీఎస్ఈ

న్యూఢిల్లీ, ఆగస్టు 10: వచ్చే విద్యాసంవత్సరం నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఓపెన్ బుక్ విధానంలో పరీక్షలు నిర్వహించడానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఆమోదం తెలిపింది. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన సమావేశంలో సీబీఎస్ఈ గవర్నింగ్ బాడీ ఈ ప్రతిపాదనను ఆమోదించింది. దీనిలో భాగంగా 9వ తరగతి భాష, గణితం, సైన్స్, సోషల్ పరీక్షలు ఓపెన్ బుక్ విధానంలో నిర్వహించనున్నారు. సంబంధిత మార్గదర్శకాలను పాఠశాలలకు బోర్డు అందించనుంది. అయితే పాఠశాలల్లో దీన్ని అమలుచేయడం తప్పనిసరి కాదు. కాగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది కోసం సీబీఎస్ఈ ప్రత్యేకంగా ఒక కమ్యూనిటీ రేడియో స్టేషన్‌ను ఏర్పాటు చేయనుందని బోర్డు అధికారులు తెలిపారు. 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఆడియో కంటెంట్ అందించడానికి సీబీఎస్ఈ ఇప్పటికే 'శిక్షా వాణి' పేరిట పాడ్‌కాస్ట్‌ను నిర్వహిస్తోంది.

కేరళలో ఇంటికే మద్యం డెలివరీ?

- రాష్ట్ర బేవరేజెస్ సంస్థ ప్రతిపాదన

తిరువనంతపురం, ఆగస్టు 10: మందుబాబుల ఇంటికే మద్యాన్ని డెలివరీ చేసే దిశగా కేరళలో కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే ఇంటికే మద్యాన్ని సరఫరా చేసేందుకు సంబంధించిన ప్రతిపాదనను ఆ రాష్ట్ర బేవరేజెస్ (మార్కెటింగ్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్) కార్పొరేషన్.. రాష్ట్ర ప్రభుత్వం ముందుంచింది. దీనివల్ల మద్యం అమ్మకాలతో రాబడి పెరగడానికి, మద్యం విక్రయ దుకాణాల వద్ద రద్దీని తగ్గించడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వం పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చడానికి రాష్ట్ర అబ్కారీ చట్టంలో సవరణలు చేయాల్సి ఉంటుంది.

దుబాయిలో 6 మాసాల్లో 3,600 మంది ఇస్లాం స్వీకరణ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దుబాయిలో ఈ ఏడాది మొదటి ఆరు నెలల వ్యవధిలో 3,600 మంది ఇస్లాం మతాన్ని స్వీకరించగా, మరో 1300మంది ఇస్లాం విజ్ఞాన విద్యలో తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఇక్కడి ప్రభుత్వం వెల్లడించింది. అంటే సగటున రోజుకు 19 మంది మతాన్ని స్వీకరించారని తెలిపింది. దుబాయి ప్రభుత్వ ఇస్లామిక్ సంస్కృతి, దాన ధార్మిక శాఖ ఆధ్వర్యంలో నడిచే మొహ్మద్ బిన్ రాషేద్ ఇస్లామిక్ సాంస్కృతిక కేంద్రాన్ని ఉటంకిస్తూ.. ప్రభుత్వ అధికారిక వార్తా సంస్థ ఈ మేరకు వివరాలను వెల్లడించింది. ఇస్లాం మహోన్నత విలువలను తెలియజేస్తూ పరమత సహన విలువలను తమ సంస్థ ప్రచారం చేస్తుందని దాని సంచాలకుడు జాసిం అల్ ఖరాజీ చెప్పారు. నాగరికత మధ్య సాంస్కృతిక వారధిగా, ఇస్లాంలోని సహనం, విజ్ఞానం, పరస్పర అవగాహన అంశాలకనుగుణంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు.

జార్జియాలో పడిన ఉల్కా శకలం 456 కోట్ల ఏళ్లనాటిది!

అట్లాంటా, ఆగస్టు 10: ఇటీవల అమెరికాలోని జార్జియాలో పడిన ఉల్క.. భూమి కంటే 2 కోట్ల ఏళ్ల పురాతనమైనదని శాస్త్రవేత్తలు గుర్తించారు. జూన్ 26న దూసుకొచ్చిన ఆ ఉల్కా శకలం హెన్రీ కౌంటీలోని మెక్‌డొనొగ్‌లో ఓ ఇంటి పైకప్పును తాకింది. 'రూఫ్ ఇన్సులేషన్'ను ఛేదించుకుని లోపలికి వచ్చిన దాని ధాటికి నేలపై చిన్న గుంత పడింది. అది 23 గ్రాములే ఉన్నా సూపర్ సోనిక్ వేగంతో భూమిపై దూసుకొస్తున్నప్పుడు వచ్చిన శబ్దం చుట్టుపక్కల ప్రాంతాలకూ వినిపించింది.

పుతిన్ గిఫ్ట్‌తో బిత్తరపోయిన ట్రంప్ దూత

- ఆర్డర్ ఆఫ్ లెనిన్ పతకం విట్కాఫ్‌కు అందజేత
- సీఐఏ అధికారిణి జూలియాన్‌కు ఇవ్వాలని సూచన
- జూలియాన్ కుమారుడు గ్లోస్ సాహసానికి గుర్తుగా పతకం

మాస్కో, ఆగస్టు 10: ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ఆపేందుకు ట్రంప్ దూతగా వచ్చిన స్టీవ్ విట్కాఫ్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇచ్చిన బహుమతిపై కలకలంరేగింది. అమెరికా నిఘా సంస్థ సీఐఏ డిప్యూటీ డైరెక్టర్ జూలియాన్‌కు అందజేయాలంటూ ఆర్డర్ ఆఫ్ లెనిన్ పతకాన్ని ఇచ్చారు. సీఐఏ అధికారిణి జూలియాన్ కుమారుడు మైఖేల్ గ్లోస్.. రష్యా తరఫున ఉక్రెయిన్‌పై పోరాడి మరణించాడని, అతడి సాహసానికి గుర్తుగా ఈ పతకం ఇచ్చామని చెప్పాలన్నారు. సీఐఏలో పనిచేసే ఉన్నత స్థాయి అధికారుల కుటుంబ సభ్యులు కూడా రష్యా తరఫున ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నారని పుతిన్ చెప్పకనే చెప్పారు. పుతిన్ మైండ్ గేమ్‌తో విట్కాఫ్ బిత్తరపోయినట్లు సమాచారం. దీనిపై సీఐఏ గానీ, అమెరికా గానీ ఇంకా అధికారికంగా స్పందించలేదు. రష్యా గూఢచార సంస్థ కేజీబీలో పనిచేసిన పుతిన్ గతంలోనూ అనేకసార్లు తన చర్యలతో ప్రత్యర్థులను షాక్‌కు గురిచేశారు. గతంలో తనను కలిసేందుకు వచ్చిన జర్మనీ నేత వద్దకు పుతిన్ తన పెంపుడు కుక్కనుపంపి భయపెట్టారు. మరో సందర్భంలో ఫ్రాన్స్ నేతను దూరంగా కూర్చోబెట్టి మాట్లాడారు.



పుతిన్‌తో విట్కాఫ్

పావుగా వాడుకుని ఉంటారు

రష్యా తరఫున ఉక్రెయిన్‌తో పోరాడుతూ గత ఏడాది ఏప్రిల్ 4న మైఖేల్ గ్లోస్ మరణించాడని రష్యా చెబుతోంది. గ్లోస్ గతంలో తన సోషల్ మీడియాలో రష్యాకు అనుకూలంగా పోస్టులు పెట్టారు. మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో దిగిన సెల్ఫీలు, ఫొటోలు కూడా పోస్ట్ చేశారు. రష్యా సైన్యంలో చేరినపుడు మైఖేల్ గ్లోస్ తల్లిదండ్రుల పూర్తి వివరాలు క్రెమ్లిన్‌కు కూడా తెలియదని సమాచారం. మరోవైపు మైఖేల్ గ్లోస్ మరణంపై ఆయన తండ్రి లారీ గ్లోస్ స్పందించారు. తమ కుమారుడికి మానసిక సమస్యలున్నాయని తెలిపారు. రష్యా తరఫున యుద్ధం చేసినట్లు తమకు సమాచారం లేదని, పావుగా వాడుకుని ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మైఖేల్ గ్లోస్ మృతదేహం అమెరికాకు చేరుకున్నప్పుడు సీఐఏ ప్రకటన విడుదల చేసింది.

ప్రియుడ్ని ఇంటికి పిలిచి స్క్రూడ్రైవర్‌తో పొడిచి చంపి...!

- ఉత్తరప్రదేశ్‌లో భర్తతో కలిసి మహిళ దారుణం

లఖ్‌నవూ, ఆగస్టు 10: పచ్చటి సంసారాల్లో వివాహేతర సంబంధాలు చిచ్చు రేపుతున్నాయి. ఇటు భర్తో.. అటు భార్యో.. లేదా ప్రియుడో.. ఎవరో చివరికి నమ్మిన వారి చేతిలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటువంటి ఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. ప్రియుడిని ఇంటికి పిలిచి భర్తతో కలిసి చిత్రహింసలు పెట్టి ఓ మహిళ చంపగా.. మరో ఘటనలో వివాహేతర సంబంధం విషయమై గొడవపడి భర్త మర్మాంగాన్ని భార్యే కోసేయడంతో చావుబతుకుల్లో అతడు కొట్టుమిట్టాడుతున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్, అమేథిలో ఈ దారుణాలు చోటు చేసుకున్నాయి. రయీస్, సితార భార్యాభర్తలు.. అయితే పక్కింట్లో ఉండే అనీశ్ (45)తో సితారకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇటీవలే అనీశ్‌కు వివాహం నిశ్చయమవగా.. సితార అతడిని ఇంటికి పిలిచింది. ఈ నేపథ్యంలోనే ఆమె ఇంటికి వెళ్లగా భర్త రయీస్‌తో కలిసి అతడిపై ఆమె దాడి చేసింది. స్క్రూడ్రైవర్‌తో పొడవడంతో పాటు అతడిని చిత్రహింసలకు గురిచేశారు. ఈ క్రమంలోనే అనీశ్ కొన ఊపిరితో బయటికొచ్చి తన ఇంటి సమీపంలో పడి ప్రాణాలు కోల్పోయాడు. అనీశ్ తండ్రి మాట్లాడుతూ.. రయీస్ తమకు రూ.7 లక్షల అప్పు ఇవ్వాల్సి ఉందని.. అది అడిగేందుకే అతడి ఇంటికెళ్లగా అనీశ్‌ను తీవ్రంగా హింసించి కొట్టి చంపారన్నారు. ఫసన్‌గంజ్ కచ్‌నా గ్రామంలో నివసించే అన్సార్ అహ్మద్(38)కు ఇద్దరు భార్యలు.. కానీ పిల్లలు లేరు. అయితే అన్సార్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని రెండో భార్య నజ్నీన్ బానోకు తెలిసింది. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి భోజనంలో అతడికి మత్తు మందు పెట్టింది. అతడు మత్తులోకి జారుకోగానే కత్తితో మర్మాంగాన్ని కోసేసి పారిపోయింది. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉంది.

నేటి అవసరాలకు తగ్గట్టుగా లేని న్యాయవిద్య

- డిజిటల్ రంగంపై దృష్టి పెట్టాలి: జస్టిస్ చంద్రచూడ్

ఛత్రపతి శంభాజీనగర్, ఆగస్టు 10: దేశంలో న్యాయవిద్య 21వ శతాబ్దపు అవసరాలకు తగ్గట్టుగా లేదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. డిజిటల్ విప్లవం నేపథ్యంలో డాటా ప్రొటెక్షన్, వాతావరణ మార్పులు, ఆన్‌లైన్‌లో వివాదాల పరిష్కారం వంటి అంశాల్లో నైపుణ్యాలు తగినంతగా లేవని తెలిపారు. అందువల్ల న్యాయవాదులు పలు రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాల్సి ఉంటుందని చెప్పారు. బోధన కూడా అందుకు అనుగుణంగా ఉండాలని సూచించారు. శనివారం ఇక్కడ విష్ణుపంత్ అద్వంత్ స్మారక ఉపన్యాసంలో భాగంగా 'న్యాయ వృత్తి: వర్తమానం, భవిష్యత్తు; అవకాశాలు, సవాళ్లు, లోపాలు' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. న్యాయ విద్యా సంస్థలు అద్భుతమైన న్యాయ నిపుణులను అందిస్తున్నాయని, కానీ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఎదగడం లేదని చెప్పారు.

రాబర్ట్ వాద్రాది నేరపూరిత ఆర్జన: ఈడీ

న్యూఢిల్లీ, ఆగస్టు 10: కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా భర్త రాబర్ట్ వాద్రా ఓ భూమి అమ్మకం వ్యవహారంలో రూ.58 కోట్లు ఆర్జించారని ఈడీ ఆరోపించింది. ఇది నేరపూరిత ఆర్జన అని పేర్కొంది. ఈ మేరకు గతనెలలో కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసింది. రాబర్ట్ వాద్రా కంపెనీ 2008 ఫిబ్రవరిలో గురుగ్రాంలోని షికోపూర్‌లో ఓంకారేశ్వర్ ప్రాపర్టీస్ నుంచి 3.5 ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు కొనుగోలు చేసింది. దానిని డీఎల్ఎఫ్ కంపెనీకి రూ. 58 కోట్లకు విక్రయించింది. ఇది నగదు అక్రమ చలామణి కిందకు వస్తుందని ఆరోపిస్తూ ఈడీ కేసు నమోదు చేసింది. లంచంలో భాగంగానే డీఎల్ఎఫ్ కంపెనీకి అంత అధిక ధరకు భూమిని విక్రయించారని ఆరోపించింది.

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

ఆహ్వాన పత్రం చూసి సినారె సభకు రాలేదు!

నా మొదటి పుస్తకం

కందుకూరి శ్రీరాములు

1974లోనే అక్టోబర్ నెలలో నేనూ, నందిని సిధారెడ్డి, కర్నాల బాలరాజు ముగ్గురమూ కలిసి 'దివిటి' అనే ప్రప్రథమ మినీ కవితా సంకలనాన్ని తీసుకువచ్చాం. సిద్దిపేటలో శివారెడ్డి ఆవిష్కరించారు. దేవిప్రియ అధ్యక్షత వహించారు. ఆ పుస్తకం మాకు ముగ్గురికీ మంచి పేరు తెచ్చింది. ఆ తర్వాత నా సొంత పుస్తకం వేయాలన్న ప్రయత్నంలో కవితలు రాస్తూనే ఉన్నాను. కానీ, నేను బీకాం తప్పటం వల్ల ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎన్నో ప్రైవేటు నౌకరీలు చేయాల్సి వచ్చింది. అలా 1974 నుండి 1979 దాకా చదువుకూ సాహిత్యానికీ దూరమయ్యాను. ఎలానో డిగ్రీ అయింది అనిపించుకుని 1979లో ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏలో చేరాను. సి. నారాయణరెడ్డి ప్రియశిష్యుణ్ణి అయ్యాను. 'కవిత్వదాత సుఖీభవ' అంటూ ఆయన మీద నేను రాసిన కవితను 'మానేరు టైమ్స్'లో చూసి మెచ్చుకున్నాడు. ఒక చేతుల్లేని అబ్బాయి మీద 'శబ్దశరీరం' అని కవిత రాస్తే వరవరరావు ఒక నిండు సభలో ఉటంకించారు. కె. శ్రీనివాస్ నేనూ పండిత శిక్షణ ట్రెయినింగ్‌లో క్లాస్‌మేట్స్. ఇద్దరమూ కలిసి 'లాంగ్‌మార్చ్' అనే కవిత రాశాం. 'ఖడ్గకంఠం' అనే కవితను శివారెడ్డి మీద రాశాను. కవితలు రాయటం ఆపలేదు కానీ పుస్తకం ప్రచురించ లేకపోయాను.



పుస్తకాలు ప్రచురించిన మిత్రులంతా సాహిత్యంలో నాకన్నా ముందు వెళ్ళిపోతున్నారు. అప్పుడు రాసుకున్న ఒక కవితలో–

"నువ్వో మెట్టెక్కావనుకో/ నీ పక్కనుండి వెళ్లి వాళ్లు రెండు మెట్లెక్కుతున్నారు/ నువ్వు అలాగే నుంచున్నావనుకో/ వాళ్లు ఆకాశాన్ని ఆక్రమిస్తారు/ నువ్వు అడుగంటుతావు" అని బాధపడ్డాను.

ఒక సందర్భంలో విజయనగర వీధుల్లో జీపులో తిరుగుతుండగా "ఇంకెప్పుడు నీ కవితా సంకలనం?" అంటూ "ఎస్టాబ్లిష్డ్ కవి పక్కన కూర్చుంటే ఎస్టాబ్లిష్ అవుతావయ్యా" అని కాసేపు పక్కన కూర్చోపెట్టుకున్నారు చేరా మాస్టారు. ఆ మాటలు విన్న కవి మిత్రులు పుస్తకం వేయమని పట్టుబట్టారు. అప్పుడుగాని శివారెడ్డి పుస్తకం వేయటానికి ఒప్పుకోలేదు. 'దివిటి' పుస్తకం వచ్చినప్పటి నుండి అప్పటికి, అంటే 22 సంవత్సరాలపాటు, రాసిన కవితలన్నీ ఒక దగ్గర కుప్పపోసాను. ఆ కుప్పలోంచి ముగ్గురు న్యాయనిర్ణేతలు 'మంచివి, మామూలువి, బాగులేనివి' అని 'ఏ, బీ, సీ' కేటగిరీలు విడదీశారు. వాటిలో 'ఏ', 'బీ' మార్క్ పెట్టిన కవితలు తీసుకొని, 'సీ' మార్క్ కవితల్ని పక్కన పెట్టేశాను. ఈ ముగ్గురు న్యాయనిర్ణేతల్లో ఒకరైన శీలా వీర్రాజు కవితలు సెలెక్ట్ చేయడమే గాక పుస్తకానికి, 'సముద్ర సభ' అని పేరు కూడా పెట్టారు. అది కాస్తా శివారెడ్డి గారి చేతిలోకి వెళ్ళి 'వయొలిన్ రాగమో వసంత మేఘమో' అయ్యింది. ఇది 1993లో అచ్చయ్యింది.

అప్పట్లో పుస్తకం వేయటం చాలా కష్టమైన పని. ఒక దగ్గర డీటీపీ, ఒక దగ్గర కవర్ పేజీ ప్రింటింగ్, మరో దగ్గర పేజ్ మేకప్, ఇంకో దగ్గర పుస్తకం ప్రింటింగ్... ఇన్ని బాలారిష్టాలు ఎదుర్కొంటేనే గాని పుస్తకం బయటపడలేదు. ఇదంతా వాసిరెడ్డి నవీన్, తక్కిన మిత్రులూ చూసుకున్నారు. పుస్తకావిష్కరణకు సంబంధించిన ఆహ్వానపత్రం వెరైటీగా ఉండాలనుకున్నారు శీలా వీర్రాజు గారు. తన సొంత దస్తూరితో, హోదాలు అవేవీ లేకుండా, పేర్లన్నీ వరుసగా రాశారు. అజంతా, సి. నారాయణరెడ్డి, డి. వెంకట్రామయ్య, పాపినేని శివశంకర్, నందిని సిధారెడ్డి ఇలాంటి పేర్ల వరుసతో ఆహ్వాన పత్రం అచ్చయింది. అంతకు ముందు పుస్తకం ఆవిష్కరణ చేయాల్సిందిగా నేను వెళ్లి గురువు గారు సినారెను అడిగాను. ఒప్పుకున్నారు. కానీ అచ్చయిన ఈ ఆహ్వాన పత్రాన్ని ఎవరో ప్రబుద్ధులు ఆవిష్కరణ రోజు పొద్దున్నే సినారెకు చూపెట్టి, "ఇందులో నాగలి పట్టేది ఎవరు? నాగలి దున్నేదెవరు?" అని అనుమానం మొలకెత్తింపజేశారు. దాంతో సినారె ఆవిష్కరణకు రాలేదు. అధ్యక్షత వహించాల్సిన అజంతా పుస్తకాన్ని ఆవిష్కరించారు. కరపత్రంలో లేని శివారెడ్డి సభకు అధ్యక్షత వహించారు. హైదరాబాద్ సిటీ సెంట్రల్ లైబ్రరీలో కిక్కిరిసిన ప్రేక్షకుల సమక్షంలో అద్భుతంగా సభ ముగిసింది. అదేమంటే ఆరోజు 62 పుస్తకాలు అమ్ముడుపోయాయి అంటే నమ్మండి!




పుస్తకంలో ఎన్నో కవితలు ఉండగా– శివారెడ్డి 'జంతువు' కవితకు పేరడీగా నేను రాసిన 'ఆడ జంతువు' అన్న ఒక్క కవితనే ఎంచుకుని చందు సుబ్బారావు ఆంధ్రభూమి సాహిత్య పేజీలో అర పేజీకి తగ్గకుండా విమర్శిస్తూ రాశారు. దాన్ని ఎవరూ పట్టించుకోలేదనుకోండి. ఈ పుస్తకానికి సంవత్సరం తిరగకముందే ప్రతిష్ఠాత్మకమైన ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు లభించింది. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు, ఎన్నో మార్పులు చేర్పులు ఒడిదుడుకుల మధ్య ఎట్టకేలకు నా మొదటి పుస్తకం దిగ్విజయ యాత్ర చేస్తూ ముందుకు సాగింది. ఆ యాత్ర కొనసాగింపు ఫలితమే ఆ తర్వాత అచ్చైన పది కథలు, పది కవితా సంపుటాలు, ఇరవైకి పైగా అవార్డులు. అయినా నా మొదటి కవిత 'అమరుడు' రాసినప్పుడు ఎలా మథనపడ్డానో ఇప్పటికీ అంతే మథన పడుతూ ప్రతి కవితా రాస్తాను.

✆ 94401 19245

బీసీల మూగగోసకు నేనిచ్చిన గొంతు 'బహుజనగణమన'!

– జూలూరు గౌరీ శంకర్

జూలూరు గౌరీ శంకర్ కవి, ఉద్యమకారుడు. ఆయన దీర్ఘకవిత 'పాదముద్ర' అస్తిత్వ సాహిత్యోద్యమ కాలంలో ఒక మైలురాయి. ఆయన సంపాదకత్వం వహించిన 'వెంటాడే కలాలు వెనుకబడ్డ కులాలు' ఒక సంచలనం. తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన జూలూరు అనేక దీర్ఘ కవితలు రాసారు. ఇప్పుడు ఆయన తాజాగా 231 పేజీల సుదీర్ఘ కవిత 'బహుజనగణమన' వెలువరించారు. ఇది దేశవ్యాప్త బీసీల స్వరం అంటున్న ఆయనతో చిన్న ముఖాముఖం.



'పాదముద్ర' దీర్ఘకవిత నాటి దళితవాదం 'బహుజనగణమన' నాటికల్లా బహుజనవాదం అయింది ఎందుకు?

'పాదముద్ర' నాటి దళితవాదం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలందరి సామూహిక స్వరం. అది చిక్కనవుతున్న పాటయి, పదునెక్కిన పాటయి, దేశీయ మార్క్సిజం అయింది. ఎవరి మూలాలు వాళ్ళే రాయాలన్న సిద్ధాంతం తలెత్తి అది 'వెంటాడే కలాలు వెనుకబడ్డ కులాలు' సంకలనం అయింది. ఆ నేపథ్యంలోనే 'కొలిమి', 'నాలుగో కన్ను' అని నేను రాసిన దీర్ఘకావ్యాలు రాజుకునీ రాజుకునీ ఇప్పుడు 'బహుజనగణమన' అయింది. ఇది మార్పు కాదు. ఇదొక సామాజిక చరిత్ర పరిణామక్రమం.

ఒక భావజాలవ్యాప్తికి దీర్ఘకవిత వాహిక కాగలదా?

బీసీల సామాజిక, ఆర్థిక న్యాయాల ఆవిష్కరణకు, ఆధిపత్య వర్గాల పెత్తనాన్ని వివిధ కోణాల్లో నిరసించడానికి దీర్ఘ కవిత మాత్రమే సరైన వాహిక అనుకున్నాను. అది 231 పేజీల దీర్ఘకావ్యం అయింది. తెలుగులో ఇంత పెద్ద దీర్ఘ కావ్యం మరొకటి లేదనే అనుకుంటున్నాను. బీసీ ఉద్యమానికి ఒక తాత్విక ఊతం ఇవ్వడానికి ప్రయత్నించాను. 'బహుజనగణమన' అంటే a poetic philosophical document on BC power.

'వెంటాడే కలాలు వెనకబడ్డ కులాలు'లో చెప్పినదానికన్నా, 'పొక్కిలి'లో చెప్పలేకపోయినదానికన్నా 'బహుజనగణమన'లో అదనంగా కొత్తగా ఏదైనా చెప్పారా?

'పొక్కిలి' 129 మంది కవుల ప్రాంతీయ ఆకాంక్ష. 'వెంటాడే కలాలు వెనకబడ్డ కులాలు' 29 మంది కవుల స్వీయాత్మ. నా 'బహుజనగణమన' బీసీ రాజ్యాధికార రూట్ మ్యాప్. స్థానిక సంస్థలనుంచి పార్లమెంట్ దాకా రాజ్యాధికార అంశం ప్రధానంగా రాసిన మార్గదర్శి. దేశవ్యాప్త బీసీలు అడగలేకపోయిన మూగగోసకు నేనిచ్చిన గొంతు బహుజన గణమన.



మీరు కవి కాదు కేవలం ఉద్యమకారుడు అని అంటే మీ సమాధానం?

అవునా? కాళోజీనీ అదే అన్నారు కదా. నన్నూ అదే అంటున్నారా? అయితే గర్వపడాల్సిందే. నేను ఉద్యమ కవిని. కవిత్వం, ఉద్యమం మమేకమైన నేనొక దీర్ఘ కావ్యాన్ని. ఉద్యమ సందర్భంలో నా కవిత్వం వేదికకెక్కి, గోడలకెక్కి నినాదం అయింది. అది చాలు. అయినా ఉద్యమకారుడు కానివాడు కవి ఎట్లా అవుతాడు. వ్యక్తివాదం, విప్లవవాదం, భావవాదం, స్త్రీవాదం, ఆత్మాశ్రయవాదం ఏదో ఒక భావజాలాన్ని ఉద్యమంగా స్వీకరించనివాడు కవి యెట్లా. ప్రతి కవీ ఒక ఉద్యమకారుడే. అవును! నేను ఉద్యమకవినే!

ఇంటర్వ్యూ ■ ప్రసేన్

✆ 70133 58154



దేశం పేరు శూన్యం

నన్ను పూర్తిగా దహించివేయక
ఈ రాత్రి గడిచేట్టు లేదు

నా దేహం బూడిదయ్యాక
కాలభైరవుడిలా శరీరమంతా నన్ను పులుముకొని
ఈ కారు చీకటి ఇక్కడి నుండి ఎక్కడికీ కదిలేటట్టు లేదు

అగ్నికీలలు
నా ఎముకల మాలను
తమ మెళ్ళో వేసుకొని ఈ వీధుల గుండా
నర్తిస్తూ
నెత్తుటి నాలుకను
నా ఇంటి గుమ్మానికి వేలాడదీసి గానీ
కనుమరుగయ్యేటట్టు లేవు

నా దేశాన్ని నా నుంచి లాగేసుకొన్న
మిసైళ్ళవాన కురవడం ఆపనంటోంది

నేను ముక్కముక్కలుగా
పేలిపోతూనే ఉన్నాను
దిక్కులన్నీ మూసుకుపోయేలా
మాంసపు కుప్పలా మారిపోతూనే ఉన్నాను

యుద్ధదాహం ఎంత క్రూరమైందీ?
మరణించినవారిని మళ్ళీ మళ్ళీ చంపుతుంది!
"అక్కడా ఎవరూ మిగిలి లేరు" అని తెలిశాక కూడా
శూన్యం మీద కూడా బాంబులు విసురుతుంది

ఇప్పుడు నా దేశం ఒక నిండైన శూన్యం
నా నామరూపాల గురించి
ఇంకెప్పుడూ ఏ ప్రపంచపటం చెప్పదు

ఒకప్పుడు అందరిలా
నేనో దేశాన్ని కలిగి ఉండేవాడినని
ఇక ఎవరూ గుర్తించరు

అవును నేను
ఎవరికీ గుర్తుగా కూడా మిగలను

ఈ రాత్రి నన్ను పూర్తిగా
దహించి వేశాక
నా దేశానికి శూన్యం
అనే నామకరణం చేసి వెళ్ళిపోండి

■ మహమూద్

✆ 94410 27462



అసలేమిటీ 'స్వచ్ఛమైన' కవిత్వం?

శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కన్నా ఆయన తొలి కవిత్వ సంపుటి 'ప్రభవ'లోనే కవిత్వం ఎక్కువనీ, మయకోవ్‌స్కీ కమ్యూనిస్టు కాకముందు గొప్ప కవిత్వం రాశాడనీ ఇస్మాయిల్ అన్నట్టు, ఇప్పుడు కూడా రాజకీయ భావజాలాలతో కవిత్వం రాస్తే, అందులో కవిత్వస్థాయి తగ్గుతుందనే అభిప్రాయం మారినట్లు లేదు. అంటే భావ కవిత్వమే నిజమైన కవిత్వమనుకోవాలా? భావకవిత్వం గురించే ఎందుకు అడుగుతున్నాను అంటే, ఈ కవిత్వాన్ని మాత్రమే కవిత్వం అనుకునే అభిప్రాయాలు ఉన్నాయి, ఈ కవిత్వం వైపు నుంచే రాజకీయ–సామాజిక కవిత్వ స్థాయిని అంచనా కట్టడం చూస్తూ ఉన్నాను.

సాధారణంగా రాజకీయ–సామాజిక కవిత్వం రాస్తున్నవాళ్ళు భావ కవిత్వం రాసేవాళ్ళని కవులుగా వారి తీరుని ఒప్పుకోరు గానీ వారి కవిత్వాన్ని శంకించిన దాఖలాలు తక్కువ. కానీ రాజకీయ–సామాజిక కవుల తీరుని ఒప్పుకొనే భావకవులు, వారి కవిత్వాన్ని మాత్రం శంకిస్తారు.

ఇదో భిన్నమైన అభిప్రాయాల మిశ్రమం. అయితే ఇవి రెండు శిబిరాల నుంచి వెల్లువెత్తుతున్న, అవతలి వారిని దెబ్బ కొట్టడానికి వాడే అభిప్రాయాలు మాత్రమే కాదు. ఇవి ఒక శతాబ్దకాలంగా ఈ రెండు రకాల కవులకు పరస్పరం ఏర్పడిన నిశ్చిత అభిప్రాయాలు. ఈ భిన్నాభిప్రాయాల వలన ఒకరి మీద ఒకరికి సరైన గౌరవమైనా ఉంటుందా అని ఒక అనుమానం. ఇక్కడ 'ఒకరి మీద ఒకరికి' అంటే దాని అర్థం వారి వారి కవిత్వాల విషయంలో అన్నది ప్రత్యేకించి చెప్పుకోవాల్సిన పని లేదు.

అయితే మరి ఈ రెండు అభిప్రాయాల ప్రాతిపదికగా దేన్ని స్వచ్ఛమైన కవిత్వం అనగలం? కవిత్వం అంటే ఏమిటి అని ఆలోచిస్తే– అది కేవలం అలంకారప్రాయమైన పదాల సమాహారం కాదనేది స్పష్టం. ఒక వాక్యం నీలో తాజాదనాన్ని కలిగిస్తుందా లేదా అనేది ముఖ్యమే. ఉపమలను మాత్రమే కవిత్వం అనుకొనే రోజుల్ని కవిత్వం ఎప్పుడో దాటి వచ్చింది. భావాన్ని గాఢంగా, మూస వాక్యాల నిర్మాణంలో చెప్పకపోవడం అనుభూతి కలిగించవచ్చు. అయితే తాజా వాక్యాల సమాహారం కూడా కవిత్వం కాదు. 20వ శతాబ్దం కవిత్వానికీ 21వ శతాబ్దం కవిత్వానికీ మధ్య చాలా మార్పు ఉంది. వ్యక్తీకరణ, దాని స్వరూపం మారింది. అప్పటి బైరాగి కవిత్వానికి, ఇప్పుడు నరేష్కుమార్ సూఫీ కవిత్వానికి చాలా మార్పు ఉంది. అలాగే అప్పటి రాయప్రోలు కవిత్వానికి, ఇప్పటి మానస చామర్తి కవిత్వానికి చాలా మార్పు ఉంది. అయితే ఈ కవిత్వాల్లో పట్టాలు (tracks) ఎక్కువ మారలేదు. బైరాగి మానవుని ఏకాంతలోతుల్ని, ఆధునిక రాజకీయ స్మరణని కలిపి రాశాడు. కానీ తర్వాత అది రెండు మార్పుల్ని సంతరించుకుంది. రాజకీయ కవిత్వంగా, మానవుని ఏకాంత కవిత్వంగా రెండు భాగాలుగా విడివడింది. అయితే రాజకీయ కవిత్వం మానవుడి గురించి మాత్రమే చెప్పే కవిత్వాన్ని ఒప్పుకోదు. మానవుడి ఒంటరితనాన్ని చెప్పే కవిత్వాన్ని, భావ కవిత్వాన్ని ఒకే గాటన కడుతుంది. అందువల్ల ఈ ఒంటరితనం కవిత్వం రాజకీయ–సామాజిక కవిత్వానికి దూరంగా జరిగి, భావకవిత్వానికి దగ్గరగా అంటే ఒక నైబర్‌గా వచ్చి చేరింది.

> **భావ కవిత్వం గురించీ, రాజకీయ – సామాజిక కవిత్వం గురించీ ఆలోచించినప్పుడు భావ కవిత్వం సాధించిన శైలీ గాఢతను రాజకీయ కవిత్వం సాధించలేకపోయిందనీ, అలాగే రాజకీయ – సామాజిక కవిత్వం సాధించిన వస్తు వైవిధ్యాన్ని భావకవిత్వం సాధించలేకపోయిందనీ అర్థమవుతుంది.**

అయితే భావకవిత్వానికి పాయలు లేకపోలేదు. అప్పటి బసవరాజు అప్పారావు దగ్గర నుంచి ఇప్పటి నందకిశోర్ వరకూ వీళ్ల ప్రేమ కవిత్వం రాసినా ఇది పదకవిత్వంగా ఒక ప్రత్యేక పాయగా ప్రాచుర్యం పొందింది. భావకవులకు ఉన్నంత గుర్తింపు ఈ పద కవులకు ఉన్నా, కవిత్వ ప్రాచుర్యం పరంగా భావకవిత్వమే ఒక అడుగు ముందు ఉంది.

రాజకీయ–సామాజిక కవిత్వం తర్వాతి రోజుల్లో కొన్ని మార్పులను అందుకుంది. అస్తిత్వ ఉద్యమాల ప్రభావంతో నోస్టాల్జియా కవిత్వం వచ్చింది. అణచివేతకు గురైన కులాల నుంచి ఇంటి, ఊరి, కుల స్పృహతో వచ్చిన ఈ సాహిత్యం రాజకీయ–సామాజిక కవిత్వంగా నిలిచింది. ఇదే సందర్భంలో అగ్రకులాల నుంచి వచ్చిన నోస్టాల్జియా కవిత్వం మాత్రం కేవలం నోస్టాల్జియాలా మిగిలిపోయింది. అయితే రాజకీయ–సామాజిక కవిత్వపరంగా రెండు ముఖ్యమైన శిబిరాలుగా మారింది అభ్యుదయ, అస్తిత్వ సాహిత్యాలే. ఇందులో రాజకీయ–సామాజిక కవిత్వం, అస్తిత్వవాద సాహిత్యాన్ని నోస్టాల్జియా పరిధిని దాటి విశాలమైన ప్రాపంచిక దృక్పథంతో రాయమని కోరుతూ ఉంటుంది. ఇది మార్క్స్, అంబేడ్కర్ చట్రంలోంచి మాత్రమే చూడటం వలన వచ్చిన పొరపాటు. రాజకీయ కవులు అనగానే కులాన్ని వర్గంగా చూసేవారో, లేదా కుల వివక్ష గురించి మాత్రమే రాసేవారో మాత్రమే కాదు. ఇక్కడ ఏది రాజకీయ కవిత్వమో నిర్ణయించేది సమాజం కులంతో నిర్మితమైనదా లేక వర్గంతో నిర్మితమైనదా అన్న చర్చ కాదు. రాజ్యానికి వ్యతిరేకమైన గొంతు వినిపించేది రాజకీయ కవిత్వం అనేది స్పష్టం.

భావ కవిత్వం గురించీ, రాజకీయ–సామాజిక కవిత్వం గురించీ ఆలోచించినప్పుడు భావకవిత్వం సాధించిన శైలీగాఢతను రాజకీయ కవిత్వం సాధించ లేకపోయిందనీ, అలాగే రాజకీయ–సామాజిక కవిత్వం సాధించిన వస్తువైవిధ్యాన్ని భావకవిత్వం సాధించలేకపోయిందనీ అర్థమవుతుంది. దీనికి రెండు కారణాలు అనుకోవచ్చు. భావ కవికి పరిమితమైన వనరులు మాత్రమే ఉన్నాయి. నదీ, చెట్టూ, పుట్టా, పూలూ, ప్రేయసీ, ఆకాశమూ, చీకటి ఇవి మాత్రమే. ఇందులో ప్రధానంగా ప్రేమ, విరహం, ప్రేమరాహిత్యం, శృంగారం వస్తువులుగా ఉంటుంటాయి. కానీ రాజకీయ–సామాజిక కవి అలా కాదు. దేశంలో, విదేశంలో జరుగుతున్న రాజకీయ చదరంగంలో పావుల కదలికల్ని చూడాలి. అవి సమాజం మీద చూపే ప్రభావాల గురించి ఆలోచించాలి. సమాజంలో ఉన్న పీడన, హింస, దోపిడీ వాటి మార్పు ఇవన్నీ ఉన్నాయి. రాజకీయ–సామాజిక కవి తనని తప్ప లోకాన్నంతా కవిత్వం చేస్తే, భావకవి లోకాన్ని తప్ప తనని మాత్రమే కవిత్వం చేసుకుంటాడు. ఇందులో భావకవి శైలి విషయంలో చూపగలిగిన శ్రద్ధ రాజకీయ కవికి కుదరదు. తనకి ఆవేశం ముఖ్యం. భావకవిలా సున్నితంగా ప్రతి పదాన్ని ఖచ్చితంగా వాడేంత వీలు ఉండదు. అయితే ఏదో ఒక సామాజిక అంశాన్ని తీసుకొని రాసినంత మాత్రాన అది ఉత్తమ కవిత్వంగా మిగిలిపోదు. రాజకీయ సామాజిక కవిత్వంలో కవిత్వపాళ్ళు తక్కువనే అభిప్రాయాలు ఏర్పడటానికి కొన్ని మూస పదాలని, పోలికల్ని ఎక్కువగా వాడుతూ ఉండటమే కారణం కావొచ్చు. అభ్యుదయ కవిత్వం మొదలై కొనసాగిన కాలంలో కానీ, అస్తిత్వ ఉద్యమ కవిత్వం మొదలై కొనసాగుతున్న కాలంలో కానీ ఒక మూస ఫార్ములాలతో కవిత్వం వెల్లువెత్తటం వల్ల కూడా రాజకీయ సామాజిక కవిత్వం మీద అందులో కవిత్వపాళ్లు తక్కువ అనే అపవాదు స్థిరపడి ఉంటుంది. రాజకీయ–సామాజిక కవిత్వం రాసినంత మాత్రాన అందులో కవిత్వ స్థాయి తక్కువ ఉంటుందనుకోవటం పొరపాటే. అయితే భావ కవిత్వం లోని గాఢత, రాజకీయ–సామాజిక కవిత్వం లోని గాఢత రెండూ ఒకటి కాదు. రెండూ భిన్నమైన అనుభూతులు. శ్రీశ్రీ 'దేశ చరిత్రలు', కృష్ణశాస్త్రి 'స్వేచ్ఛా విహారం' కవితలు ఒకేరకమైన అనుభూతిని ఇవ్వవు. కవిత్వం అనగానే ఏకపక్ష అనుభవమే ఉంటుంది అనుకోవటం వలన వచ్చే సమస్యలు కావచ్చు ఇవన్నీ.

అయితే అసలైన కవిత్వం ఏమిటి? అనే ప్రశ్నను మళ్ళీ వేసుకుంటే భావకవి గాఢమైన శైలా? రాజకీయ–సామాజిక కవి వైవిధ్యమైన వస్తువా? అనే రెండు ప్రశ్నలు ముందుకు వస్తాయి. ఈ రెండూ కలిసినది స్వచ్ఛమైన కవిత్వం అని తెలివిగా బదులు చెప్పుకోవచ్చు కానీ, తన తాజా పదాలను, గాఢమైన శైలిని చూసుకొని నేనే అచ్చమైన కవిని అని ఉబ్బిపోయే భావకవి, రాజకీయ–సామాజిక కవిత్వం రాసి లోకానికి ఎంతో మేలు చేస్తున్నా అని బీరాలు పలికే రాజకీయ కవి... ఈ రెండు వర్గాల మధ్య కవిత్వం గురించి స్థిరమైన వ్యతిరేక అభిప్రాయాలు ఉన్నంతకాలం, మళ్ళీ మళ్ళీ కవిత్వాన్ని అర్థం చేసుకోవటానికి, మనం కవిత్వమంటే ఏమిటి అనే ప్రశ్న వేసుకోవాల్సిందే.

■ గూండ్ల వెంకట నారాయణ

రెక్కల పక్షి

రెక్కల పక్షికి తెలిసే ఉంటుంది
నేల ఈనిన స్థాణువై పడిఉంటే
చెదలకైనా చులకనే అని
అందుకే ఎగిరే కలని ఊపిరిగా ప్రాణం
పోసుకుంటుంది

బురద మడుగులో ఉప్పెన పుడుతుందా!
విస్తరించి చూడు అలల నురగలెత్తి
నింగి కళ్ళలో నీలమై మెరిసేలా
నిత్య చైతన్య స్రవంతికి నువ్వే నాంది.

తన నిశ్చల చలనానికి
వన్నెలద్దే గాలి రెపరెపలపై
పూలు కురిపిస్తుంది చెట్టు ఇష్టంగా.

ఉన్నచోటే ఉండిపోతే ఊపిరి సైతం బరువౌతుంది
నింగి అంచులోనో కొండ కొమ్ముపైనో
మేఘాల వేలుపట్టి తేలిపో
నింగి సంబరమై కురిసే వానలో
స్నేహితంగా తడిసిపో..

బాట పొడవునా నిన్నే నువ్వు కలుసుకుంటూ
మందిగా మారిపో!
కొన్ని సొదలు గుండెలో గూడు కట్టుకుంటాయి
కొత్త ఆశలు పురుడు పోసుకుటాయి
అచ్చంగా రెక్కల పక్షికి మల్లే...



■ సురేష్

✆ 99663 21122

కవితల పోటీ

సాహితీకిరణం సౌజన్యంతో కొసరాజు ఆర్తి & జాహ్నవి ఛారిటబుల్ ట్రస్ట్ 'అంతా అవినీతి మయం – అంతం చేయాలి మనమిక' అనే అంశంపై జాతీయ స్థాయి కవితల పోటీ నిర్వహిస్తున్నది. మొత్తం ఏడు బహుమతులు ఉంటాయి. ప్రథమ, ద్వితీయ బహుమతులు వరుసగా: రూ.3వేలు, రూ.2వేలు. ఒక్కొక్కటి రూ.1000 చొప్పున ఐదు సమాన బహుమతులు. కవిత 20 లైన్లకు తగ్గకుండా 30 లైన్లకు మించకుండా ఉండాలి. హామీ పత్రం తప్పనిసరిగా జతపరచాలి. కవులు తమ కవితలను ఆగస్టు 31 లోగా పోస్టు/ కొరియర్ ద్వారా మాత్రమే పంపాలి. చిరునామా: ఎడిటర్, సాహితీ కిరణం ఇం.నెం. 11–13–154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్ – 500102. సెల్: 94907 51681.

పొత్తూరి సుబ్బారావు

పాలమూరు సాహితి అవార్డు

గత పదిహేను సంవత్సరాలుగా పాలమూరు సాహితి కవితా సంపుటాలకు పురస్కారాలను అందజేస్తున్నది. ఈ అవార్డుకు 2024 సంవత్సరానికి గాను కాంచనపల్లి గోవర్ధన్ రాజు 'పెంకుటిల్లు' కవితా సంపుటి ఎంపికైంది. త్వరలో ఈ పురస్కారానికి గాను కాంచనపల్లికి రూ.5,116 నగదు, జ్ఞాపిక, శాలువతో సత్కారం ఉంటుంది. వివరాలకు: 90328 44017.

భీంపల్లి శ్రీకాంత్

కథల పోటీ

జాగృతి వారపత్రిక ఏటా దీపావళికి నిర్వహించే భండారు సదాశివరావు స్మారక కథల పోటీకి కథలను ఆహ్వానిస్తున్నాం. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా: రూ.12వేలు, రూ.7వేలు, రూ.5వేలు. కథలు సెప్టెంబర్ 10లోగా చిరునామా: జాగృతి భవన్, 3–4–228/4/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ – 27, ఫోన్– 99599 91304.

జాగృతి వీక్లీ

కవిత, కథ సంపుటాల పోటీ


రాజా వేంకట కుమార మహీపతిరావు సూర్యారావు బహదూర్ గారి 140వ జయంతి ఉత్సవాల సందర్భంగా పిఠాపురం మహారాజా ఫౌండేషన్ – ఆదిత్య స్కూల్స్ పిఠాపురం సంయుక్తంగా కవిత, కథా సంపుటాల పోటీని నిర్వహిస్తున్నాయి. ఎంపికైన కథా సంపుటికి రూ. 5 వేలు, కవితా సంపుటికి రూ. 5 వేలు బహుమతి ఉంటుంది. జనవరి 2023 – ఆగస్టు 2025 మధ్య ప్రచురితమైన కవిత, కథ సంపుటాలు మూడు కాపీలను సెప్టెంబర్ 5 లోగా చిరునామా: ఆదిత్య స్కూల్, సీతయ్య గారి తోట, పిఠాపురం – 533450కు పంపాలి. వివరాలకు ఫోన్: 94945 53425.

ర్యాలి ప్రసాద్

'హాసిని రామచంద్ర' అవార్డులు

హాసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్ 2025 అవార్డులకు ఎంపికైన కథా సంపుటాలు: మొదటి బహుమతి– జక్కదొన (ఆర్.సి.కృష్ణ స్వామి రాజు); రెండవ బహుమతి– నల్లబంగారం కథలు (స్వర్ణ కిలారి); మూడవ బహుమతి– విజయ మహల్ సెంటర్ (రోహిణి వంజరి). ఎంపికైన కవిత్వ సంపుటాలు: మొదటి బహుమతి– నల్ల పద్యం (పిన్నంశెట్టి కిషన్); రెండవ బహుమతి– దాపల (కోసూరి రవి కుమార్); మూడవ బహుమతి – రవిక (రేణుక అయోలా). హాసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని అబ్దుల్ రజా హుస్సేన్ స్వీకరిస్తారు. ఈ పురస్కార ప్రదాన కార్యక్రమం ఆగష్టు 17న ఖమ్మంలో జరుగుతుంది. వివరాలకు: 95028 18774.

సుభాషిణి తోట


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
సోమవారం 11 ఆగస్టు 2025


సమావేశంలో మాట్లాడుతున్న నందగిరి రజనీకాంత్

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజనీకాంత్
- నేడు వేయిస్తంభాల గుడి నుంచి మహా పాదయాత్ర

వడ్డెపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజనీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయనతో పాటు ఉద్యమకారుల ఫోరం వరంగల్ ఉమ్మడి జిల్లా మీడియా ఇన్‌చార్జి కందగట్ల మోహన్ మాట్లాడారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లు కేటాయించడంతో పాటు 250 గజాల ఇంటిస్థలం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందు కోసం సోమవారం ఉదయం 10 గంటలకు హనుమకొండ వేయిస్తంభాల దేవాలయం నుంచి పబ్లిక్ గార్డెన్ కాళోజీ విగ్రహం అమరవీరుల స్థూపం, ఏకశిల పార్కులోని జయశంకర్ విగ్రహం వరకు మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఉద్యమకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పాడిశెట్టి గణేష్, జిల్లా నాయకులు అనుముల రమేష్, చల్లా వెంకన్న, కందికట్ల జయ, రెడ్డి సంధ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాగులో యాంత్రీకరణ

- రైతులకు రాయితీపై యంత్రాలు
- ఉమ్మడి జిల్లాకు రూ.4.90 కోట్ల నిధులు
- పంపిణీ చేయనున్న 13,977 వ్యవసాయ పరికరాలు
- ఈనెల 16 వరకు దరఖాస్తుల స్వీకరణ
- రైతులకు తీరనున్న కూలీల కొరత


7



ప్రాజెక్టు వద్ద సమీక్షలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

దేవాదుల ప్రాజెక్టుకే అత్యంత ప్రాధాన్యం

రూ.67 కోట్లతో భూసేకరణ

- రూ.112 కోట్ల పెండింగ్ బిల్లులు దశల వారీగా చెల్లిస్తాం
- 17 నియోజకవర్గాలకు సాగునీరు అందించాలన్నదే సంకల్పం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్ష
- ఇరిగేషన్ పేరుతో గత ప్రభుత్వం వృథా ఖర్చు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- గోదావరి ఉన్నా సాగునీరు కరువు : మంత్రి సీతక్క

ములుగు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెంలోని గోదావరిపై నిర్మించిన సమ్మక్క-సారక్క బ్యారేజీని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకటి శ్రీహరితో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు కలిసి పరిశీలించారు. సమ్మక్క-సారక్క బ్యారేజీ పొడవు, ఎత్తు నిర్మాణ తీరును ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దేవాదుల ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు వద్ద అధికారులతో సమావేశమయ్యారు. ప్రాజెక్టు పురోగతిపై సమీక్షించారు. 240 మెగావాట్ల జల విద్యుత్ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు ద్వారా 17 నియోజకవర్గాల ఆయకట్టుకు నీరందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ఇందుకు రూ.67కోట్లతో భూసేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించిన పెండింగ్ బిల్లులను రూ.112 కోట్లను దశల వారీగా చెల్లిస్తామని అన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏడాదికి రెండు సీజన్లు సాగునీటిని అందించాలని, అందుకు తగినట్లు అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రాజెక్టు ప్రారంభ దశలో 5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా నిర్మాణం చేపట్టినప్పటికీ ప్రస్తుతం 6 లక్షల ఎకరాలకు అందిస్తోందని తెలిపారు. ఆయకట్టు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టిసారించారని, త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు (మిగతా 7వ పేజీలో)


దేవాదుల ఇన్‌టేక్‌వెల్‌ను పరిశీలిస్తున్న మంత్రులు

నదుల అనుసంధానానికి ప్రతిపాదనలు
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



ఇచ్చంపల్లి నుంచి నదుల అనుసంధానం చేసేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు చేశామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల నీటి లభ్యత ఉందని తెలిపారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును కట్టితీరుతామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు. ఇరిగేషన్ పేరుతో గత ప్రభుత్వం రూ.2లక్షల కోట్లు అప్పులు చేసిందని ఆరోపించారు. వాటికి ప్రతి ఏటా రూ.16వేల కోట్లు మిత్తి చెల్లిస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం బ్యారేజీలు మూడు కూడా పనికి రావని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తేల్చి చెప్పిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ నివేదికను కించపరిచేలా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం విడ్డూరమని విమర్శించారు. ఛత్తీస్‌గఢ్‌లోని ముంపు ప్రాంతాలకు నష్టపరిహారం చెల్లించేందుకు సిద్ధమని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు పరిధిలో ఇంకా భూసేకరణ పూర్తికాని చోట ఆయా జిల్లా కలెక్టర్లతో మాట్లాడాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో చర్చించిన అన్ని విషయాలను దృష్టిలో పెట్టుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

ఓటును అపహాస్యం చేస్తున్న బీజేపీ

- దొంగ ఓట్లతో అధికారంలోకి...
- బీజేపీ కనుసన్నల్లో ఎన్నికల సంఘం
- రాహుల్ గళాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి అత్యంత గౌరవాన్ని కల్పించే ఓటు వ్యవస్థను భారతీయ జనతా పార్టీ అపహాస్యం చేస్తోందని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. ఈ మాటలను అధినేత రాహుల్ గాంధీ దేశ ప్రజలకు తెలియచేసే కార్యక్రమాలను విరివిరిగా నిర్వహించే ప్రణాళికతో ఉన్నట్లు చెప్పారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ' బీజేపీ-దొంగ ఓట్ల సృష్టీకరణ - అధికారాన్ని చేజిక్కించుకోవడం' అనే అంశాలపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. బీజేపీ అధికారంలోకి రావడానికి దొంగ ఓట్ల వినియోగం చేసిందనే అంశంపై రాహుల్‌గాంధీ వివరణ, సందేశాలతో కూడిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ జరిగింది. తొలుత రాహుల్ గాంధీ సందేశాన్ని వినిపించారు. దేశ ఎన్నికల సంఘం బీజేపీతో కుమ్మక్కు అయ్యిందని రాహుల్‌గాంధీ చెప్పడం, దొంగ ఓట్ల కారణంగానే బీజేపీ అధికారంలోకి వచ్చిందనే అంశాలతో కూడిన రాహుల్‌గాంధీ ప్రసంగాన్ని ప్రజెంటేషన్ ద్వారా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు తిలకించారు. అనంతరం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. టీపీసీసీ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. సంపూర్ణ అవగాహనతో దొంగ ఓట్ల వినియోగం, బీజేపీ కుట్రలను గ్రామాల నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ శ్రేణులు ఇంటింటికి వివరించాలని ఆదేశించారు. ఓటు దోపిడీ ద్వారా బీజేపీ అధికారంలోకి రావడాన్ని అడ్డుకోకపోతే ప్రజాస్వామ్యానికే పెనుముప్పుగా పరిణమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్, టీపీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, సయ్యద్ విజయశ్రీ రజాలీ, వేముల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్‌తో పాటు వీసం సురేందర్‌రెడ్డి, దేవేందర్‌రావు, అజీజ్ ఉల్లా, రామక్రిష్ణ, అంకుస్, నాయకులు పాల్గొన్నారు.

నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి



వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్టు గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ తెలిపారు.

ఆటలు ఉన్నా.. కోచ్‌లు సున్నా..


కోచ్ లేక స్వయంగా ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

- జీడబ్ల్యూఎంసీలో శిక్షకులు లేక క్రీడలపై నిర్లక్ష్యం
- పట్టించుకోని గ్రేటర్ అధికారులు, పాలకవర్గం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఆవరణలో కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఇండోర్ స్టేడియం ఎందుకు పనికి రాకుండా పోతోంది. వర్ధమాన క్రీడాకారులను వివిధ క్రీడాంశాల్లో తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన ఇండోర్ స్టేడియం కోచ్‌లు లేక నిరుపయోగంగా మారింది. ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, జూడో, టేబుల్ టెన్నిస్ కోర్టులతోపాటు అధునాతన జిమ్‌ను ఏర్పాటు చేశారు. కానీ ఈ క్రీడాంశాలకు ఒక్క కోచ్ కూడా లేకపోవడంతో క్రీడలపై నీలినీడలు అలుముకున్నాయి. కాగా, ఇటీవల కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ స్టేడియం సందర్శించి కోచ్ గురించి ఆరా తీసినట్లు తెలిసింది.

ఇతర పనులకు..

ఇండోర్‌స్టేడియం శానిటేషన్‌విభాగాల సామగ్రి భద్రపరిచేందుకు (మిగతా 8వ పేజీలో)


బొగత జలపాతం వద్ద సందర్శకులు

జలం.. జనం

బొగత వద్ద సండే సందడి

తెలంగాణ నయాగరా బొగత జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పాల నురగల జాలువారుతున్న జలధారలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తున్నాయి. బొగత అందాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి మైమరచిపోయారు. జలపాతం జలధారల వద్ద ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. సుమారు 3వేల మంది పర్యాటకులు వచ్చి ఉంటారని ఫారెస్టు అధికారులు తెలిపారు.

- వాజేడు (ఆంధ్రజ్యోతి)

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


మురళి మృతదేహం

కేసముద్రం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మండలం తాళ్లపూస పల్లికి చెందిన వల్సాని మురళి(39) కుటుంబ కలహాలతో గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. మద్యానికి బానిసైన మురళి తరచూ ఆయన భార్య రేణుకతో గొడవపడుతూ తాను చనిపోతానని బెదిరిస్తుండే వాడు. శనివారం మధ్యాహ్నం రేణుక తన సోదరులకు రాఖీ కట్టేందుకు తల్లిగారి ఇంటికి వెళ్లగా అతిగా మద్యం సేవించి ఉన్న మురళి గ్రామంలోని చెరువు మత్తడి వద్ద గడ్డి మందు తాగి అక్కడే పడిపోగా కుటుంబ సభ్యులకు సమాచారం తెలిసి 108లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విష మించడంతో అదే రోజు రాత్రి వరంగల్ ఎంజీఎంకు తీసుకువెళ్లగా రాత్రి 11 గంటల ప్రాంతంలో చికిత్సపొందుతూ ఎంజీఎంలో మృతి చెందాడు. మృతునికి భార్య రేణుక, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి అన్న యాకన్న ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

భవనం పైనుంచి జారి పడి వ్యక్తి మృతి


ఐలయ్య(ఫైల్)

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మూడో అంతస్థు బాల్కానీ నుంచి ఆదివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. స్థానికులు, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని ఇనుగుర్తి మండలం చిన్న నాగారం గ్రామానికి చెందిన నాయిని ఐలయ్య (57) కొంత కాలంగా మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడు తున్నాడు. ఈ క్రమంలో అతడికి తీవ్ర జ్వరం రావడంతో చికిత్స కోసం ఈ నెల 8న జిల్లా ఆస్పత్రిలో చేరాడు. మూడు రోజుల నుంచి వైద్యులు అత నికి చికిత్సనందిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున ప్రమా దవశాత్తు ఆస్ప త్రి మూడవ అంతస్థు బాల్కానీ నుంచి జారి కింద పడి అక్క డికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుతున్నట్లు టౌన్ ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి..

గణపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కోటకాల్వ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పట్టణంలోని కారల్ మార్క్స్ కాలనీకి చెందిన మార్పికుసుందర్ జగదీశ్, దాసరి జగదీశ్ (22) స్నేహితులు. ఇద్దరు ఆదివారం రామప్ప ఆలయానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గణపురంలోని కోటకాల్వ వద్ద తమ ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగానే దాసరి జగదీశ్ మృతి చెందాడు. మృతుడు ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మార్పికుసుందర్ జగదీశ్ సింగరేణి కార్మికుడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని సింగరేణి ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

రైలులో గంజాయి పట్టివేత?

కేసముద్రం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ఆదివారం రైల్వే పోలీసులు గంజాయిని పట్టుకున్నట్లు తెలిసింది. ఉదయం ఆగి ఉన్న రైలును తనిఖీ చేయగా సుమారు నాలుగు ప్యాకెట్లలో గంజాయి లభించినట్లు సమాచారం. అయితే గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులు పోలీసులకు చిక్కకుండా వదిలేసి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై వరంగల్ ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గంజాయి లభించింది వాస్తవమేనని, దీనిపై స్థానిక పోలీసులతో కలిసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

కొక్కొరో..కో..

- బోనాల పండుగలో ఆకర్షణీయంగా కోడిపుంజు
- బుట్టాలు, మద్యం సీసాతో అలంకరణ



కేసముద్రం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బోనాల పండుగలో మొక్కులు సమర్పించేందుకు కోళ్లను తీసుకువెళ్లడం సాధారణమే. ఇందుకు భిన్నంగా కోడిపుంజుకు బుట్టాలు, మద్యం సీసాతో అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లడం ఆకర్షణీయంగా మారింది. కేసముద్రం స్టేషన్ కిష్టాపురానికి చెందిన తోడేటి వెంకన్న 11 ఏళ్లుగా కోడి పుంజును ఏటా బోనాల పండుగకు ఇలాగే అలంకరించి తీసుకువెళుతున్నాడు. ఆదివారం నిర్వహించిన బోనాల్లో ఈ కోడి పుంజు ఆకర్షణీయంగా ఉండడంతో పలువురు ఈ కోడితో ఫొటోలు దిగారు.

పూజా సామగ్రి పిరం

వరుస పండుగల ఎఫెక్ట్
కొబ్బరికాయ పూలు, పండ్ల ధరలకు రెక్కలు


మహబూబాబాద్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పూలు


మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కొబ్బరికాయలు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసంలో వరుసగా మూడు రోజులు పండుగలు రావడంతో పూజకు వినియోగించే కొబ్బరికాయ, పండ్లు, పూల ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో ధరల కంటే అవి రెట్టింపయ్యాయి. ఈ నెల 08న శ్రావణ శుక్రవారం రోజున వరలక్ష్మివ్రతం, 09న రాఖీ పర్వదినం, 10న ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ నిర్వహించారు. శ్రావణ శుక్రవారం రోజున మహిళలంతా వరలక్ష్మివ్రతం నిర్వహించారు. ఇందులో లక్ష్మిదేవత పూజల్లో పూలు, పండ్లు, కొబ్బరికాయను వినియోగిస్తారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు నూతన వస్త్రాలతో పాటు పండ్లు ఇస్తారు. రాఖీ పర్వదినం రోజున సోదరులకు రాఖీ కట్టాక సోదరీమణిలకు నూతన వస్త్రాలతో పాటు పండ్లను కూడ ఇస్తారు. ఆదివారం ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను నిర్వహించారు. ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇందులో ముత్యాలమ్మ తల్లి విగ్రహానికి పూల దండలు వేసి, నారికేళం సమర్పిస్తారు.

ఇలా వరుసగా మూడు రోజులు పండుగలు రావడంతో వాటికి ఉపయోగించే పూలు,పండ్లు, కొబ్బరికా యల ధరలు గతంలో కంటే రెట్టింపు ధరలతో విక్రయించారు. గతంలో డజను అరటి పండ్లు రూ.50 నుంచి 60 ఉంటే ఇప్పుడు రూ.80 కి విక్రయిస్తున్నారు. యాపిల్ పండ్లు గతంలో ఒక్కదానికి రూ.20 నుంచి 25లకు విక్రయించేవారు. ఇప్పుడు కిలో లెక్కన విక్రయిస్తున్నారు. కేజీ రూ.150కి అమ్ముతున్నారు. కేజీకి నాలుగు నుంచి ఐదు మాత్రమే వస్తున్నాయి. అంటే గతంలో రూ.100కు వచ్చే యాపిల్ పండ్లు ప్రస్తుతం రూ.150 ధర పలుకుతుంది. ఇక కొబ్బరికాయ విషయాని కొస్తే గతంలో ఒక్కటి రూ.20 నుంచి 25 ధర పలికేది. తాజాగా 35కు విక్రయిస్తున్నారు. గతంలో మూర పూలు రూ.25 నుంచి 30 ఉంటే ప్రస్తుతం రూ.50 ధర పలుకు తోంది. అదే విధంగా చెటాక్ పూలు రూ.50కి విక్రయిస్తున్నారు. వరుసగా పండుగలు రావడంతో పూలు, పండ్లు, నారికేళం ధరలు రెట్టింపు అయ్యాయి.

అమ్మవారి సన్నిధిలో
ఐఏఎస్ అధికారి


పూజలు చేస్తున్న ఐఏఎస్ అధికారి వీపీ గౌతం

వరంగల్ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. శ్రావణ మాసం ఆదివారం కావడంతో ఉదయం నుంచే భక్తుల రద్దీ ప్రారంభమైంది. సాయంత్రం వరకు కూడా భక్తుల దర్శనాలు కొనసాగాయి. సీనియర్ ఐఏఎస్ అధికారి వీపీ గౌతం కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ధర్మకర్తలతోపాటు ఆలయ పర్యవేక్షకులు అద్దంకి విజయ్‌కుమార్ స్వాగతం పలికారు. అదేవిధంగా జైళ్ల శాఖ ఐజీ మురళిబాబు దంపతులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

చదువుతోనే విజ్ఞానం

పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క


చిన్నారి విద్యార్థులతో భోజనం చేస్తున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చదువుతోనే ప్రతి ఒక్కరికీ విజ్ఞానం కలుగుతుందని రాష్ట్ర పంచాయితీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మొండ్యాల తోగు గొత్తికోయ గుంపులో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన పాఠశాల నూతన భవనాన్ని మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యను అభ్యసించడం ద్వారా విజ్ఞానం పెంపొందిచుకోచ్చునని అన్నారు. విద్యా ద్వారా జీవితాల్లో వెలుగులు నింపొచ్చని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. అభయారణ్యంలో ఈ ప్రాంతం ఉండడం వల్ల అటవీ శాఖ అనుమతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. దీంతో ఈ ప్రాంత చిన్నారులకు విద్యను అందించాలనే సంకల్పంతో పీపుల్ హెల్పింగ్ సెంటర్ అనే స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహాయంతో ఈ పాఠశాల నూతన భవనం నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. అనంతరం గొత్తికోయ చిన్నారులతో కలిసి మంత్రి, కలెక్టర్ దివాకర భోజనం చేశారు ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, డాక్టర్ తరుణ్ రెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

ఎంపీకి వినతిపత్రం అందజేసిన భూ నిర్వాసితులు


వినతిపత్రం అందజేస్తున్న అయోధ్యపురం వాసులు

కాజీపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూ నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ ఆదివారం హనుమకొండలోని ఎంపీ నివాసంలో ఎంపీ కడియం కావ్యకు అయోధ్యపురం వాసులు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రంలో రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణంలో తమ గ్రామస్థులు భూమి కోల్పోయారని తెలిపారు. మరికొన్ని రోజుల్లో పూర్తికానున్న కోచ్ ఫ్యాక్టరీలో భూ నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పినట్లు పేర్కొన్నారు. అర్హులను జిల్లా కలెక్టర్ గుర్తిస్తారని చెప్పారన్నారు. ఈ మేరకు అర్హులను జిల్లా కలెక్టర్ గుర్తించే విధంగా చర్యలు తీసుకోనేందుకు చొరవ చూపాలని ఎంపీ కావ్యను కోరారు.

ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ అర్హులను గుర్తించేందుకు చొరవ చూపడమే కాకుండా రైల్వే మంత్రిని, జీఎంను కలిసి భూ నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణ రైల్వే ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అయోధ్యపురం మాజీ సర్పంచ్ గాదం యాదగిరి, స్థానిక రైతులు మెరుగు రాజయ్య, ఇలాసాగరం వీరయ్య, మామిండ్ల భిక్షపతి, ప్రవీన్‌కుమార్, కాయిత కుమార్, జి.విజయ్‌కుమార్, బి.రాజు, రాము, జె.అనిల్, కె.కుమారస్వామి, జి.శ్రీనివాస్, జె.వినక్షద్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

● టీసీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : అవినీతి, అక్రమాలకు పాల్పిడిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రతి నిధులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురవారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారెడ్డి పాల్గొని మాట్లాడారు. అవినీతిలో కూరుకపోయి క్రికెట్ క్రీడాకారును జీవితాలతో అటలాడుతున్న హెచ్‌సీఏ సభ్యులపై క్రమ శిక్షణ చర్యలు చేపడుతూ కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో టీసీఏ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు.

2021 జూలైలో బీసీసీఐ ఇచ్చిన కోలాబిరేషన్ ఆదేశాలను హెచ్‌సీఏ పాటించకుండా తెలంగాణలో క్రికెట్ అభివృద్ధిపై శ్రద్ధ పెట్టలేదని ఆయన విమర్శించారు. ప్రస్తుతం టీసీఏ కోరేది కొలాబిరేషన్ కాకుండా మెంబర్‌షిప్ కావాలని, రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అందరు ముందుకు వచ్చి టీసీఏకు రాష్ట్రంలో గుర్తింపు తీసుకు రావాలని గురువారెడ్డి కోరారు. ఈ సమావేశంలో టీసీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ విజయ్ చందర్‌రెడ్డి, జయపాల్, సభ్యులు జగన్, జాకీర్, శివ, శశాంక్, నవరసాన్. సమీ, శరత్, తదితరులు పాల్గొన్నారు.

కూలి డబ్బులు అడిగినందుకు హత్య


మృతుడు రాజాబాబు (ఫైల్)

కన్నాయిగూడెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కూలి డబ్బులు అడిగినందుకు కత్తితో దాడి చేసి హత్య చేసిన సంఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం సర్వాయిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాయిగూడెం మండలం ఏటూరు గ్రామానికి చెందిన మడే రాజాబాబు (36)కు సర్వాయికి చెందిన బేబీతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. పదేళ్లుగా రాజాబాబు భార్యతో కలిసి అత్తగారి ఊరిలో నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం రాజాబాబును బుట్టాయిగూ డెం గ్రామానికి చెందిన కుమ్మరి బాబు అనే తాపీ మేస్త్రీ సిమెంటు పనులకు పిలిచాడు. రాజాబాబు కు ఇంట్లో పనులు తీరకపోవడంతో ఆలస్యంగా వెళ్లాడు. సాయంత్రం పనులు ముగిసాక ఇంటికి వెళ్లే క్రమంలో డబ్బులు అడగ్గా సగం కూలినే ఇస్తానని మేస్త్రీ బాబు తేల్చిచెప్పాడు. ఇదేం అన్యాయమని రాజాబాబు ప్రశ్నించగా అసలుకు డబ్బులే ఇవ్వను ఏం చేసుకుంటావో చేసుకో అంటూ మేస్త్రీ బాబు తన ఊరికి వెళ్లిపోయాడు. అనంతరం ఇంటికి చేరిన రాజాబాబు తన బామ్మర్ది పీరీల సురేష్‌కు ఈ విషయం చెప్పాడు. భోజనం చేసేటప్పుడు ఇద్దరు దీనిపై మాట్లాడుకుంటుండగా రాజాబాబు ఇంటి పక్కనే ఉన్న బాబు బామ్మర్ది కోరం రంజిత్ ఇది విని గొడవకు వచ్చాడు. తన బావను డబ్బులు ఎలా అడుగుతావంటూ చంపుతానని బెదిరించి వెళ్లాడు.

రాత్రి అందరూ నిద్రపోయిన తర్వాత రాజాబాబు ఇంటికి వెళ్లిన రంజిత్ తలుపులు గట్టిగా తన్ని లోనికి చొరబడ్డాడు. రాజబాబుపై కత్తితో దాడి చేశాడు. రాజాబాబు కేకలు వేయడంతో అక్క డి నుంచి పారిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న రాజాబాబును భార్య బేబి గ్రామస్థుల సహాయంతో ట్రాక్టరు ద్వారా కన్నాయిగూడెం పీహెచ్‌సీకి తర లించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఏటూ రునాగారంలోని సామాజిక వైద్యశాలకు తరలించారు. పరిశీ లించిన డాక్టర్లు అప్పటికే రాజాబాబు మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య బేబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మృతు డికి 10 ఏళ్లలోపు ఒక కొడుకు, కూతురు ఉన్నారు.

సరళమైన భాషే పాఠకులకు చేరువ

ఘనంగా మా బాపు కవితా సంపుటి ఆవిష్కరణ


కవితా సంపుటిని ఆవిష్కరించిన అంపశయ్య నవీన్

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం సృజించడంలో సరళమైన భాష ప్రధాన భూమిక పోషిస్తుందని ఆ భాషే పాఠకులకు మరింతగా చేరువవుతుందని, పలుకుబడుల భాషను సాహిత్యంలో ఎక్కువగా ప్రయోగించాలని ప్రముఖ నవలాకారుడు కేంద్ర సాహి త్య అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. ఆది వారం వడ్డెపల్లిలోని టీచర్స్ కాలనీ కమ్యూనిటీ హాలులో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి ఇటీవల మృతి చెందిన ఎరబాటి రాజగోపాల్‌రావు రాసిన మా బాపు కవితా జరిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడా రిటైర్డ్ ఏజీఎం మారెపల్లి రవీందర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నవీన్ మాట్లాడుతూ.. రాజగోపాల్‌రావు మృతి చెందిన ఆయన సాహిత్యం వెలుగులోకి వచ్చేందుకు కుటుంబ సభ్యులు చేసిన కృషిని నవీన్ ప్రశంసించారు.

పుస్తకాన్ని సమీక్షించిన మరో కవి బిల్లా మహేందర్ అతని కవిత్వంలో ప్రశ్నించేతత్వంతోపాటు మానవీయ విలువలు ఉన్నాయని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్.విద్యార్థి మాట్లాడుతూ తెలుగులోనే కాక ఉర్దూ, ఆంగ్ల భాషాల్లో ప్రవీణ్యం ఉండడం కవి ప్రత్యేకమని పేర్కొన్నారు. తెలుగు భాషోపాధ్యాయులు కంది శంకరయ్య, ఏ.రామ్‌కిషన్‌రావు, హరిప్రకాశ్‌రావు, సుదర్శన్‌రావు, సదాశివశంకర్, పద్మలత, శీల, వసుమతి, రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాఖీ వేళ రెక్కీ!

- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్ ● ఒకే రాత్రి 9 ఇళ్లలో చోరీకి పాల్పడ్డ దొంగలు
- భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో బీభత్సం
- 22 తులాల బంగారం, రూ.2.75 లక్షల నగదు అపహరణ


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్


బీరువాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

కృష్ణకాలనీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగకు సొంతూళ్లకు వెళ్లిన వారి ఇళ్లనే టార్గెట్‌గా చేశారు. రోజంతా రెక్కీ నిర్వహించి తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంచుకున్నారు. అర్ధరాత్రి వేళా అందరూ నిద్రిస్తున్న తరుణంలో ఆ ఇళ్లలోకి వెళ్లి దొంగలు చేతివాటాన్ని ప్రదర్శించి భారీగా బంగారం, నగదు అపహరించుకెళ్లిన ఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాఖీపండగను పురస్కరించుకొని కాలనీకి చెందిన సుమారు 9 కుటుంబాలకు చెందిన వారు సొంతూళ్లకు వెళ్లారు. ఆదివారం ఉదయం తలుపులు తీసి ఉండటం, ఎవరి అలికిడి లేకపోవడంతో చుట్టు పక్కల వారు గమనించి ఇంటి యజమానులకు, పోలీసులకు సమాచారం అందించారు. భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ నేతృత్వంలో డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్ సిబ్బంది బాధిత ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు.

కాలనీకి చెందిన బడితెల సంతోష్‌కు సంబంధించి 12 తులాల బంగారం, 58 వేల నగదు, చదువు రాకేష్‌రెడ్డి ఇంట్లో రూ. 70వేల నగదు, ఓదెల సుమతి ఇంట్లో 8 గ్రాముల బంగారం, రూ. 35వేల నగదు, నగునూరి రాజశేఖర్ ఇంట్లో 1 తులం బంగారం, రూ. 37వేల నగదు, ఆకుల రాజ్‌కుమార్ ఇంట్లో 1 తులం బంగారం, రూ. 30వేల నగదు, మాచనపల్లి సురేష్ ఇంట్లో 5 తులాల బంగారం, ఎలమాద్రి ప్రవీణ్ ఇంట్లో తులంన్నర బంగారం, రూ. 45వేల నగదు పోయినట్లుగా బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు పోలీసులకు సైతం వారంతా ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఇక వీరితో పాటు ఇదే కాలనీకి చెందిన జక్కుల రాములు, సిరిమల్ల తిరుపతిల ఇంట్లో సైతం చోరీకి పాల్పడ్డారు. కానీ, వీరి ఇంట్లో విలువైన వస్తువులు, లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. కాగా, ఇప్పటి వరకు తమకు రెండు ఫిర్యాదులు అందాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ నరేష్‌కుమార్ వెల్లడించారు. రెండు వీధుల్లో గల 9 ఇళ్లలో చోరీ జరిగిన నేపథ్యంలో పోలీస్ డాగ్‌లతో విస్తృతంగా తనిఖీ చేపట్టారు. అలాగే, క్లూస్ టీమ్ సిబ్బంది బాధితుల ఇళ్లలోని బీరువాల వద్ద వేలిముద్రలను సేకరించారు.

సీసీ కెమెరాల్లో ఇద్దరు అనుమానితులు.?

లక్ష్మీనగర్‌లోని రెండు వీధుల్లో చోరీకి పాల్పడిన ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. ఏకంగా 9 ఇళ్లలో చోరీకి జరిగిన వ్యవహారం జిల్లా కేంద్రంలో హాట్ టాపిక్‌గా మారింది. అంతర్రాష్ట్ర దొంగల ముఠానా లేక, చిన్నాచితక దొంగలా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ఆరంభించినట్లు తెలిసింది. అయితే, ఓ వీధిలో ఉన్న సీసీ కెమెరాల్లో ఇద్దరు అనుమానిత వ్యక్తులు రికార్డు అయినట్లుగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. సదరు వ్యక్తులు సీసీ కెమెరాల్లో తమ మొహాలు కనిపించకుండా సెల్‌ఫోన్ లైట్‌ను సీసీ కెమెరాకు కొట్టినట్లుగా తెలుస్తోంది.

బాధితులకు ఎమ్మెల్యే భరోసా..

చోరీ జరిగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆ కాలనీలో పర్యటించి బాధితులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను గుర్తించి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కాలనీల్లో పోలీసుల భద్రత పెంచాలని, సీసీ కెమెరాలు ఎక్కువగా ఏర్పాటు చేయాలని, ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

జీవవైవిధ్యం.. మ్రానుకోట

- విశాలమైన అడవులకు జిల్లా నెలవు
- ఆయా ప్రాంతాల్లో వన్యప్రాణుల సందడి
- అడవులు.. జలపాతాలతో ప్రత్యేక గుర్తింపు
- ప్రకృతి ప్రసాదాలు.. వన్యప్రాణులు
- సకల జీవరాశులకు నిలయం



మానుకోట అడవిలో సంచరిస్తున్న జింకలు

గూడూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : అందమైన వన్యప్రాణుల జీవన కేంద్రం 'మ్రాను' కోట జిల్లా అభయారణ్యం. సకల ప్రాణుల జీవన విధానం.. వైవిధ్యభరితం.. పరిపోషకాలు.. స్వయం పోషకాలుగా తమ జీవనాన్ని సాగిస్తున్నాయి. పక్షుల కిలకిల రావాలు.. సెలయేటి సవ్వళ్లు.. గలగల పారే నదులు.. సవ్వడి చేసే జలపాతాలు, విశాలమైన పచ్చని అడవి జిల్లా మానుకోట సొంతం. 1.40 లక్షల చదరపు కి.మీ. విస్తీర్ణంలో మహబూబాబాద్ జిల్లాలో అడవులు వ్యాపించి ఉన్నాయి. ప్రకృతి రమణీయతకు నెలవైన మానుకోట ఆరణ్యం వన్యప్రాణుల ఖిల్లాగా ఖ్యాతి గాంచింది. ఎన్నో అరుదైన జంతువులు.. వృక్ష సంపదకు ఇది నిలయం. అంతరించి పోతున్న ఎన్నో వన్యప్రాణులకు ఈ అభయారణ్యం ఆవాసంగా మారుతోంది. జీవవైవిధ్యానికి నిలయంగా నిలుస్తోంది. అప్పుడప్పుడు పెద్ద పులులు, చిరుతలతో పాటు నిత్యం అనేక రకాల వన్యప్రాణులు, పక్షులు, రంగురంగుల సీతాకోక చిలుకలు సంచరిస్తున్నాయి. చుక్కల దుప్పులు, ఎలుగుబంట్లు, కనుజు, మనుబోతులు, నాలుగు కొమ్ముల జింకలు, కృష్ణజింకలు, నక్కలు, రేసు కుక్కలు, హైనాలు, అడవి పిల్లులు, అడవి పందులు, సాంబర్లు, కొండ గొర్లు, కుందేళ్లు, తోడేళ్లు, నెమళ్లు, అడవి బర్రెలు, బెట్టు ఉడుతలు, మొసళ్లు, కొండచిలువలు, సర్పాలు.. అధిక సంఖ్యలో సందడి చేస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో విస్తారమైన అటవీ ప్రాంతం ఉంది. ఆ అందాలను వీక్షిస్తూనే అందులో నివసిస్తున్న వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

వేట నివారణకు ప్రత్యేక నిఘా

అడవిలో ఉంటూ స్వేచ్ఛగా జీవిస్తున్న వన్యప్రాణులపై వేటగాళ్లు పంజా విసురుతున్నారు. వాటిని వేటాడి మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వేట నిర్మూలనకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. వన్యప్రాణులను వేటాడిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. పలువురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. శిక్షలపై అటవీ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కళాజాతా బృందం సభ్యులతో వన్యప్రాణుల సంరక్షణపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో మూడేళ్లుగా వేట తగ్గినట్లు కన్పిస్తోంది.

జిల్లా అడవులకు అరుదైన గుర్తింపు

మహబూబాబాద్ జిల్లా అడవుల్లో వృక్ష, జంతు సంపద పెరిగింది. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఫలించాయి. రాష్ట్ర అటవీశాఖ ప్రధాన అధికారి(పీసీసీఎఫ్) సువర్ణ 'వెరీ గుడ్' గుర్తింపు ఇవ్వడంతో మహబూబాబాద్ జిల్లా డీఎఫ్‌వో బత్తుల విశాల్ నేతృత్వంలో గూడూరు, మహబూబాబాద్ ఎఫ్‌డీవోలు చంద్రశేఖర్‌రావు, వెంకటేశ్వర్లు, గూడూరు, కొత్తగూడ, గంగారం, బయ్యారం, మహబూబాబాద్, డోర్నకల్, తొర్రూరు రేంజ్ అధికారులు సురేష్, వజహత్, మంగీలాల్, సువర్చల, జ్యోత్స్నదేవి, రేణుక, విజయలక్ష్మితో పాటు అధికారులు, సిబ్బంది వన్యప్రాణుల సంరక్షణ, వృక్ష జాతుల పరిరక్షణలో రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాకు అడవుల జిల్లాగా గుర్తింపు ఉంది. రిజర్వ్ ఫారెస్ట్, అడవుల సంరక్షణలో భాగంగా 2016 నుంచి తెలంగాణ ప్రభుత్వం స్మగ్లర్ల ఆట కట్టించేందుకు కఠిన చట్టాలు తేవడంతో మహబూబాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో వృక్ష సంపద విస్తరించింది.



అటవీ శాఖ వారు ఏర్పాటు చేసిన సాసర్ ఫిట్

చట్టం ఏం చెబుతుందంటే..

వన్యప్రాణులను వేటాడడం నిషేధమని చట్టం చెబుతుంది. అరణ్యంలో వేటగాళ్లు నిత్యం అడవి జంతువుల పాలిట మరణ మృదంగాన్ని మోగిస్తూనే ఉన్నారు. వేటగాళ్లు అమర్చే ఉచ్చులు, విద్యుత్ తీగలు వన్యప్రాణుల ప్రాణాలు ఏదో ఒక ప్రాంతంలో పోతూనే ఉన్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం.. అటవీ జంతువులను వేటాడితే మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో మొత్తం 6.26 లక్షల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి.



భీమునిపాదం జలపాతం

వన్యప్రాణుల సంఖ్య కూడా పెరిగింది. శాఖాహార జంతువులతో పాటు మాంసాహార జంతువుల సంచారం పెరిగింది. ఆయా రేంజ్‌ల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో అటవీ అధికారులు సుమారు 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిత్యం అడవులు, వన్యప్రాణుల పరిరక్షణకు కృషి చేస్తున్నారు. ఏడు రేంజ్ కార్యాలయాలతో 50కి పైగా బ్లాకులతో అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ పనిచేస్తోంది.

సంరక్షణకు చర్యలు ఇలా..

వన్యప్రాణులను కాపాడేందుకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. సాసర్ ఫిట్లు, నీటి తొట్టెలలో ప్రతిరోజూ నీటిని పోయడం, నిర్మానుష్య ప్రదేశాల్లో అడవి జంతువులు సంచరించే ప్రాంతాల్లో ఉప్పు గడ్డలు వేయడం, పచ్చని గడ్డిని నీటితొట్లు, సాసర్ ఫిట్లు ఉన్న చోట వేయడం లాంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. అటవీ అధికారులు ఎవరి బీట్ పరిధిలో వారు నిత్యం క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ అడవుల్లో వేటగాళ్లు ఏమైనా విద్యుత్ వైర్లు అమర్చారా ? ఉచ్చులు పెట్టారా ? అని తనిఖీలు చేపడుతున్నారు. అటవీ జంతువులు ఆనవాళ్లు ఎక్కడైనా ఉన్నాయా ? లేవా ? అని తెలుసుకునేందుకు అవి సంచారించే ప్రదేశాల్లో కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేశారు. ప్రధానంగా అడవులో నీటి వనరులు ఉన్నచోట కెమెరా ట్రాప్‌లు, ఉప్పు గడ్డల వంటివి ఏర్పాటు చేసి వాటి ఆనవాళ్లను సేకరిస్తారు.

రాబోయే తరాలకు చూపిద్దాం..

వన్యప్రాణుల రక్షణను బాధ్యతగా తీసుకుని రాబోయే తరాలకు వాటిని చిత్రాల్లో కాకుండా నేరుగా చూసే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది. వన్యప్రాణులు అంతరించి పోకుండా కాపాడుకుందాం. చుక్కల దుప్పులు, చెంగు.. చెంగున ఎగిరే కొండ గొర్రెల అందాలను అంతరించి పోకుండా కాపాడుకోవాలి. అమాయక జీవులు, జీవవైవిధ్యంలో ప్రత్యేక గుర్తింపు గల జంతువులు, ప్రకృతి ప్రసాదాలు. జీవవైవిధ్యంలో ఏ ఒక్క వన్యప్రాణి అంతరించినా.. అనర్థాలు కలుగుతాయి. అందుకే అడవి తల్లి ఒడిలో సేద తీరే వన్యప్రాణులను స్వేచ్ఛగా బతుకనిద్దాం.

మానుకోట అడవులకు ఘనమైన చరిత్ర

బత్తుల విశాల్ డీఎఫ్‌వో, మహబూబాబాద్ జిల్లా



మానుకోట అడవులకు ఘనమైన జీవవైవిధ్య వారసత్వ సంపద ఉంది. రకరకాలైన మొక్కలు, వృక్షాలు, జంతు జాతులతో జీవవైవిధ్యమైన ప్రత్యేకతను సొంతం చేసుకుంది. వీటిని పరిరక్షించుకునే విషయంలో ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం. పర్యావరణం, ప్రకృతి, జీవవైవిధ్యం నుంచి మనం ఏం పొందుతున్నాం.. వాటి వల్ల ప్రయోజనాలు కొనసాగాలంటే ఏ విధంగా వాటిని రక్షించాలో మనం తెలుసుకోగలగాలి.

సాగులో యాంత్రీకరణ

- రైతులకు రాయితీపై యంత్రాలు
- ఉమ్మడి జిల్లాకు రూ.4.90 కోట్ల నిధులు
- పంపిణీ చేయనున్న 13,977 వ్యవసాయ పరికరాలు
- ఈనెల 16 వరకు దరఖాస్తుల స్వీకరణ
- రైతులకు తీరనున్న కూలీల కొరత



హనుమకొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో రైతులు కూలీల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్. సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దుక్కులు దున్నడం, నాట్లు, కలుపు తీయడం, పంటలకు ఎరువులు వేయడం, పురుగుల మందులు చల్లడం, పంట చేతికి వచ్చిన తర్వాత కోత కోయడం వంటి పనులన్నీ కూలీలు లేకుండా రైతు ఒక్కడే చేసుకోలేడు. వ్యవసాయ యంత్ర పరికరాలు ఎంతగా మార్కెట్‌లోకి వచ్చినా అవి అందరికి అందుబాటులో లేవు. వీటి ధర కూడా లక్షల్లో ఉండడంతో చిన్న, సన్నకారు రైతులు కొనలేనిస్థితి. ఈ పరిస్థితుల్లో కూలీల కొరతను అన్నదాతలు అధిగమించేందుకు, కూలీల ఖర్చును తగ్గించేందుకు వీలుగా వివిధ రకాల వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై రైతులకు అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ వాటాతో ఈ పరికరాలను సమకూర్చేందుకు ముందుకు వచ్చింది.

ఎనిమిదేళ్ల తర్వాత..

వ్యవసాయ రంగ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నాయి. కొన్నేళ్ల క్రితం ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారికి రాయితీపై యంత్ర పరికరాలు అందించే వారు. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరికరాలు పంపిణీ చేయడాన్ని మానేసింది. దీంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు లోనవుతూ వచ్చారు. ఈ క్రమంలోనే తాజాగా కేంద్ర ప్రభుత్వం రాయితీపై యంత్ర పరికరాలు మంజూరు చేసేందుకు సన్నద్ధమైంది. సన్న, చిన్నకారు రైతులకు వివిధ పరికరాలు అందించేందుకు సన్నాహాలు చేపట్టింది. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వాడకాన్ని ప్రోత్సహించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ యాంత్రీకరణ (ఫామ్ మెకనైజేషన్) పథకం అటకెక్కింది. యంత్రలక్ష్మి పేరుతో ప్రవేశపెట్టిన ఈ పథకం అమలు మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఈ పథకం 2017-18 ఆర్థిక సంవత్సరం వరకు మాత్రమే అమలై ఆ తర్వాత ఆగిపోయింది. వ్యవసాయంలో ఉపయోగపడే యంత్రాలను ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, బీసీ రైతులకు 50 శాతం రాయితీపై ఇచ్చేందుకు ఈ యాంత్రీకరణ పథకాన్ని ప్రవేశపెట్టారు. కానీ ఈ పథకం అమలుకు నోచుకోకపోవడంతో అప్పటి నుంచి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్మామ్ పథకం అమలులోకి రావడం అన్నదాతలకు ఊరటనివ్వనుంది.

సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్ (స్మామ్) పథకం కింద వ్యవసాయ యంత్ర పరికరాలను రాయితీపై పంపిణీ చేయనుంది. ఈనెల 6 నుంచి దరఖాస్తులను తీసుకోవడం ప్రారంభమైంది. ఈ నెల 16వ వరకు వీటిని స్వీకరించి పరికరాలు అందించేందుకు కసరత్తు జరుగుతోంది. అయితే ఈ పథకం గురించి చాలా మంది రైతులకు ఇప్పటి వరకు తెలియదు. అందుకే ఎక్కువ మంది ముందు రాలేకపోతున్నారు.

రూ.4.90 కోట్ల నిధులు

రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలను సబ్సిడీపై అందజేయడానికి ఉమ్మడి జిల్లాకు మొత్తం రూ. 4,90,44,713 నిధులు మంజూరయ్యాయి. ఈ మొత్తంలో వరంగల్ జిల్లాకు రూ. 87,19,989, హనుమకొండ జిల్లాకు రూ.73,31,360, జనగామ జిల్లాకు రూ.1,09,25,291, మహబూబాబాద్ జిల్లాకు రూ.1,15,85,837, ములుగు జిల్లాకు రూ. 38,18,829, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు రూ. 66,63,407 కేటాయించారు.

ఎంపిక విధానం

రాయితీ పరికరాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక కోసం రెండు కమిటీలు ఏర్పాటు చేస్తారు. ఒక దాంట్లో మండల వ్యవసాయాధికారి కన్వీనర్, తహసీల్దార్, ఎంపీడీవోలు సభ్యులుగా ఉంటారు. రూ. లక్ష లోపు యంత్రాలను పొందాలనుకునే వారిని ఈ కమిటీ ఎంపిక చేస్తుంది. మరో కమిటీలో కలెక్టర్ చైర్మన్, జిల్లా వ్యవసాయాధికారి కన్వీనర్‌గా, అగ్రోస్ రీజినల్ మేనేజర్, వ్యవసాయ శాస్త్రవేత్త, లీడ్ బ్యాంక్ మేనేజర్ సభ్యులుగా ఉంటారు. రూ. లక్ష కంటే ఎక్కువ ధర ఉన్న యంత్రాలు పొందాలనుకునే వారిని ఈ కమిటీ ఎంపిక చేస్తుంది.

50 శాతం రాయితీ

ఉమ్మడి జిల్లాలో 15.56 లక్షల మంది రైతులు 18.70 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రాయితీలు ఇస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం, మిగతా వారికి 40 శాతం రాయితీ వర్తిస్తుంది. గరిష్ఠంగా ఈ రాయితీ యూనిట్‌లో 50 శాతం వరకు ఉంటుంది. ఈ పథకం అమలుకు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా 2025-26 సంవత్సరానికి అన్ని రకాలు కలిపి ఉమ్మడి జిల్లాలో 13977 వ్యవసాయ యంత్ర పరికరాలను అందించనున్నారు. వీటిలో బ్యాటరీ స్ప్రేయర్లు (ఫూట్, మాన్యువల్లీ ఆపరేటెడ్) 10,326, పవర్ స్ప్రేయర్లు 2133, రొటోవేటర్లు 613, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ 118, డిస్క్‌హారో, కల్టివేటర్, ఎంబీపుష్, కేజ్ వీల్స్, రోటో ప్లడ్లర్ 742, బండ్ ఫార్మర్స్ 45 వీటిలో ఉన్నాయి. ఆసక్తి ఉండి అర్హులైన రైతులు సంబంధిత గ్రామ ఏఈవోలకు రాయితీ యంత్రాల కోసం దరఖాస్తు చేయాలి. పట్టా పుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా తదితర వివరాలు అందించాల్సి ఉంటుంది. అర్హులకు అందించే రాయితీ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తోంది. రైతుల నుంచి త్వరలో దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. అర్హులను గుర్తించి పరికరాలు అందిస్తాం. రైతులు తమ దరఖాస్తులను స్థానిక మండల వ్యవసాయాధికారి, ఏఈవోలకు సమర్పించాలి. సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి రావడం వల్ల రైతులకు కూలీల కొరత తీరుతుంది.

దామోదర్‌రెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకుడు, వరంగల్ జిల్లా

సాంకేతిక చదువులు

- సర్కారు బడుల్లో ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లు
- ఉమ్మడి జిల్లాలో 10 పాఠశాలలు ఎంపిక
- బడులకు చేరుకున్న ఎక్విప్‌మెంట్
- ప్రతీ సబ్జెక్టుతో అనుసంధానం
- విషయాన్ని సులభంగా అర్థం చేసుకునే అవకాశం



ఏఆర్, వీఆర్ ల్యాబ్ మెటీరియల్‌ను చూపిస్తున్న టీచర్లు

జనగామ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంలో ఎంపికైన పాఠశాలల్లో ప్రభుత్వ విద్యాశాఖ సాంకేతిక విద్య అమలు చేస్తూ ఆధునిక పరిశోధన కేంద్రాలుగా మారుస్తోంది. ఇంటర్నెట్‌తో కూడిన కంప్యూటర్ విద్య, డిజిటల్ తరగతులు, కనీస వసతి సౌకర్యాల కోసం నిధులు మంజూరు చేస్తున్న కేంద్రం కొత్త అగ్మెంటెడ్ రియాల్టీ (ఏఆర్), వర్చువల్ రియాల్టీ (వీఆర్) ల్యాబొరేటరీలను అందుబాటులోకి తీసుకువచ్చింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మొదటి విడత ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 10 పీఎంశ్రీ పాఠశాలలను ఎంపిక చేశారు.

ఎంపికైన ఉన్నత పాఠశాలలు

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి, కాజీపేట మండలం మడికొండ, భూపాలపల్లి మండలం గొల్లబుద్దారం, జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జడ్పీ ఉన్నత పాఠశాల, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల జడ్పీఎస్ఎస్, తొర్రూరు మండల కేంద్రంలోని బాలికల జడ్పీఎస్ఎస్, గూడూరు మండలం పొనుగోడు, దంతాలపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, వరంగల్ జిల్లా నర్సంపేట మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, రాయపర్తి మండలం కొండూరు ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయి.

ప్రయోజనాలు..

-ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లతో అస్ట్రానమీ, రెండో ప్రపంచ యుద్ధం, గుండె పనితీరు, మానవ శరీరంలోని అవయవాల కదలికలు, నాటి చరిత్రలు తదితర సబ్జెక్టుల వారీగా బోధన చేసే సమయంలో విద్యార్థులు ప్రత్యక్ష అనుభూతికి లోనవుతారు.

- దిగువ స్థాయి పిల్లవాడి నుంచి బాగా చదువుకునే స్టూడెంట్ వరకు ఏఆర్, వీఆర్ బోధన పరికరాలతో టీచర్ చెప్పే విషయాలను శ్రద్ధగా వింటారు.

- విద్యార్థులు గుండె, కణాల నిర్మాణం, వాటి విధులు, జీవశాస్త్ర, అస్ట్రానమీ లాంటి ఫిజిక్స్, గణితం, హిస్టరీ పాఠాలను ఇమ్మర్సివ్, ఇంటరాక్టివ్ టెక్నాలజీలను ఉపయోగించి వీఆర్ ద్వారా వాటిలోకి ప్రవేశించి స్వీయ అనుభవంతో నేర్చుకుంటారు.

- పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతీ పాఠశాలకు పది ఏఆర్, వీఆర్ పరికరాలు, ఒక బీన్ బ్యాగ్, ఒక చార్జింగ్ ట్రాలీ, ఒక ట్యాబ్, ఒక టీచర్ సపోర్టింగ్ ట్యాబ్, ఒక స్టోరేజ్ కేస్, ఒక కేవీఏ యూపీఎస్ పరికరాలను ల్యాబ్‌లో అమర్చనున్నారు.

- ఐదు నుంచి పదో తరగతి వరకు జనరల్ సైన్స్, గణితం, జీవశాస్త్రం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రాన్ని బోధించడానికి, విద్యార్థులు నేర్చుకోవడానికి అనుకూలంగా ఏర్పాటు చేస్తారు.

- 5డీ మోడ్‌లో..

వీఆర్ హెడ్‌గేర్ రాష్ట్ర పాఠ్యాంశాలకు మ్యాప్ చేసిన కంటెంట్‌తో లోడ్ చేశారు. దీని ద్వారా విద్యార్థులు ఇంటరాక్టివ్, 5డీ మోడల్‌లో పాఠాలను సులభంగా నేర్చుకోగలుగుతారు. గుండె పనితీరును బోధించే సమయంలో ఉపాధ్యాయులు బోర్డుపై హృదయ రేఖా చిత్రాన్ని గీసి చూపించాలి. వీఆర్ ఆధారిత అభ్యాసం విషయంలో హెడ్‌గేర్‌ను ఉపయోగించడంతో త్రీడీలో హృదయం తెరపై కనిపిస్తుంది. మనిషి ఆర్గాన్ పనితీరును విద్యార్థులు చూడడంతో పాటు సులభంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది.

పీఎంశ్రీ పాఠశాలల్లోనే ల్యాబ్‌లు

బొమ్మనబోయిన శ్రీనివాస్, ఏఎంవో, జనగామ



ప్రభుత్వం పీఎంశ్రీ పాఠశాలల పరిధిలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. పరికరాలు సైతం వచ్చేశాయి. ఇందుకు సంబంధించి పూర్తి గైడ్‌లైన్స్ జారీ చేశారు. మెటీరియల్ వినియోగం, నిర్వహణ కోసం పాఠశాలలోని ఫిజికల్ లేదా బయాలజీ టీచర్‌ను నియమిస్తారు. ఏజెన్సీ ద్వారా ఏఆర్, వీఆర్ ల్యాబ్‌ల పరికరాలు వచ్చిన వెంటనే హెచ్‌ఎంలు జాగ్రత్తంగా పరిశీలించుకోవాలి.

దేవాదుల ప్రాజెక్టుకే అత్యంత ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

చేపడుతున్నారని అన్నారు. గతంలో ఇక్కడ 38 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయాలని లక్ష్యం పెట్టుకున్నప్పటికీ ఆయకట్టు విస్తీర్ణం భారీగా పెరగడంతో 78 టీఎంసీలకు పైగా నీటిని ఎత్తిపోయాల్సి వస్తుందని డిప్యూటీ సీఎం అన్నారు. దీనిపై నీటిపారుదల శాఖ మంత్రి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించి ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేవని, పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 17 నియోజకవర్గాల రైతాంగానికి రెండు పంటలకు దేవాదుల నీరు అందించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు.

పక్కనే గోదావరి ఉన్నా అందని సాగునీరు : సీతక్క

దేవాదుల ప్రాజెక్టుపై జిల్లాలో సమీక్ష నిర్వహించడం ఇది రెండోసారి అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. పక్కనే గోదావరి ఉన్నా కన్నాయిగూడెం రైతులకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదుల ద్వారా రామప్ప చెరువు నిండితే ములుగులోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతాయని అన్నారు. తుపాకులగూడెం బ్యారేజీ, దేవాదుల బ్యారేజీ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు మానవీయ కోణంలో ఆలోచించి తగినంత నష్టపరిహారం అందించాలని కోరారు. మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగరంలో కెనాళ్లు నిర్మించి సాగునీటిని అందించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

దేవాదులకు పెరిగిన ఆయకట్టు : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

దేవాదుల ప్రాజెక్టు కింద ఆయకట్టు గణనీయంగా పెరిగిందని స్టేషన్ ఘనపురం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వీలైనంత త్వరగా సీడబ్ల్యూసీతో నీటి కేటాయింపులు జరిగేలా చూడాలన్నారు. నీటిని ఎత్తిపోయడానికి వినియోగిస్తున్న మోటార్లు మరమ్మతులకు గురికావడం వల్ల తరచూ సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. పంపుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. మూడో దశలోని ప్యాకేజీ ఆరు పనులను వెంటనే పూర్తిచేయాలని అన్నారు. ప్యాకేజీ ఆరు కింద స్టేషన్ ఘనపురం, వర్ధన్నపేట, పాలకుర్తి, తుంగతుర్తి నియోజకవర్గాల్లో 78వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందన్నారు. భూసేకరణ సమస్యలు త్వరగా పూర్తిచేసి సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు.

దేవాదుల ప్రాజెక్టు కింద పెరిగిన ఆయకట్టుకు నీటి కేటాయించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. అందుకు పరిష్కార మార్గం చూపాలని కోరారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ భీమ్‌ఘణపురం రిజర్వాయర్‌కు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. భీమ్‌ఘణపురం కింద చెరువులకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రామప్ప నుంచి గణపురం చెరువుకు నీరు వచ్చేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి, ములుగు కలెక్టర్ దివాకర, ఇన్‌చార్జి ఎస్పీ కిరణ్ ఖరే, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు

మంత్రుల పర్యటన సాగిందిలా..

- మంత్రుల బృందం హెలిక్యాప్టర్ ద్వారా సాయంత్రం 4.15 గంటలకు తుపాకులగూడెం చేరుకొని గోదావరిని ఏరియల్ సర్వే ద్వారా చూశారు.
- సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద 4.18 గంటలకు ల్యాండ్ అయ్యారు.
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకాటి శ్రీహరికి మంత్రి సీతక్క, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ దివాకర, ఇన్‌చార్జి ఎస్పీ కిరణ్ ఖరే పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.
- అనంతరం కాన్వాయ్ ద్వారా సమ్మక్క సాగర్ బ్యారేజీని పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి, మంత్రులు వరద ప్రవాహం గురించి ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు.
- కాన్వాయ్ ద్వారా దేవాదుల పంప్ హౌజ్ వద్దకు చేరుకుని మోటార్లను, ఇన్ టేక్‌వెల్ వద్ద గోదావరిని పరిశీలించారు.
- తుపాకులగూడెం వద్ద ఏర్పాటు చేయనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు.
- అనంతరం ఇరిగేషన్ అధికారులతో ప్రాజెక్టుల స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు.
- 6.17 గంటలకు హెలికాప్టర్ ద్వారా తిరుగు ప్రయాణమయ్యారు.

- కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి)

ఎఫ్‌పీవో సభ్యత్వం తీసుకోవాలి

కాజీపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో) స్కీంలో ప్రతి రైతు చేరి సభ్యత్వం తీసుకోవాలని దర్గా కాజీపేట పీఏసీఎస్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ అన్నారు. ఆదివారం కాజీపేట సోమిడిలో రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. రైతులకు పీఏసీఎస్ అండగా ఉంటుందని, ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ పీఏసీఎస్ సభ్యులకు సమాచారం అందించాలని చెప్పారు. అనంతరం 75 మందికి ఎఫ్‌పీవో సభ్యత్వం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక డైరెక్టర్లు మెరుగు రాజయ్య యాదవ్, కాయిత రాజ్‌కుమార్ యాదవ్, లింగం నరేందర్ రెడ్డి, దోమ గాలి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సభ్యత్వం ఇస్తున్న వనంరెడ్డి

శివారు కాలనీలపై శీతకన్ను

» కానరాని రోడ్లు, డ్రెయినేజీలు

» చీకట్లో మగ్గుతున్న కాలనీలు

వడ్డేపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):హనుమకొండలోని శివారు కాలనీలు సమస్యల వలయంలో మగ్గుతున్నాయి. రోడ్లు, డ్రెయినేజీలు మృగ్యమయ్యాయి. చీకట్లోనే పలు కాలనీల వాసులు మనుగడ సాగిస్తున్నారు. శివారు కాలనీలపై జీడబ్ల్యూఎంసీ అధికారులు శీతకన్ను ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్లు, డ్రెయినేజీలు మృగ్యం

గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లోని ఉషోదయ, పోలీసు, సప్తగిరి, జహర్, ఆర్టీసీ కాలనీజీ, గాయత్రి నగర్‌తో పాటు 58వ డివిజన్‌లోని మైత్రీనగర్ తదితర కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీలు అన్ని వీధుల్లో మచ్చుకైనా కనిపించవు. వర్షాకాలంలో కాలనీల వాసుల బాధలు చెప్పనలవి కావు. నివాస గృహాల నుంచి వెలువడే నీటితో పాటు వర్షపు నీరు రోడ్లపైనే పారడంతో దుర్గంధంతోపాటు దోమలు వృద్ధి చెంది ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.



అధ్వానంగా ఉన్న ఉషోదయ కాలనీలోని రోడ్డు

ఖాళీ ప్లాట్లల్లో పిచ్చి మొక్కలు

56వ డివిజన్‌లో ఖాళీ ప్లాట్లల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పాములు, తేళ్లు, క్రిమి కీటకాలకు విడిదిగా మారాయి. పందులు, పశువులు, కుక్కలు, కోతులు రేయింబవళ్లు సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

చీకట్లోనే శివారు కాలనీలు

56వ డివిజన్ పరిధిలోని కాలనీల్లో వీధి దీపాలు లేక ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. అభివృద్ధి చెందుతున్న ఉషోదయ, గాయత్రి నగర్, అన్సార్, వినాయక తదితర కాలనీల్లో విద్యుత్ స్తంభాలు లేవు. దీంతో ప్రజలు భారీ వైర్లను ఏర్పాటు చేసుకొని విద్యుత్ అవసరాలను తీర్చుకుంటున్నారు. అన్ని కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలను అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.

- సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ఎతిరాజుల సునీల్, జవహర్‌కాలనీ

56వ డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి. గాయిత్రినగర్, ఉషోదయ, వినాయక కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలను అమర్చాలి. ఖాళీ ప్లాట్లల్లో ఉన్న పిచ్చి మొక్కలు, నిరుపయోగమైన చెట్లను తొలగించాలి.



సప్తగిరి కాలనీలోని ఖాళీ ప్లాట్లలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



కుమ్మరివాడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డేపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ 60వ డివిజన్ టీచర్స్‌కాలనీ ఫేజ్-2, కుమ్మరివాడలో రూ.35 లక్షలతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు బంక సంపత్ యాదవ్, ఎనుకొంటి పున్నంచందర్, బీజేపీ నాయకులు నాగపురి అశోక్, రోకుల సతీష్, సాగర్‌గౌడ్, మట్టెపల్లి రాంరాజ్, రవి, కాలనీ వాసులు మల్లారెడ్డి, శ్రీనాథ్, ఎండి.సుబానొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటలు ఆడించే కోచ్‌లేరి..?



గ్రేటర్ వరంగల్ ఇండోర్ స్టేడియం

(5వ పేజీ తరువాయి)

స్టోర్ రూమ్‌గా మారిందని క్రీడాకారులు వాపోయారు. 9 గదులు శానిటేషన్, 4 గదులు వార్డు ఆఫీసర్లు, ఆర్‌ఐలకు కేటాయించడంతో ఇండోర్ స్టేడియం గదులు పరిపాలనా విభాగం గదులుగా మారుతున్నాయి. స్టేడియం పర్యవేక్షించేందుకు నియమించిన అధికారికి ఇంకా ఇతర శాఖలు కేటాయించడంతో భారంగా మారింది. అలాగే సెక్యూరిటీ లోపంతో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది.

సర్టిఫికెట్లు ఇవ్వలేదు..

వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో యేటా వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించేవారు. కానీ ఐదేళ్లుగా సమ్మర్ క్యాంపులు ఇండోర్ స్టేడియం వరకే పరిమితమయ్యాయి. ఈ యేడు మే నెలలో నిర్వహించిన శిక్షణా శిబిరాలను సీనియర్ క్రీడాకారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అయితే నెల పాటు శిక్షణ పొందిన వర్ధమాన క్రీడాకారులకు క్యాంపు సర్టిఫికెట్లు ఇప్పటి వరకు ఇవ్వలేదని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు.

క్రీడల పన్ను వసూలు

గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్‌లలో ప్రతీ ఇంటి నుంచి 1.5శాతం క్రీడల పన్ను వసూలు చేస్తారు. ఇలా యేటా రూ.2.50కోట్లు వసూలు అవుతాయి. నగర పాలక సంస్థకు యేటా టాక్స్ విభాగం అధికారులు సెస్ పేరుతో ప్రజల నుంచి క్రీడల పన్ను వసూలు చేస్తున్నా క్రీడల అభివృద్ధికి కృషి చేయడం లేదు. ఈ డబ్బులతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పర్యవేక్షణలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు క్రీడలు, శిక్షణా శిబిరాలు నిర్వహించకపోవడంవల్ల సుమారు రూ.10కోట్ల నిధులు అకౌంట్స్ విభాగంలో మూలుగుతున్నట్టు సమాచారం. గ్రేటర్ పాలకవర్గం, ఉన్నతాధికారులు స్పందించి ఇండోర్ స్టేడియంలో కోచ్‌లను నియమించాలని క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు.

వివేకానంద యువజన సంఘం కమిటీ ఎన్నిక



వివేకానంద సంఘం కమిటీ సభ్యులు

మడికొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మడికొండ వినాయకనగర్‌కు చెందిన వివేకానంద యువజన సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెనుకుల సతీష్, ఉపాధ్యక్షులుగా బోగి మహేష్, మండల సురేష్, ప్రధాన కార్యదర్శిగా మాచర్ల రంజిత్‌కుమార్, కోశాధికారిగా నిగ్గుల ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా నిగ్గుల రవి, కార్యవర్గ సభ్యులుగా బోగి మనోజ్‌కుమార్, నిగ్గుల వినయ్‌కుమార్, రాయికంటి ప్రణయ్, రాతిపల్లి హరిప్రసాద్, గోపనబోయిన వీరేష్, ముష్కె శ్రీకాంత్ ఎన్నిక కాగా, గౌరవ అధ్యక్షులుగా కర్ల మోహన్, బోగి వెంకట్రామ్మూర్తి, నిగ్గుల వెంకట ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బీసీ రిజర్వేషన్లను కేంద్రం ఆమోదించాలి

- సీపీఎం జిల్లా నేత వి. వీరన్న

వడ్డేపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని లేనిచో బీజేపీకి పుట్టగతులుండవని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వాంకుడోతు వీరన్న డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి బీసీలపై చిత్తశుద్ధి లేదని, వారిని అణగదొక్కే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ధర్నాలో నాయకులు తేలూరి ఉప్పలయ్య, డి రవీందర్, రవీంద్రాచారి, రాధిక, బిల్‌కిస్, సుదర్శన్, మానస, రమేష్, పద్మ, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

పీజీ విద్యార్థులపై ఫీజుల మోత

» క్యాంపస్‌లో ఎస్‌ఎఫ్‌సీలపై భారం

» డబ్బుల్లేక సర్టిఫికెట్లు తీసుకోని విద్యార్థులు

» యేటేటా పెరుగుతున్న బాధితులు



కేయూ క్యాంపస్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు ఫీజుల మోత భారంగా మారుతోంది. రెగ్యులర్ ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర పీజీ కోర్సులను వర్సిటీ క్యాంపస్ లో అందిస్తున్నారు. ఒక్కో కోర్సులో రెగ్యులర్‌గా 35 సీట్లను ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్స్, కామర్స్‌తో పాటు ఇతర డిపార్టుమెంట్లలో భర్తీ చేస్తారు. రెగ్యులర్ కోర్సులను రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల మేరకు ట్యూషన్ ఫీజులు, స్కాలర్‌షిప్‌తో పాటు ఇతర ఫీజులను చెల్లిస్తోంది. అయితే సెల్ఫ్ ఫైనాన్స్ (ఎస్ఎఫ్‌సీ) పేరుతో రెగ్యులర్‌గా ఉన్న 35 సీట్లతో పాటు మరో 15 సీట్లను అదనంగా క్యాంపస్‌లో వర్సిటీ ఉన్నతాధికారులు గతంలో పెంచారు. రెగ్యులర్ కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ట్యూషన్ ఫీజులు, ఇతర ఫీజులను ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకూ ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే ఎస్ఎఫ్‌సీ కోర్సుల ఫీజులు వర్సిటీ అధికారులు ఎక్కువగా నిర్ణయించడంతో రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే ఫీజులు తక్కువగా రావడంతో మిగతా ఫీజుల చెల్లింపు భారం విద్యార్థులపైనే పడుతోంది.

నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు

నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ట్యూషన్, మెస్‌తో పాటు ఇతర ఫీజుల చెల్లింపులను నిలిపివేసింది. వర్సిటీ విద్యార్థుల ఫీజుల బకాయిలతో ఇప్పటికే వర్సిటీ ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతోంది. కోట్లల్లో మెస్ బకాయిలున్నాయి. ప్రతీ నెల విద్యార్థులు భోజన ఖర్చులకు వర్సిటీ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

స్లాబ్ ఫీజులతో విద్యార్థుల సతమతం

ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర రెగ్యులర్ కోర్సులకు వర్సిటీ నిర్ణయించిన ఏడాదికి ఫీజు రూ. 20వేలు, అదే క్యాంపస్‌లో ఎస్ఎఫ్‌సీ కోర్సులకు రూ.33 వేలు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన స్లాబ్ విధానంతో ఒక్కో విద్యార్థికి రూ. 20 వేల వరకే చెల్లిస్తోంది. మిగతా ఫీజు బకాయి విద్యార్థులే నేరుగా జేబుల నుంచి చెల్లించుకోవాలి. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర పీజీ కోర్సులకు ఒక్కో విధంగా ఫీజులను నిర్ణయించారు. వర్సిటీ ఎంత నిర్ణయిస్తే అంతా విద్యార్థులే చెల్లించుకోవాలి. రెండేళ్ల పాటు తమ కోర్సులు పూర్తి చేసుకుని వెళ్లేటప్పుడు ఫీజులు చెల్లింపు భారంగా మారుతోంది. దీంతో ఎటు పాలుపోక విద్యార్థులు అవస్థ పడుతున్నారు.

ఈ ఏడాది నుంచి మరింత కష్టం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన నిబంధనల మేరకు ఈ ఏడాది నుంచి ఫీజుల ప్రక్రియ మరింత భారం కానుంది. మెస్ చార్జీలు, ట్యూషన్ ఫీజులు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నేరుగా వారి అకౌంట్లకే బదిలీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో క్యాంపస్‌లో సీటు పొందిన విద్యార్థులు ఫీజులను ముందే చెల్లించుకోవాల్సి ఉంటోంది. విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఏళ్లుగా వర్సిటీలో సర్టిఫికెట్లు తీసుకోవడం లేదు. దీనిపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని ఫీజులన్నీ రద్దు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

బెల్లం, పటిక స్వాధీనం

కాజీపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఓ వ్యక్తి వద్ద బెల్లం, పటికను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట రైల్వే సీఐ వడ్డె నరేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా ఈదుల పూసపల్లికి చెందిన అజ్మీరా అనిల్ బల్లార్షాలో బెల్లం, పటిక తక్కువ ధరకు కొనుగోలు చేసి కాజీపేట మీదుగా మహబూబాబాద్‌కు వెళ్లేందుకు కాజీపేటలో రైలు దిగాడు. పోలీసులు తనిఖీలు చేస్తుండగా 80 కిలోల బెల్లం, 20 కిలోల పటిక లభ్యమైంది. బెల్లం, పటికతో గ్రామంలో గుడుంబా తయారు చేసేందుకు తీసుకువెళ్తున్నట్లు నిందితుడు ఒప్పుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

హనుమకొండ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 52 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సీయం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో జరిగిన కార్యాక్రమంలో మొత్తంగా రూ.22.50 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల శ్రీనివాస్‌తో పాటు సయద్ రజాలీ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

మట్టెవాడ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య రాజకీయ సమ్మేళనంలో పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ఆ సంఘం మహాసభ అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం వరంగల్ నగరంలోని గోల్డెన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆర్యవైశ్య మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఆగస్టు 24న హనుమకొండ టీటీడీ దేవస్థానం కల్యాణ మండపంలో జరిగే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఆర్య వైశ్యులు రాజకీయంగా ఎదగాలని అన్నారు. చట్ట సభల్లో ఆర్యవైశ్యుల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు ఐక్యతతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ, జిల్లా నాయకులు వెంకటేశ్, వంగేటి అశోక్‌కుమార్, దుబ్బ శ్రీనివాస్, గంగిశెట్టి ప్రమోద్, మోహన్ రావు, గర్లపాటి శ్రీనివాస్, పొట్టి శ్రీనివాస్, అల్లాడి వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అమెరికా దుశ్చర్యలను వ్యతిరేకించండి

ఖిలా వరంగల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశ దిగుమతులపై 50 శాతం సుంకం విధించడాన్ని నిరసిస్తూ ఈ నెల 13న, వరంగల్ చౌరస్తాలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘాల నాయకుడు, ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో రైతు సంఘం నాయకులు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన కిసాన్ మోర్చా జాతీయ కమిటీ, జాతీయ కార్మిక సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రష్యా నుంచి భారతదేశం చమురు దిగుమతి చేసుకోవద్దని అమెరికా బెదిరిస్తున్నదని వారు విమర్శించారు.

ప్రపంచంలో ప్రతీ దేశానికి ఇతర దేశాలతో వర్తక వాణిజ్యాలు చేసుకునే హక్కు ఉన్నదని అంటూ భారత సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టవద్దని మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అమెరికాతో జరిపే ద్వైపాక్షిక ఒప్పందాలను చేసుకోవద్దని మోదీని కోరారు. ట్రంప్ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాన్ని జాతీయ రైతు, కార్మిక సంఘాల నాయకులు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు, ఏ ఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి రాచర్ల బాలరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్, ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి అక్కనపెల్లి యాదగిరి, మొగిలి ప్రతాప్‌రెడ్డి, వీరగోని శంకరయ్య, భైరబోయిన ఐలయ్య, ఇంద్రసేన, వల్లం దాస్ కుమార్, గంట శంకర్, రఘుసాల సుమన్, ఎమ్డీ యాకూబ్, బొట్ల శ్రీనివాస్, చుక్క మొగిలి, పాషా తదితరుల పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు

పూనకాలతో పులకించిన గాంధీనగర్



గాంధీనగర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు

వడ్డేపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): డప్పుచప్పుళ్లు.. బాజాభజంత్రీలు.. పంబాల వారి పాటలు.. శివసత్తుల పూనకాలతో వెరసి గాంధీనగర్ పులకించింది. శ్రావణ మాసం రెండో ఆదివారాన్ని పురస్కరించుకొని హనుమకొండ 57వ డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సట్ల సత్తయ్య ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. గాంధీనగర్ నుంచి మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని శివసత్తుల పూనకాల మధ్య గోకుల్ నగర్‌లోని పోచమ్మ దేవాలయానికి తరలివచ్చారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, పప్పు బెల్లం, పసుపు, కుంకుమలు, కొబ్బరికాయలు, బెల్లం శాకతోపాటు నైవేద్యాన్ని సమర్పించారు. గండ దీపం వెలిగించి అమ్మవారిని కొలిచి ఆయురారోగ్యాలు, అష్టైశ్వరాలు, పాడి పంటలతో తులతూగే విధంగా సల్లంగా దీవించమని పోచమ్మ తల్లిని వేడుకున్నారు. 56వ డివిజన్ గోపాల్‌పూర్, జవహర్‌కాలనీలో పోచమ్మ బోనాల వేడుకలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు.

మడికొండ (ఆంధ్రజ్యోతి): మడికొండలో శ్రావణ మాసం ఆదివారం పోచమ్మ తల్లి బోనాల జాతర వైభవంగా జరిగింది. డప్పు చప్పుళ్లు, ఢమరుక నాదాలు, శివసత్తుల పూనకాలతో జాతర బయలుదేరగా మహిళలు నెత్తిన బోనాలతో స్థానిక పాత పోలీస్‌స్టేషన్, చెరువు కట్ట, మెట్టుగుట్ట వద్ద కొలువై ఉన్న అమ్మవారి చెంతకు చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి సల్లంగా చూడు తల్లీ అంటూ భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కట్టమైసమ్మ బోనాలు

అమ్మవారికి ప్రత్యేక పూజలు

వడ్డేపల్లి (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డేపల్లి మత్స్యపారిశ్రామిక సహకార సంఘం, వడ్డేపల్లి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కట్టమైసమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ వాడ నుంచి మహిళలు నెత్తిన బోనాలను ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో వడ్డేపల్లి చెరువు కట్టపై ఉన్న కట్టమైసమ్మ దేవాలయానికి తరలివెళ్లారు. గండ దీపం వెలిగించి, పట్నం వేసి బలిహరణ నిర్వహించి అమ్మవారికి వస్త్రాలు, నైవేద్యాన్ని సమర్పించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు మట్టెపల్లి నర్సింగం, ప్రధాన కార్యదర్శి మట్టెపల్లి శంకర్, కేశబోయిన శ్రవణ్‌తోపాటు కాంగ్రెస్ శ్రేణులు బంక సరళసంపత్ యాదవ్, విజశ్రీ రజాలి, కేతిడి దీపక్‌రెడ్డి, మండల సమ్మయ్య, మట్టెపల్లి సమ్మయ్య, ఎనుకొంటి పున్నంచందర్, జనగాం శ్రీనివాస్‌గౌడ్, నాయిని లక్ష్మారెడ్డి, తాళ్లపెల్లి రవీందర్, తదితరులు కట్టమైసమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సల్లంగా దీవించమని వేడుకున్నారు.



మడికొండలో పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

ఔషధాల మహాబిల్వం!

శివుడిని ఎంతో ప్రీతిపాత్రమైనవిగా బిల్వపత్రాలు అందరికీ తెలిసిందే. అయితే మహాబిల్వం మొక్కలో కూడా పలు ఔషధ గుణాలు దాగున్నాయని తెలుసా! ఆ వివరాలు తెలుసుకుందాం..



మహాబిల్వాన్ని వేయి కన్నుల చెట్టు అని పిలుస్తారు. దీని ఆకులను శివునికి సమర్పిస్తారు. ఈ చెట్టు భారతదేశంతో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లలో పెరుగుతుంది. కరువు ప్రాంతాల్లోనూ మనగలగడం దీని ప్రత్యేకత. మహాబిల్వం మొక్క గుబురుగా 2 నుంచి 5 మీటర్ల ఎత్తు పెరుగుతుంది. దీని ఆకులు చిన్నగా ఉంటాయి. ఈ మొక్కకు వేసవిలో తెల్లని పువ్వులు పూస్తాయి. వీటి నుంచి గుండ్రని కాయలు కాస్తాయి. ఈ కాయలు పండే క్రమంలో నారింజ పసుపు రంగులోకి మారతాయి. మహాబిల్వం ఆకులు, కాయలు, బెరడును సంప్రదాయ వైద్యంలో జీర్ణ సమస్యలు, జ్వరం, చర్మ వ్యాధులను తగ్గించేందుకు వాడతారు. ఈ మొక్కను ఆయుర్వేద వైద్యంలో కూడా వినియోగిస్తారు. ఈ మొక్క బెరడు, ఆకులు, కాయలను మూలికల తయారీలోనూ ఉపయోగిస్తారు. బిల్వ పత్రాలను రుబ్బి పాలలో కలుపుకుని తాగితే మూర్ఛరోగం, జీర్ణ, మానసిక సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ మొక్క కాయలను క్రిమికీటకాలను పారదోలేందుకు, బెరడును బెణికిన నొప్పి నుంచి ఉపశమనం కలిగించేందుకు వాడతారు.

• డాక్టర్ శ్రీనాథ్,
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్

ఫిట్‌నెస్

ఈ ఆసనంతో కుంగుబాటు దూరం!



మానసిక కుంగుబాటు తొలగి, మనసు తేలికపడే ఆసనాల్లో చెప్పుకోదగినది 'సేతుబంధ సర్వాంగాసనం'. ఈ ఆసనం ఎలా వేయాలంటే...

- నేల మీద వెల్లకిలా పడుకుని, మెడ అడుగున టవల్ చుట్టి పెట్టుకోవాలి.
- మోకాళ్లను మడిచి, పాదాలు, చేతులకు నేలకు సమాంతరంగా ఉంచాలి.
- గాలిని వదులుతూ చేతులు, పాదాల మీద బరువుంచి, నడుమును పైకి లేపాలి.
- ఈ భంగిమలో 10 అంకెలు లెక్కపెట్టి, తిరిగి మామూలు స్థితికి రావాలి.
- ఇలా 5 నుంచి పది సార్లు చేస్తే ఫలితం ఉంటుంది.

ఉపయోగాలు ఇవే! : ఛాతీ, వెన్ను, మెడ, పిరుదులు ఈ ఆసనంతో సాగుతాయి. మెదడుకు రక్తప్రసరణ మెరుగవుతుంది. మానసిక ఒత్తిడి, డిప్రెషన్లు తగ్గుతాయి. కేంద్ర నాడీ వ్యవస్థ, మెదడు సాంత్వన పొందుతాయి. అజీర్తి తొలగి, మెనోపాజ్ లక్షణాలు తగ్గుముఖం పడతాయి.

నవనాయిక



ఇంటర్నేషనల్ విజిటర్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్ (ఐవీఎల్‌పీ)... గతంలో ఇందిరాగాంధీ, వాజ్‌పేయి తదితర మహానేతలు... దేశవిదేశీ మహానాయకులు అనుభవాలు పంచుకున్న వేదిక. అంతర్జాతీయంగా వివిధ రంగాల్లో ఉద్భవిస్తున్న యువ నాయకత్వం... అమెరికన్ల మధ్య శాశ్వత సంబంధాలు పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించే కార్యక్రమం ఇది. తాజాగా ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో పాల్గొనే అరుదైన అవకాశం దక్కించుకున్నారు... ఏపీ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ బి.వినూషారెడ్డి. ఈ సందర్భంగా ఆమె 'నవ్య'తో ముచ్చటించారు.

అరుదైన అవకాశం అందివచ్చింది

'గత ఏడాది... ఏప్రిల్ 11... అమెరికా రాయబార కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది... నన్ను కలవాలని. 'వాళ్లు నా కోసం ఎందుకు వస్తారులే' అనుకుని... కలవాలంటే కర్నూలుకు రమ్మని చెప్పాను. నాలుగు రోజుల తరువాత నిజంగానే వాళ్లు మా ఊరు వచ్చారు. ఆ సమయంలో రోగులకు వైద్యం అందిస్తున్నా. వైద్యురాలిగా, రాజకీయ నాయకురాలిగా, సామాజిక కార్యకర్తగా నేను చేస్తున్న సేవలు, నేపథ్యం గురించి వివరాలు అడిగారు. భవిష్యత్తు నాయకత్వంపై అభిప్రాయం అడిగారు. ఐవీఎల్‌పీకి ప్రతినిధులను ఎంపిక చేస్తున్నామని, అందులో భాగంగానే నా ఇంటర్వ్యూ తీసుకున్నామని అమెరికన్ ఎంబసీవారు చెప్పారు. 'ఆ అవకాశం నా దాకా రాదులే' అనుకుని, దాని గురించి పట్టించుకోలేదు. కానీ ఈ ఏడాది మార్చిలో అక్కడి నుంచి ఫోన్ వచ్చింది... నన్ను ఎంపిక చేసినట్టు చెప్పారు. అందులో ఇరవై దేశాల ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. 'భారత్ నుంచి ఇంకెవరు వస్తున్నారు' అని అడిగితే... 'మిమ్మల్ని ఒక్కరినే ఎంపిక చేశాం' అన్నారు. ఆ క్షణం నన్ను నేను నమ్మలేకపోయాను. సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాను. నా జీవితంలో మరిచిపోలేని సందర్భం అది.

ఆ అనుభవాలే అవకాశం తెచ్చాయి...

రెండేళ్ల కిందట దక్షిణాఫ్రికాలో 'బ్రిక్స్ పొలిటికల్ సమ్మిట్' జరిగింది. భారత్ ప్రతినిధులుగా ఏపీ నుంచి నేను, తమిళనాడు నుంచి బీజేపీ అధ్యక్షుడు అన్నామలై, యూపీ నుంచి పుష్కర్ మిశ్రా, గుజరాత్ నుంచి సత్యన్ కులబ్కర్ హాజరయ్యాం. ఏడు రోజులు జరిగిన ఆ సదస్సులో వివిధ రంగాలకు చెందిన 50 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. అందులో భారత్- దక్షిణాఫ్రికా దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక, సామాజిక సంబంధాలపై నేను మాట్లాడాను. బ్రిక్స్ తీర్మానాలు చేయడం, చర్చల్లో పాల్గొనడం మధురానుభూతులు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ప్రాంతీయ, జాతీయ చానల్స్ చర్చావేదికల్లో భాగస్వామి అయ్యాను. అలాగే... 'ఇండియా బిఫోర్... ఆఫ్టర్ 2014- వై భారత్ నీడ్స్ బీజేపీ' అనే ఆంగ్ల పుస్తకం రాశాను. ఈ అనుభవాలే నేను ఐవీఎల్‌పీకి ఎంపిక కావడానికి దోహదపడ్డాయని భావిస్తున్నాను.

గర్వంగా ఉంది...

ఐవీఎల్‌పీకి 1940లో అమెరికా శ్రీకారం చుట్టింది. ఈ ఎనిమిదిన్నర దశాబ్దాల్లో 2.3 లక్షల మంది అంతర్జాతీయ యువ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరై, ఆ తరువాత దేశాధ్యక్షులుగా, ప్రభుత్వాధినేతలుగా ఎదిగినవారు, నోబెల్ బహుమతి పొందినవారు ఐదు వందల మందికి పైగా ఉన్నారు. వేల సంఖ్యలో చట్ట సభలకు ఎంపికయ్యారు. పారిశ్రామిక, విద్యావేత్తలుగా స్థిరపడ్డారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, మురార్జీ దేశాయ్, వాజ్‌పేయి, ప్రస్తుత ప్రధాని మోదీ, మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ నాయకులుగా ఎదుగుతున్న సమయంలో ఐవీఎల్‌పీలో పాల్గొన్నవారే. దాని ద్వారా ఎంతటి పటిష్ఠమైన నాయకత్వం తయారవుతుందో అర్థం చేసుకోవచ్చు. అంతటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి నేను ఎంపిక కావడం గర్వంగా ఉంది. ఎలాంటి దరఖాస్తు ప్రక్రియా లేకుండా... అమెరికా రాయబార కార్యాలయాలు నామినేట్ చేయడం అంటే సాధారణ విషయం కాదనేది నా అభిప్రాయం.

ఇదీ నేపథ్యం...

మా స్వస్థలం కర్నూలు. నాన్న బి.జయరామిరెడ్డి రోడ్లు భవనాలు శాఖలో ఎస్ఈగా రిటైర్ అయ్యారు. అమ్మ రాణి గృహిణి. నేను, మావారు చల్లా వాసురెడ్డి ఇద్దరం డాక్టర్లమే. మాకు ఇద్దరు పిల్లలు... హర్షిల్, సాన్వి. నాకు ఉమ్మడి ఏపీ ఎంసెట్‌లో 83వ ర్యాంక్ వచ్చింది. 'కర్నూలు మెడికల్ కాలేజీ' (కేఎంసీ)లో ఎంబీబీఎస్ చదివాను. 16 గోల్డ్ మెడల్స్ సాధించాను. తరువాత బెంగళూరు 'రామయ్య మెడికల్ కాలేజీ'లో జనరల్ మెడిసిన్ పూర్తి చేశాను. మావారు కూడా డాక్టర్ కావడంతో... ఇద్దరం కలిసి కర్నూలులోనే 'వీఆర్ హాస్పిటల్' నెలకొల్పాం.

అలా రాజకీయాల వైపు...

చదువుకొనే రోజుల్లో రాజకీయాలపై అస్సలు ఆసక్తి ఉండేదికాదు. అప్పట్లో రోజుకో కుంభకోణం వెలుగు చూడడమే అందుకు కారణం. 2011లో తొలిసారిగా అమెరికా వెళ్లాను. అక్కడి అభివృద్ధి చూసి మన దేశంలో ఇలాంటి ప్రగతి సాధ్యమేనా? ఈ రాజకీయ నాయకుల వల్ల మార్పు వస్తుందా? అనే ప్రశ్నలు తలెత్తేవి. ఆ సమయంలో మెడికల్ సీట్ల కుంభకోణం వెలుగు చూడడంతో రాజకీయాలంటేనే విరక్తి వచ్చింది. అయితే ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలు, పాలనలో తెస్తున్న సంస్కరణలు, మహిళల సామాజిక భద్రత వంటివి నన్ను రాజకీయాల వైపు అడుగులు వేసేలా చేశాయి. అలా 2019లో బీజేపీలో చేరాను. రాష్ట్ర కార్యదర్శిగా, బీజేపీ మహిళా మోర్చా పాలసీ రీసెర్చ్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టాను. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్నాను."

అదే నా లక్ష్యం...

ఈ నెల 9 నుంచి 30 వరకు ఐవీఎల్‌పీ జరుగుతుంది. దీనికి అయ్యే ఖర్చంతా అమెరికా ప్రభుత్వం భరిస్తుంది. ఇందులో భాగంగా 20 దేశాల ప్రతినిధులతో కలిసి అమెరికాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించాలి. వాషింగ్టన్ డీసీ, ఫెడరల్ వ్యవస్థ పనితీరుపై సమీక్షలు, అమెరికా కాంగ్రెస్ సభ్యులతో సమావేశాలు ఉంటాయి. ఆ దేశ న్యాయ వ్యవస్థ, విశ్వవిద్యాలయాల పనితీరుపై అధ్యయనం చేయాలి. ఇలా ఎన్నో కార్యక్రమాలు. భవిష్యత్తులో చట్ట సభలో అడుగుపెట్టి, భావితరాల్లో స్ఫూర్తి నింపే నాయకురాలిగా ఎదగాలన్నదే నా లక్ష్యం. అందుకు పునాదులు వేయడంలో ఐవీఎల్‌పీ ఒక మంచి వేదికగా దోహదం చేస్తుందని భావిస్తున్నాను.

విద్య, వైద్యం...

సామాజిక బాధ్యతగా నావంతు కర్తవ్యం నిర్వర్తిస్తున్నాను నేను, మావారు కలిసి పేదల బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. మందులు పంపిణీ చేస్తున్నాం. అనాథ పిల్లలకు పుస్తకాలు, దుస్తులు ఇస్తున్నాం. అవసరమైనవారికి ఆర్థిక సాయం చేస్తున్నాం. అలాగే ఏటా శివరాత్రి ఉత్సవాల్లో శ్రీశైలం మల్లన్న దర్శనానికి కాలి నడకన వెళ్లే భక్తులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం.

• గోరంట్ల కొండప్ప, కర్నూలు
ఫొటోలు: ఎస్ఎండీ రఫీ

రుచులే ఆమె అభిరుచులు

ప్రయత్నం



65 ఏళ్ల వయసు మహిళలెవరైనా విశ్రాంతిగా గడపాలని కోరుకుంటారు. కానీ గోవాకు చెందిన స్మిత సురేంద్రనాథ్ బ్లగ్గన్, తన చేతి వంటను నలుగురికీ రుచి చూపించే రెస్టారెంట్ నడపాలని నిర్ణయించుకున్నారు. ఇంటి రుచులతో గోవా వాసుల మనసులు గెలుచుకుంటున్న స్మిత ప్రస్థానమిది.

మాది మహారాష్ట్ర. కర్నాటకలోని ధార్వాడ్ జిల్లాలో స్థిరపడిన కుటుంబం మాది. నేనొక భోజన ప్రియురాలిని. కాబట్టి సహజంగా వంటల పట్ల ఆసక్తి చిన్న వయసులోనే ఏర్పడింది. పదేళ్లకే గరిట పట్టి, వంటలు వండడం మొదలుపెట్టేశాను. అప్పట్లో నేను వండిన జొన్న రొట్టెలను నాన్న ఎంతో ఇష్టంగా తినడం నాకిప్పటికీ గుర్తే! చదువు పూర్తయి ఉద్యోగంలో స్థిరపడిన తర్వాత ఒక పంజాబీ వ్యక్తితో పెళ్లయింది. దాంతో పంజాబీ వంటకాల పట్ల కూడా అవగాహన పెంచుకున్నాను. అత్తగారు కూడా ఎంతో రుచిగా వండుతారు. ఆమె వండిన చికెన్ కర్రీ సువాసన, తిన్న తర్వాత కూడా ఒక రోజంతా వేళ్లకు అంటిపెట్టుకుని ఉండిపోయేది. అలా ఆమె నుంచి పంజాబీ వంటకాలు కూడా నేర్చేసుకున్నాను. స్వతహాగా రుచిగా వండుతాను కాబట్టి పిల్లలు, పిల్లల స్నేహితులు నా వంటకాలను ఎంతో ఇష్టపడి తినేవారు. మా వారు, సురేంద్రనాథ్ గ్వారకన్ బ్లగ్గన్, ఉద్యోగ రీత్యా అసిస్టెంట్ ఇంజనీర్‌గా 1986లో గోవాకు ట్రాన్స్‌ఫర్ అవడంతో, ఆయనతో పాటు నేను కూడా గోవా చేరుకుని అక్కడే స్థిరపడిపోయాను. అలా గోవా వంటకాలు కూడా నేర్చుకున్నాను. మా వారి స్నేహితులు, బాస్‌లు కూడా నా వంటను తరచూ మెచ్చుకుంటూ ఉండేవారు. దాంతో మావారు రెస్టారెంట్ మొదలుపెట్టమని నాతో అంటూ ఉండేవారు. నిజానికి నాక్కూడా ఆ ఆలోచన ఉంది. కానీ అప్పుడు పరిస్థితులు అనుకూలించలేదు. 2020లో కాస్త ఆలస్యంగా నా ఆలోచనకు కార్యరూపం ఇవ్వడం మొదలుపెట్టాను.

వంటకాలన్నీ నా బిడ్డలే!

ఇంటికి దగ్గర్లోనే రెస్టారెంట్ కోసం మంచి స్థలం కనిపించింది. పైగా ఆ ప్రదేశం కొలను పక్కనే ఉంది కాబట్టి అందరికీ నచ్చుతుందనే ఉద్దేశంతో వెంటనే కొని, మిగతా పనులన్నీ చకచకా ముగించుకున్నాను. అయితే రెస్టారెంట్ నడిచిన కొద్ది రోజులకే లాక్‌డౌన్ మొదలైంది. దాంతో అయోమయంలో పడిపోయాను. ముందు పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదు. అయినా చేసేదేం లేక అప్పటికి ఊరుకున్నాను. లాక్‌డౌన్ తర్వాత రెస్టారెంట్ నెమ్మదిగా ఊపందుకుంది. దీన్లో పంజాబీ, గోవా, కొంకణి, మహారాష్ట్ర వంటకాలు తయారవుతూ ఉంటాయి. అయితే ప్రతి వంటకం నా ఆధ్వర్యంలోనే తయారవుతుంది. ప్రతి వంటకానికీ అవసమైన మసాలాలన్నీ అప్పటికప్పుడే సిద్ధం చేసుకుంటూ ఉంటాను. నిల్వ ఉన్న వాటిని వాడే అలవాటు నాకు లేదు. అలాగే వంటకాల కోసం అవసరమైన కూరగాయలు, సరుకులను స్వయంగా నేనే కొనుగోలు చేస్తాను. రుచుల విషయంలో ఏమాత్రం రాజీ పడను. కొందరు నాకిష్టమైన వంటకం ఏదని అడుగుతూ ఉంటారు. కన్న బిడ్డల్లో ఎవరంటే ఎక్కువ ఇష్టమంటే ఎలా చెప్పడం? వంటకాలన్నీ నా బిడ్డలే! కాబట్టి అన్నిటినీ సమానంగా ఇష్టపడతాను. అయితే నా రెస్టారెంట్‌లో తయారయ్యే ప్రాన్ డేంజర్, ఫిష్ థాలి, రావ మస్సెల్స్, బటర్ చికెన్స్ వంటకాలు బాగా పేరు పొందాయి.

సవాళ్లనే సోపానాలుగా...

రెస్టారెంట్ బ్రహ్మాండంగా నడుస్తుంది కాబట్టి నాకెలాంటి సవాళ్లూ ఎదురు కావు అనుకుంటే పొరపాటు. ఒకసారి ఒక పెద్ద లంచ్‌కు ముందు, మా చెఫ్ పని మానేస్తున్నట్టు చెప్పడంతో ఆ భారమంతా నా భుజాల మీద పడింది. కూతురు, కొడుకుల సహాయం తీసుకుని మొత్తానికీ ఆ భారీ భోజన కార్యక్రమాన్ని ముగించేశాను. కొన్ని సార్లు, నీటి సరఫరా సమస్య ఎదురవుతుంది. ఇంకొన్ని సార్లు విద్యుత్ ఉండదు. అయితే నేనిలాంటి సవాళ్లను సమస్యలుగా భావించను. ఇలాంటి మసాలాలు, డ్రామాలు లేని జీవితం జీవితమెలా అవుతుంది? ఇలాంటివి ఎదురైనప్పుడు వాటిని సమర్థంగా ఎదుర్కొని విజయం సాధించడంలోనే మజా ఉంటుంది.

ప్రకృతిని కాపాడుకోకపోతే మానవాళికి భవిష్యత్తు లేదన్న నాన్న మాట మున్ముని పాయెంగ్‌కు మంత్రమయింది.తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ... ప్రజల్ని కూడగట్టింది. ఆమె, ఆమె బృందం రెండేళ్లలో పది లక్షల మొక్కలు నాటి... ఆకుపచ్చ విప్లవాన్ని సృష్టించారు. "మేము నాటే ప్రతి మొక్కా భవిష్యత్తుకు హామీ ఇస్తుంది. మా నిబద్ధతను ప్రతిబింబిస్తుంది" అంటోంది అసోంకు చెందిన పాతికేళ్ల 'ఫారెస్ట్ క్వీన్' మున్ముని.

అడవి రాణి



చిన్నప్పుడు నాన్న భుజాల మీద కూర్చొని, అడవిలో తిరుగుతూ, ఆయన మొక్కలు నాటుతూ ఉంటే, తను కూడా ఓ చెయ్యి వేస్తానని మారాం చేయడం... మున్ముని పాయెంగ్‌కు ఇష్టమైన జ్ఞాపకం. హఠాత్తుగా వరదలు ముంచుకొచ్చి భూమి కోతకు గురై... విలయంలో చిక్కుకున్న జనం నిస్సహాయత... ప్రతి వర్షాకాలంలో ఆమె కళ్లెదుట నిలిచిన వాస్తవం. ఆ జ్ఞాపకంతో, ఈ వాస్తవంతో మున్ముని జీవితం పెనవేసుకుపోయింది.

ఆయనను చూసే నేర్చుకున్నా...

మున్ముని స్వస్థలం అసోం రాష్ట్రంలో... బ్రహ్మపుత్ర నదిలో ఉన్న అతి పెద్ద దీవి... మాజులీ. ప్రకృతి వైపరీత్యాల మధ్య జనం బిక్కుబిక్కుమంటూ గడిపే ఆ దీవికి ఒక కొత్త రూపు తెచ్చిన వ్యక్తి జాదవ్ మొలోయ్ పాయెంగ్. తమ దీవిని కాపాడుకోవాలనే తపనతో... రోజుకు ఒక మొక్క నాటే దీక్షను ఆయన తన పదహారేళ్ళ వయసులో చేపట్టారు. ఆయన కృషితో... ముప్ఫైయ్యేళ్ళలో... బ్రహ్మపుత్ర నది ఒడ్డున ఉన్న ఇసుక దిబ్బల్లో... 1,360 ఎకరాల అడవి ఏర్పడింది. ఆ అడవిని జనం 'మొలోయ్ కథోనీ' అని ఆయన పేరిటే పిలుచుకుంటారు. 'ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అంతర్జాతీయంగానూ ప్రసిద్ధుడైన జాదవ్ 2015లో కేంద్ర ప్రభుత్వం నుంచి 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్నారు. "నాకు అడుగడుగునా నాన్నే స్ఫూర్తి. మంచి మనిషిగా బతకాలి. కష్టపడి పని చెయ్యాలి. ఇతరులకు సాయపడాలి. ప్రకృతి సంపద పెరుగుదలకు దోహదం చేయాలి... ఇవి నాన్న నాకు చెప్పిన పాఠాలు. చిన్న స్థాయిలో ప్రారంభించినా అకుంఠిత దీక్షతో కొనసాగిస్తే... అసాధ్యాలు సుసాధ్యాలవుతాయనేది ఆయనను చూసే నేర్చుకున్నాను" అని చెబుతోంది మున్ముని. "నాన్న నాటిన అడవి ఇప్పుడు బెంగాల్ టైగర్స్, ఖడ్గమృగాలు, లేళ్లు, కుందేళ్ళు, కోతులు, రకరకాల పక్షులు, వైవిధ్యభరితమైన చెట్లతో కళకళలాడుతోంది. ప్రతి సంవత్సరం వందకి పైగా ఏనుగులు వచ్చి, ఆరు నెలలపాటు అందులో విడిది చేస్తాయి. ఒకప్పుడు బీడులా ఉండే ఆ ప్రాంతం ఇలా మారడానికి నాన్న ముందుచూపు, పట్టుదల కారణం. వాటినే నేను వారసత్వంగా స్వీకరించాను" అంటోంది మున్ముని.

మొలోయ్ కథోనీ 2.0

తండ్రి పేరిట నడుస్తున్న 'ఫారెస్ట్‌మ్యాన్ ఫౌండేషన్'లో కార్యకర్తగా చేరిన ఆమె ప్రస్తుతం ఆ సంస్థకు కార్యదర్శిగా వ్యవహరిస్తోంది. అలాగే 'సెజు ధరణి' (ఆకుపచ్చని భూమి) అనే సంస్థను మరికొందరితో కలిసి స్థాపించింది. మాజులీ, జోర్హాట్ జిల్లాల్లోని సుమారు అరవై గ్రామాల ప్రజలకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించింది. వారిని బృందంగా ఏర్పాటు చేసి... 2022లో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రెండేళ్ళ వ్యవధిలో ఆమె, ఆమె బృందం పది లక్షలకు పైగా మొక్కలు నాటారు. ఈ యజ్ఞం ఇంకా కొనసాగుతోంది. "కోటి మొక్కలు నాటడం ప్రస్తుతం మా లక్ష్యం" అంటున్న మున్మునిని అందరూ 'ఫారెస్ట్ క్వీన్' అని ఆప్యాయంగా పిలుస్తారు. గ్రామస్తులు, పర్యావరణ నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో... 'సబ్‌స్టాన్షియల్ గ్రీన్ ఇనీషియేటివ్ అండ్ క్లైమెట్ జస్టిస్' సంస్థ సహకారంతో 'మొలోయ్ కథోనీ 2.0' ప్రాజెక్ట్‌ను ఇటీవలే ఆమె ప్రారంభించింది.

ఆ బాధ్యత తీసుకోవాలి...

"బ్రహ్మపుత్ర తీరం, దీవులు పచ్చదనంతో కళకళలాడాలనేది మా నాన్న కల. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ఉధృతమైన వరదలకు ఈ ప్రాంతంలోని దీవులు మునిగిపోవడం, అపారమైన పశు నష్టం, ఆస్తి నష్టం, పదుల సంఖ్యలో ప్రాణనష్టం జరుగుతూ ఉండేది. అడవులు కొరవడడంతో గ్రామాల్లోకి ఏనుగులు మందలుగా వచ్చి విధ్వంసం సృష్టించేవి. దాన్ని నివారించడానికి చెట్ల పెంపకమే మార్గమనే ఆలోచనతో... చాలా చిన్న వయసులోనే మా నాన్న తన తన కృషిని ప్రారంభించారు. ఎడారిలా ఉండే ప్రాంతానికి పచ్చదనాన్ని తీసుకొచ్చారు. "మొక్కలు నాటడం, వాటిని పెంచడం అంటే మనల్ని కాపాడి, పోషిస్తున్న ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుకోవడమే" అని ఆయన మాకు ఎప్పుడూ చెబుతారు. ఆయన స్ఫూర్తితో... మా ప్రాంతానికే ప్రత్యేకమైన దేశీయమైన మొక్కలనే నాటుతున్నాం. అంతేకాదు... నాటిన ప్రతి మొక్కా పెరిగి పెద్దదయ్యేదాకా... బాధ్యత తీసుకుంటున్నాం. చెట్లు మనకు పండ్లు, కాయలు, పూలతో పాటు ఆక్సిజన్ అందిస్తాయి. వాటి బాధ్యత మనం తీసుకోకపోతే... భవిష్యత్తులో పశ్చాత్తాపపడాల్సి ఉంటుంది" అంటున్న మున్ముని... అసోం రాష్ట్రమంతటా పర్యటించి... ఆదివాసీ బృందాల నుంచి పాఠశాల పిల్లల వరకూ... వివిధ వర్గాల వారికి పర్యావరణ పరిరక్షణ గురించి, చెట్ల పెంపకం ఆవశ్యకత గురించి వివరిస్తోంది. కమ్యూనిటీ వర్క్‌షాపులు, అడవుల్లో ఎడ్యుకేషన్ వాక్స్ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తోంది.



డబుల్ చిన్ తగ్గేదెలా..?

డబుల్ చిన్ అనేది ముఖం కింద మెడ భాగంలో ఏర్పడుతూ ఉంటుంది. దీనివల్ల ముఖం అందంగా కనిపించదు. చర్మం కింద కొవ్వులు పేరుకోవడం, ఊబకాయం, వయసు పెరగడం, జన్యుపరమైన కారణాల వల్ల ఈ సమస్య వస్తూ ఉంటుంది. చిన్న చిట్కాలతో డబుల్ చిన్‌ను మాయం చేయవచ్చంటున్నారు నిపుణులు...

- డబుల్ చిన్ ఉన్నవారు ఆహారాన్ని బాగా నమిలి తినాలి. దీనివల్ల ముఖంలోని కండరాలకు వ్యాయామం చేసినట్లవుతుంది. చర్మం కింద పేరుకున్న అదనపు కొవ్వులు కరిగిపోతాయి. క్రమంగా ముఖాకృతి మామూలుగా మారుతుంది. తరచూ చూయింగ్ గమ్ నమలడం వల్ల కూడా ప్రయోజనం లభిస్తుంది.
- ఒక గిన్నెలో గుడ్డు తెల్ల సొన, ఒక చెంచా పాలు, ఒక చెంచా నిమ్మరసం, కొద్దిగా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని డబుల్ చిన్ మీద రాసి ఆరనివ్వాలి. అర గంట తరవాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే డబుల్ చిన్ తగ్గుతుంది.
- మెడను గుండ్రంగా తిప్పడం, పైకి కిందికి కదిలించడం లాంటి చిన్న చిన్న వ్యాయామాలు చేసినా ఫలితం ఉంటుంది.
- రోజూ కాఫీ, టీలకు బదులు తేనె కలిపిన గ్రీన్ టీ తాగడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల శరీరంలో జీవక్రియలు వేగవంతమవుతాయి. చెడు కొవ్వులు కరిగి సమస్య తీరుతుంది.
- అధిక క్యాలరీలు ఉన్న ఆహారాన్ని తినకూడదు. ఇ విటమిన్ అధికంగా లభించే ఆకుకూరలు, పాల ఉత్పత్తులు, పప్పు దినుసులు, స్వీట్ కార్న్, సోయా బీన్స్, యాపిల్, బ్రౌన్ రైస్ తరచూ తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుంది.



క్లాట్ 2026

దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాల్లో అందించే అండర్ గ్రాడ్యుయేట్(యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) లా ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం 'క్లాట్' నోటిఫికేషన్ వెలువడింది. జాతీయ స్థాయి ఎంట్రెన్స్ ఆధారంగా 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్'(క్లాట్)-2026 అడ్మిషన్స్ జరుపుతారు. ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎమ్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ లభిస్తుంది.

కోర్సులు:
- అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా డిగ్రీ)
- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(ఏడాది ఎల్ఎల్ఎం డిగ్రీ)

అర్హతలు: అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చేయాలనుకునే విద్యార్థులు కనీసం 50 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ పాసై ఉండాలి.
చివరి తేదీ: 2025 అక్టోబర్ 31
ఎంట్రెన్స్ తేదీ: 2025 డిసెంబర్ 7
వెబ్‌సైట్: consortiumofnlus.ac.in/

ప్రిపరేషన్:
క్లాట్‌కు సిద్ధం కావాలంటే మొదట సిలబస్‌ను అర్థం చేసుకోవాలి. తరువాత ఒక స్టడీ ప్లాన్‌ను తయారు చేసుకుని ముందుకు సాగాలి.. మాక్ టెస్ట్‌లు, గత సంవత్సరం ప్రశ్నపత్రాల ఆధారంగా ప్రిపరేషన్ స్థాయిలను అంచనా వేసుకోవాలి. నిలకడైన ప్రిపరేషన్, చదివిన విషయాలను బాగా ఆకళింపు చేసుకోగలగడం, టైమ్ మేనేజ్‌మెంట్ తదితరాలు విజయానికి దగ్గరి మెట్లు.
సిలబస్, ఎగ్జామ్ ప్యాట్రన్: ఇంగ్లిష్, కరెంట్ అఫైర్స్ జనరల్ నాలెడ్జ్, లీగల్ రీజనింగ్, లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ టెక్నిక్స్ చాప్టర్లలను క్షుణ్ణంగా ప్రాక్టీస్ చేయాలి. ప్రిపరేషన్‌లో రోజు, వారం, నెలవారీ లక్ష్యాలను పెట్టుకోవాలి. క్రమం తప్పకుండా రివైజ్ చేసుకోవాలి.
సెక్షన్ వెయిటేజీ: ప్రతీ సెక్షన్‌లో చాప్టర్ల వెయిటేజీని అర్థం చేసుకోవాలి. దానికి అనుగుణంగా ప్రిపరేషన్ మొదలుపెట్టాలి. సబ్జెక్టుల వారీగా టైమ్‌టేబుల్ పెట్టుకోవాలి. బలహీనంగా ఉన్న వాటిని వదిలేయకుండా, దానిపై దృష్టిపెట్టాలి.
మార్కింగ్ స్కీమ్: క్లాట్‌లో నెగెటివ్ మార్కింగ్ ఉంది. ర్యాండమ్ గెస్ వర్క్ మానేసి, తెలిసిన సమాధానాలు గుర్తించడం మంచిది.

క్లాట్‌లో పాల్గొనే విద్యా సంస్థలు

- నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ(బెంగళూరు)
- నేషనల్ అకాడమి ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆఫ్ లా(నల్సార్-హైదరాబాద్)
- నేషనల్ లా యూనివర్సిటీ(జోధ్‌పూర్)
- నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ(ఎన్ఎల్‌యూ-భోపాల్)
- ద వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జురిడికల్ సైన్సెస్(కోల్‌కతా)
- హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ(రాయ్‌పూర్)
- గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ(గాంధీనగర్)
- డాక్టర్ రామ్ మనోహర్ లోహియా నేషనల్ లా యూనివ్సటీ (లఖనవ్)
- రాజీవ్ గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా(పటియాలా)
- చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ, పట్నా
- నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్(కోచి)
- నేషనల్ లా యూనివర్సిటీ ఒడిషా(కటక్)
- నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ స్టడీ అండ్ రీసెర్చ్ ఇన్ లా(రాంచీ)
- నేషనల్ లా యూనివర్సిటీ అండ్ జుడీషియల్ అకాడమి(అస్సాం)
- దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ(విశాఖపట్నం)
- ద తమిళనాడు నేషనల్ లా యూనివర్సిటీ(తిరుచిరాపల్లి)
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ(ముంబాయి)
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ(నాగపూర్)
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ(ఔరంగాబాద్)
- హిమాచల్ ప్రదేశ్ నేషనల్ లా యూనివర్సిటీ(సిమ్లా)
- ధర్మశాస్త్ర నేషనల్ లా యూనివర్సిటీ(జబల్‌పూర్)
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ లా యూనివర్సిటీ(సోనేపత్-హర్యాన)
- నేషనల్ లా యూనివర్సిటీ త్రిపుర(అగర్తల)
- గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ(సిల్వెస్సా)

(ఇవి కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న పలు ప్రైవేటు కళాశాలలు క్లాట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తున్నాయి)

దిక్సూచి

ఎస్‌బీఐలో జూనియర్ అసిస్టెంట్లు

ఖాళీలు 6589

జూనియర్ అసోసియేట్స్(కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్) ఉద్యోగాల భర్తీకి సంబంధించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతోంది. దేశ వ్యాప్తంగా మొత్తం 6589 పోస్టులు ఉన్నాయి.
పోస్ట్‌పేరు: జూనియర్ అసోసియేట్స్(కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్)
అర్హతలు: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. ఫైనలియర్ చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే 2025 డిసెంబర్ 31లోపు గ్రాడ్యుయేషన్ పరీక్ష పాసైనట్లు సర్టిఫికెట్ చూపించాలి.
వయస్సు: 20 నుంచి 28 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1997 ఏప్రిల్ 2నుంచి 2005 ఏప్రిల్ 1వ తేదీలోపు జన్మించి ఉండాలి. ఓబీసీలకు మూడు సంవత్సరాలు, ఎస్సీ/ఎస్టీలకు ఐదు సంవత్సరాలు, దివ్యాంగులకు కేటగిరీలను అనుసరించి 10 నుంచి 15 సంవత్సరాలు వయస్సులో సడలింపు ఉంటుంది. మాజీ సైనికులకు, ఇతరులకు నిబంధలను అనుసరించి సడలింపు ఉంటుంది.
భాషా ప్రావీణ్యం: దరఖాస్తు చేస్తున్న రాష్ట్రానికి సంబంధించిన భాష రాయడం, చదవడం వచ్చి ఉండాలి. పది, ఇంటర్‌లో ఆ భాష చదివినట్లు సర్టిఫికెట్ చూపించాల్సి ఉంటుంది.
చివరి తేదీ: 2025 ఆగస్టు 26
వెబ్‌సైట్: sbi.co.in/

State Bank of India

బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్లు

ఖాళీలు 417

సేల్స్, అగ్రి మార్కెటింగ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న మేనేజర్, ఆఫీసర్ పోస్టుల భర్తీకి బ్యాంక్ ఆఫ్ బరోడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు పేరు ఖాళీలు:
- మేనేజర్ (సేల్స్) - 227 పోస్టులు
- అగ్రి మార్కెటింగ్ ఆఫీసర్ - 142 పోస్టులు
- అగ్రి మార్కెటింగ్ మేనేజర్ - 48 పోస్టులు

అర్హత: గ్రాడ్యుయేషన్‌తోపాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, సైకో మెట్రిక్ టెస్ట్, ఇంటర్వ్యూ
చివరి తేదీ: 2025 ఆగస్టు 26
వెబ్‌సైట్: www.bankofbaroda.in/

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda


జాబ్ కార్నర్

వాయుసేనలో అగ్నివీర్



భారత వాయుసేనలో 'అగ్నివీర్ వాయు' నియామకాల కోసం అవివాహితులైన పురుషుల నుంచి దరఖాస్తులను కోరుతున్నారు. అగ్నివీర్‌గా ఉన్న నాలుగు సంవత్సరాలు వివాహం చేసుకోరాదు. అభ్యర్థి శరీరం మీద ఎలాంటి టాటూలు ఉండకూడదు. ఇది క్రీడా కోటాకు సంబంధించిన నోటిఫికేషన్. రిక్రూట్‌మెంట్ ట్రయల్స్ సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు జరుగుతాయి.
అర్హత: మేథ్స్, ఫిజిక్స్‌లతో ఇంటర్ చదివి, కనీసం 50 శాతం మార్కులతో పాసై ఉండాలి. లేదా ఇంజనీరింగ్‌లో డిప్లొమా ఉండాలి. నాన్ సైన్స్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు(పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు). వీటితోపాటు నిర్ణీత శారీరక ప్రమాణాలు, స్పోర్ట్స్ అచీవ్‌మెంట్స్ ఉండాలి.
వయస్సు: 2025 జనవరి 1 నుంచి 2008 జూలై1 తేదీ మధ్యలో జన్మించి ఉండాలి.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
ఎంపిక: డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, స్పోర్ట్స్ నైపుణ్య పరీక్షలు(క్రీడా విభాగాల ప్రకారం), మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాలు చూస్తారు.
ట్రయల్స్ వేదిక: తేజస్ క్యాంపస్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్, న్యూఢిల్లీ, లోక్ కల్యాణ్ మార్గ్, న్యూఢిల్లీ
చివరి తేదీ: 2025 ఆగస్టు 20 **వెబ్‌సైట్:** agnipathvayu.cdac.in/AV/

ఇంజనీరింగ్ డిగ్రీతో ఇండియన్ ఆర్మీలోకి



ఇండియన్ ఆర్మీలో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం షార్ట్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ వెలువడింది. ఈ టెక్నికల్ పోస్టులకు రాత పరీక్ష లేదు. బీటెక్ మార్కులను వడపోసి ఇంటర్వ్యూకు పిలుస్తారు. రెండు దశల్లో, ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఇంటర్వ్యూలో రాణించాలి. ఆ తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉద్యోగంలోకి తీసుకుంటారు. చదువుకున్న బ్రాంచీలో ఉద్యోగం చేయవచ్చు.

ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో 49 వారాలు శిక్షణ ఉంటుంది. ఇది 2026 ఏప్రిల్‌లో మొదలు అవుతుంది. శిక్షణ సమయంలో 56,100 స్టయిఫండ్ ఇస్తారు. ఆ తర్వాత 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్' పేరుతో మద్రాస్ యూనివర్సిటీ డిగ్రీ ఇస్తుంది. శిక్షణ అనంతరం లెవెల్ 10లో లెఫ్టినెంట్ హోదాలో ఆర్మీలోకి తీసుకుంటారు. అన్నీ కలుపుకుని తొలి నెల నుంచి దాదాపుగా 1.5 లక్షల జీతం వస్తుంది. ఎస్ఎస్‌సీలో పదేళ్ల సర్వీస్ ఉంటుంది. ఆ తర్వాత ఇందులో కొంత మందిని పర్మనెంట్ కమిషన్‌లోకి తీసుకుంటారు. మిగిలిన వారికి మరో నాలుగేళ్ల సర్వీస్ పొడగింపు ఇస్తారు. వీరు రెండేళ్ల అనుభవంతో కెప్టెన్, ఆరేళ్ల అనుభవంతో మేజర్, 13 ఏళ్ల అనుభవంతో లెఫ్టినెంట్ కల్నల్ హోదాకు చేరుకోవచ్చు.
ఖాళీల వివరాలు: మొత్తం 379 ఖాళీలు ఉన్నాయి. ఇందులో పురుషులకు 350, మహిళలకు 29 ఉన్నాయి.(వీటిలో రెండు సైనిక వితంతువులకు కేటాయించారు). పురుషుల పోస్టుల్లో విభాగాల వారీగా చూస్తే సివిల్ 75, కంప్యూటర్ 60, ఎలక్ట్రికల్ 33, ఎలక్ట్రానిక్స్ 64, మెకానికల్ 101, మిగతా బ్రాంచీల్లో 17 ఉన్నాయి, మహిళల పోస్టుల్లో సివిల్ 7, కంప్యూటర్ సైన్స్ 4, ఎలక్ట్రికల్ 3, ఎలక్ట్రానిక్స్6, మెకానికల్ 9 ఉన్నాయి.
విద్యార్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉండాలి. ఫైనలియర్ చదివే విద్యార్థులు కూడా అర్హులే. వారు నిర్ణీత సమయంలో డిగ్రీని సమర్పించాల్సి ఉంటుంది. కంప్యూటర్ సైన్స్ ఖాళీలకు బీటెక్ ఐటీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.



వయస్సు: 2026 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 20 నుంచి 27 ఏళ్ల లోపు ఉండాలి. అంటే 1999 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2006 మార్చి 31 తేదీలోపు జన్మించి ఉండాలి. సైన్య వితంతువుల వయస్సు 35 సంవత్సరాలు దాటి ఉండకూడదు.
చివరి తేదీ: 2025 ఆగస్టు 22 తేదీ
వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం

ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్



ఫెడరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులతో ఫిల్మ్ ఛాంబర్ జరిపిన చర్చలు విఫలమవడంతో సినీ కార్మికులు ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 24 క్రాఫ్ట్ విభాగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సెవెన్ ఎకర్స్ వద్ద ఉన్న యూనియన్ కార్యాలయాల నుంచి వెంకటగిరిలోని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫెడరేషన్ కార్యాలయం వద్ద ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ మీడియాతో మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. 'కొందరికి పెంచి మిగతా వారికి పెంచకపోవడం అన్యాయం. మొదటి ఏడాది 20 శాతం, మరో ఏడాది 10 శాతం పెంచాలని కోరుతున్నాం. దానికి ఛాంబర్ ఒప్పుకోవడం లేదు. వాళ్ల కండీషన్లకు మేము తలొగ్గేది లేదు. షెడ్యూల్‌లో ఉన్న షూటింగ్స్‌కి రెండు రోజుల గడువు ఇస్తున్నాం. ఆ తరవాత షూటింగులన్నీ బంద్ చేస్తాం. మెగాస్టార్ చిరంజీవి టచ్‌లోనే ఉన్నారు. కానీ, మేము ఫిల్మ్ ఛాంబర్ వద్దనే తేల్చుకుంటాం. రెండు రోజుల్లో లేబర్ కమిషనర్‌ను కలుస్తాం. అప్పటికీ మా సమస్య పరిష్కారం కాకపోతే ఛాంబర్‌ను ముట్టడించి నిరాహార దీక్ష చేస్తాం. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు వచ్చే వరకు ఆయన చిత్రాల షూటింగ్‌లకు హాజరుకాబోము. విశ్వప్రసాద్‌కు చెందిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సినీ కార్మికులకు రూ.90 లక్షల బకాయి ఉంది. ఛాంబర్ నిర్ణయం మేరకే తుది కార్యాచరణ ఉంటుంది' అని వల్లభనేని అనిల్ అన్నారు.
-ఆంధ్రజ్యోతి(యూసుఫ్‌గూడ)

నన్నెవరూ ఆపలేరు

ఎన్టీఆర్



'నందమూరి తారక రామారావు ఆశిస్సులు నా మీద ఉన్నంత కాలం నన్నెవరూ ఆపలేరు. ఎవరేన్ని మాట్లాడుకున్నా.. బొమ్మ అదిరిపోయింది. పండగ చేసుకోండి. సినిమాలో ట్విస్ట్‌లు చాలా ఉన్నాయి. చూసిన తర్వాత మీరు వాటిని బయటపెట్టకండి. ఇది హిందీ చిత్రమే కాదు తెలుగు సినిమా కూడా' అని అన్నారు జూనియర్ ఎన్టీఆర్. హృతిక్ రోషన్‌తో కలసి ఆయన నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ 'వార్-2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. కియారా అద్వాని కథానాయిక. సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఎన్టీఆర్ మాట్లాడుతూ 'ఇద్దరు స్టార్స్‌ని పెట్టుకుని అయాన్ ముఖర్జీ మూవీని ఈ స్థాయిలో తీయడం నిజంగా అద్భుతం. 25 ఏళ్ల క్రితం 'కహోనా ప్యార్ హై' చిత్రంలో హృతిక్ డ్యాన్స్ చూసి మైమరచిపోయాను. ఇండియాలో ఉన్న గొప్ప నటుల్లో హృతిక్ ఒకరు. ఆయనతో కలసి డ్యాన్స్ చేయడం నా అదృష్టం. ఇది ఎన్టీఆర్ చేస్తున్న హిందీ మూవీ కాదు, హృతిక్ చేస్తున్న తెలుగు సినిమా కూడా. రామోజీరావు గారు తన బేనర్‌లో నన్ను పరిచయం చేశారు. అప్పుడు అలా మొదలైన నా జర్నీ 25 ఏళ్లు సాగింది' అని అన్నారు. హృతిక్ రోషన్ మాట్లాడుతూ ' తెలుగు ప్రేక్షకుల ప్రేమను మర్చిపోలేను. నేను నటించిన ప్రతి సినిమాను ఆదరించారు. 'వార్-2' కూడా మీకు వినోదాన్ని పంచుతుంది. మేము చాలా కష్టపడి పనిచేశాం. ఈ ప్రయాణంలో తారక్ నుంచి స్ఫూర్తిని పొందాను' అని అన్నారు. చిత్ర దర్శకుడు అయాన్ ముఖర్జీ మాట్లాడుతూ 'ఇప్పటిదాకా మీరు ట్రైలర్, సాంగ్స్, ఫైట్ సీక్వేన్సెస్ చూశారు. వీటన్నింటినీ మించిన ఆశ్చర్యం ఈనెల 14న చూడబోతున్నారు. ఆ రోజు మీ స్పందన కోసం ఎదురు చూస్తున్నాను' అని అన్నారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ 'ఈ సినిమా మీకు నచ్చకపోతే ఇంకోసారి మైక్ పట్టుకొని సినిమా చూడండి అని అనను. ఎందుకంటే అంత అద్భుతంగా ఉంటుందీ చిత్రం' అని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

ఒకేసారి ఆరు సినిమాలు ఖరారు



ప్రముఖ నిర్మాణ సంస్థ 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఒకేసారి ఆరు కొత్త సినిమాలకు స్క్రిప్ట్‌లు సిద్ధం చేసింది. ఈ సందర్భంగా నిర్మాతలు విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'వచ్చే రెండేళ్లలో విభిన్న కథలతో ఈ ఆరు సినిమాలను తెరకెక్కించి వరుసగా విడుదల చేస్తాం. ప్రతి సినిమా మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. మంచి క్వాలిటీ కంటెంట్‌తో రూపొందిస్తున్నాం. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటిస్తాం' అని చెప్పారు.

కథనం భావోద్వేగభరితం



గగన్‌బాబు, కళికా కపూర్ జంటగా ఏకే జంపన్న దర్శకత్వం వహిస్తున్న చిత్రం షూటింగ్ ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు షాట్‌కు నిర్మాత సాహు గారపాటి క్లాప్ ఇచ్చారు. వివేక్ కూచిభొట్ల కెమెరా స్విచ్చాన్ చేశారు. వీరశంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఇదొక ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్ అని జంపన్న చెప్పారు. మా గోల్డెన్ ప్రొడక్షన్స్‌లో వస్తున్న తొలి చిత్రమిది. అద్భుతమైన కథతో తెరకెక్కిస్తున్నాం. ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అని నిర్మాత తోట లక్ష్మీ కోటేశ్వరరావు అన్నారు.

మరొక్కసారి అలరించే ప్రేమకథ



నరేశ్ అగస్త్య, సంజనా సారథి జంటగా నితిన్ లింగుట్ల దర్శకత్వం వహించిన చిత్రం 'మరొక్కసారి'. బి. చంద్రకాంత్ రెడ్డి నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. 'ఓ జంట జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో ఆహ్లాదకరకమైన ప్రేమకథతో 'మరొక్కసారి' తెరకెక్కించాం. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని మేకర్స్ తెలిపారు.

మురళీ, అన్నూలకు స్వర్ణాలు

భారత అథ్లెట్ల సత్తా
వరల్డ్ కాంటినెంటల్ టూర్


అనిమేష్ కుజూర్
అన్నూ రాణి
మురళీ శ్రీశంకర్

భువనేశ్వర్: వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ బ్రాంజ్ లెవెల్ ఈవెంట్‌లో భారత అథ్లెట్లు సత్తా చాటారు. ఆదివారం ఒక్క రోజుపాటు జరిగిన ఈ పోటీల్లో ఫేవరెట్లుగా బరిలోకి దిగిన లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్, స్టార్ స్ప్రింటర్ అనిమేష్ కుజూర్, వెటరన్ జావెలిన్ త్రోయర్ అన్నూ రాణి అంచనాలను నిలబెట్టుకున్నారు. 17 దేశాల నుంచి 150 మంది అథ్లెట్లు పాల్గొనగా, వీరంతా 19 ఈవెంట్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. భారత్ నుంచే మొత్తంగా 90 మంది ఆటగాళ్లు ఉండడం విశేషం. అలాగే ఇది ఇన్విటేషనల్ టోర్నీ కావడంతో భారత్ నుంచి పాల్గొన్న అథ్లెట్లంతా వ్యక్తిగత విభాగాల్లో తమ రాష్ట్రాలు, పని చేసే సంస్థల తరఫున బరిలోకి నిలిచారు. లాంగ్‌జంప్‌లో మురళీ శ్రీశంకర్‌కు కాస్త పోటీ ఎదురైనా చివరిదైన ఆరో రౌండ్‌లో అత్యధికంగా 8.13మీ. దూరం దూకి స్వర్ణం సాధించాడు. మొత్తంగా తను రెండుసార్లు ఫౌల్ అయ్యాడు. అయితే టోక్యో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌కు అర్హత దూరాన్ని (8.27మీ) మాత్రం మురళీ అందుకోలేకపోయాడు. యూపీకి చెందిన 17 ఏళ్ల షానవాజ్ ఖాన్ (8.04మీ), కర్ణాటక అథ్లెట్ లోకేష్ సత్యనాథన్ (7.85మీ) రెండు, మూడో స్థానాల్లో నిలిచారు. అలాగే అందరి దృష్టిని ఆకర్షించిన స్టార్ జావెలిన్ త్రోయర్, ఆసియా గేమ్స్ చాంపియన్ అన్నూ రాణి 62.01మీ. దూరం బల్లెం విసిరి టాప్‌లో నిలిచింది. ఆరు రౌండ్లలోనూ తను ఫౌల్ కాకపోవడం విశేషం. అయితే పురుషుల విభాగంలో మాత్రం సచిన్ యాదవ్ 79.80మీ. దూరంతో ఐదో స్థానంలో నిలిచి నిరాశపర్చాడు. ఇక మహిళల లాంగ్‌జంప్‌లో షైలీ సింగ్ (యూపీ, 6.28మీ) టాప్‌లో నిలిచి స్వర్ణం అందుకుంది. ఆ తర్వాతి స్థానాలను భవానీ యాదవ్ (రైల్వేస్, 6.13మీ), సంద్ర బాబు (జేఎస్‌డబ్ల్యూ 6.10మీ) దక్కించుకున్నారు.

కుజూర్‌కు 200మీ. టైటిల్

పురుషుల 200మీ. పరుగు పందెంలో అనిమేష్ కుజూర్ (ఒడిశా) అదరగొట్టాడు. 20.77 సెకన్ల టైమింగ్‌తో తను పోడియం సాధించాడు. అయితే 100మీ. రేసులో మన అథ్లెట్లు నిరాశపర్చారు. నాలుగో స్థానంలో నిలిచిన లాలూ ప్రసాద్ భోయ్ (10.54సె)దే భారత్ తరఫున ఉత్తమ ప్రదర్శన కావడం గమనార్హం. 800 మీ. పరుగులో మహ్మద్ అఫ్జల్ (ఎయిర్‌ఫోర్స్, 1:46.60సె.) తొలి స్థానం దక్కించుకున్నాడు. ప్రకాష్ గడగె (మహారాష్ట్ర, 1:47.14), క్రిషన్ కుమార్ (హరియాణా, 1:48.00) ఆ తర్వాత నిలిచారు. పురుషుల 4x400మీ.రిలేలో భారత్ 'ఎ' టీమ్ 3:08.37 టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచింది.


సిరాజ్, అజరుద్దీన్, మొహిందర్ అమర్‌నాథ్


కిర్మాణీ

కిర్మాణీ నాకు స్ఫూర్తి
మహ్మద్ సిరాజ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దిగ్గజ క్రికెటర్, 1983 వరల్డ్‌కప్ హీరో సయ్యద్ కిర్మాణీ తనలాంటి ఎందరో క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలిచారని మహ్మద్ సిరాజ్ అన్నాడు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కిర్మాణీ ఆత్మకథ 'స్టంప్డ్' పుస్తక ఆవిష్కరణకు సిరాజ్ ముఖ్య అతిథిగా విచ్చేశాడు. ఈ సందర్భంగా సిరాజ్ మాట్లాడుతూ టీమిండియా 1983 వన్డే ప్రపంచకప్ గెలిచేనాటికి తాను పుట్టలేదని, కానీ తాను క్రికెట్ ఆడడం ప్రారంభించినప్పటి నుంచి ఆయన గురించి గొప్పగా విని స్ఫూర్తి పొందానని చెప్పాడు. 1983 వరల్డ్‌కప్ నెగ్గిన భారత జట్టు సభ్యుడు మొహిందర్ అమర్‌నాథ్ మాట్లాడుతూ కిర్మాణీతో కలిసి తాను పాఠశాల స్థాయి నుంచే క్రికెట్ ఆడానని చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నాడు. మహ్మద్ అజరుద్దీన్ మాట్లాడుతూ తాను చూసిన అత్యుత్తమ వికెట్‌కీపర్ కిర్మాణీనేనని చెప్పాడు. కాగా ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినప్పుడు, ఆయన టీవీ చూడడం ప్రారంభించేసరికి క్రికెటర్లలో కపిల్‌దేవ్, తాను తప్ప మరెవరూ తెలియదని, మీరు మాకు అంత పెద్ద ఐకానిక్ ప్లేయర్ అని చెప్పేసరికి సంతోషం పట్టలేకపోయానని కిర్మాణీ చెప్పాడు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్, మాజీ క్రికెటర్లు శివ్‌లాల్ యాదవ్, చాముండేశ్వర్ నాథ్, భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఫామ్‌లో ఉంటే ఆడించాలి
విరాట్, రోహిత్‌లపై గంగూలీ



న్యూఢిల్లీ: టెస్టు, టీ20 ఫార్మాట్ల నుంచి వైదొలిగి కేవలం వన్డేలకే పరిమితమైన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల కెరీర్‌పై ఊహాగానాలు వెలువడుతున్నాయి. అక్టోబరులో ఆసీస్ టూర్ తర్వాత ఈ జోడీ పూర్తిగా క్రికెట్‌కు దూరమవుతారని అంటున్నారు. ఈనేపథ్యంలో మాజీ కెప్టెన్ గంగూలీ వారికి మద్దతుగా నిలిచాడు. 'వారి రిటైర్మెంట్ వార్తలపై నేనేమీ స్పందించను. ఎప్పుడు వైదొలుగుతారనేది చెప్పడం కష్టం. కానీ ఫామ్‌లో ఉన్నంతకాలం కొనసాగించడమే మంచిది. వన్డే ఫార్మాట్‌లో విరాట్, రోహిత్‌ల రికార్డు అద్భుతంగా ఉంది' అని దాదా గుర్తుచేశాడు. గతేడాది టీ20 వరల్డ్‌కప్ తర్వాత పొట్టి ఫార్మాట్‌కు, ఇటీవలి ఇంగ్లండ్ పర్యటనకు ముందే టెస్టు ఫార్మాట్‌కు ఈ స్టార్ బ్యాటర్లు వీడ్కోలు పలికారు.

అర్జున్‌కు సరీన్ షాక్
చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్

చెన్నై : చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ నాలుగో రౌండ్‌లో అర్జున్ ఇరిగేసి అనూహ్య పరాజయం చవిచూశాడు. ఆదివారం 70 ఎత్తులపాటు హోరాహోరీగా జరిగిన గేమ్‌లో నిహాల్ సరీన్ తనకంటే ఎంతో మెరుగైన అర్జున్‌కు షాకిచ్చాడు. అలాగే కార్తికేయన్.. ముళి-వాన్ ఫోరెస్ట్‌పై గెలుపొందాడు. ప్రణవ్-విదిత్ గుజ్‌రాతీ, విన్సెంట్ కీమర్-అనీష్ గిరి, రే రాబ్సన్-లియాంగ్ గేమ్‌లు డ్రాగా ముగిశాయి. ఈ రౌండ్ అనంతరం జర్మన్ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమర్ (3.5), జీఎం అర్జున్ (2.5) తొలి రెండు స్థానాలలోనే కొనసాగుతున్నారు. చాలెంజర్స్ విభాగంలో.. ద్రోణవల్లి హారికకు మరో పరాజయం ఎదురైంది. నాలుగో రౌండ్‌లో భారత జీఎం ల్యూక్ మెన్డోన్కా 59 ఎత్తులలో హారికపై గెలుపొందాడు. అభిమన్యు పురనిక్-వైశాలిపై, ఇనియన్-ఆర్యాన్ చోప్రాపై, దీప్తాయన్ ఘోష్- హర్షవర్ధన్‌పై విజయం సాధించారు.

రమేష్‌కు చారిత్రక కాంస్యం



చెన్నై: ఆసియా సర్ఫింగ్ చాంపియన్‌షిప్స్ పురుషుల ఓపెన్ విభాగంలో రమేష్ బుధియాల్ కాంస్యపతకం సాధించాడు. తద్వారా ఈ పోటీలలో పతకం అందుకున్న తొలి భారత సర్ఫర్‌గా చరిత్ర సృష్టించాడు. మొత్తం 12.60 పాయింట్లతో రమేష్ తృతీయ స్థానం దక్కించుకున్నాడు. కొనోవా (కొరియా) స్వర్ణం (15.17 పాయింట్లు) సొంతం చేసుకోగా, పజర్ (ఇండోనేసియా-14.57 పాయింట్లు) రజతం కైవసం చేసుకున్నాడు. మహిళల ఓపెన్ కేటగిరీలో మత్సునో (జపాన్, 14.90) స్వర్ణం, సాటో (జపాన్, 13.70) రజతం, ఇసబెల్ హిగ్స్ (థాయ్‌లాండ్, 11.76) కాంస్యం గెలుపొందారు.

టిమ్ డేవిడ్ ధనాధన్
తొలి టీ20లో ఆసీస్ గెలుపు

డార్విన్ (ఆస్ట్రేలియా) : టిమ్ డేవిడ్ (52 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్సలతో 83) ధనాధన్ బ్యాటింగ్‌తో దక్షిణాఫ్రికాతో ఆదివారం జరిగిన తొలి టీ20లో ఆస్ట్రేలియా 17 పరుగులతో నెగ్గింది. టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. ఎంపాక నాలుగు, రబాడ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 161/9 స్కోరుకే పరిమితమై ఓడింది. రికెల్టన్ (71), స్టబ్స్ (37) దుకుడైన ఆటతో జట్టును విజయం దిశగా నడిపించినా..15వ ఓవర్లో స్టబ్స్‌ను అవుట్ చేసిన హాజెల్‌వుడ్ సఫారీలను దెబ్బ కొట్టాడు. డ్వార్షుయిస్, హాజెల్‌వుడ్ చెరో మూడు వికెట్లు, జంపా రెండు వికెట్లు తీశారు. ఇక.ఆసీస్‌కిది రికార్డు స్థాయిలో వరుసగా తొమ్మిదో టీ20 విజయం కావడం విశేషం.

నిషా, ముస్కాన్, రాహుల్ పసిడి పంచ్
ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్



బ్యాంకాక్ : ఆసియా అండర్-19 చాంపియన్‌షిప్‌లో ఆదివారం ముగ్గురు భారత బాక్సర్లు స్వర్ణ పతకాలు కొల్లగొట్టారు. మహిళల 54 కి. విభాగంలో ఫైనల్లో నిషా 4-1తో సిరుయాంగ్ (చైనా)ను చిత్తు చేసి పసిడి పతకం దక్కించుకుంది. మహిళల 57 కి. కేటగిరీ తుది పోరులో ముస్కాన్ 3-2తో అయజన్ ఎర్మెక్ (కజకిస్థాన్)ను ఓడించి స్వర్ణం సొంతం చేసుకుంది. పురుషుల 75 కి. టైటిల్ ఫైట్‌లో రాహుల్ కుందు 4-1తో మహ్మదన్ (ఉజ్బెకిస్థాన్)పై గెలిచి బంగారు పతకం చేజిక్కించుకున్నాడు. మౌసమ్ సుహాగ్ (65 కి.), హేమంత్ సంగ్వాన్ (90 కి.) అంతిమ పోరులో పరాజయంతో రజత పతకాలు అందుకున్నారు. అండర్-19 విభాగంలో భారత్ మొత్తం 14 (3-7-4) పతకాలతో అదరగొట్టింది. బరిలోకి దిగిన 10 మంది మహిళా బాక్సర్లలో తొమ్మిదిమంది పతకాలు గెలుపొందడం విశేషం. ఇందులో రెండు స్వర్ణ, ఐదు రజత, రెండు కాంస్య పతకాలున్నాయి. అండర్-22 విభాగంలో భారత్ 13 పతకాలు ఖాయం చేసుకుంది. సోమవారం జరిగే ఫైనల్స్‌లో మనోళ్లు ఐదుగురు తలపడనున్నారు. అండర్-19, అండర్-22 కేటగిరీల్లో భారత్ తరఫున మొత్తం 40 మంది బాక్సర్లు బరిలో నిలిచారు.

టైటిల్ పోరుకు హరియాణా, జార్ఖండ్
జాతీయ జూ.మహిళల హాకీ

కాకినాడ : జాతీయ జూనియర్ మహిళల హాకీ టైటిల్ కోసం హరియాణా, జార్ఖండ్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆదివారం ఇక్కడ జరిగిన తొలి సెమీఫైనల్లో హరియాణా 3-0తో ఛత్తీస్‌గఢ్‌పై విజయం సాధించింది. కెప్టెన్ శశి (8వ నిమిషం), సుప్రియ (45, 47 ని.) హరియాణా తరఫున గోల్స్ చేశారు. రెండో సెమీస్‌లో జార్ఖండ్ 3-0తో ఉత్తరప్రదేశ్‌ను ఓడించింది. స్వీటీ (13వ ని.), రీనా (56), కెప్టెన్ రజని (59) జార్ఖండ్‌కు గోల్స్ అందించారు. ఫైనల్ సోమవారం జరుగుతుంది. కాగా మూడో స్థానం కోసం ఛత్తీస్ గఢ్, ఉత్తరప్రదేశ్ తలపడతాయి.

సైలేషియా డైమండ్ లీగ్‌కు నీరజ్, నదీమ్ దూరం

న్యూఢిల్లీ : భారత సూపర్ స్టార్ నీరజ్ చోప్రా, పాకిస్థాన్‌కు చెందిన పారిస్ ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్ మధ్య పోటీకోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్న అథ్లెటిక్స్ అభిమానులను నిరాశ పరిచే వార్త ఇది. ఈనెల 16న పోలెండ్‌లోని సైలేషియాలో జరిగే డైమండ్ లీగ్‌లో ఈ వీరిద్దరూ తలపడడంలేదు. చోప్రా ఏ కారణంతో సైలేషియా మీట్‌లో తలపడడంలేదో తెలియరాలేదు. ఇక.కండర గాయానికి శస్త్రచికిత్స చేయించుకోవడంతో నదీమ్ బరిలోకి దిగడంలేదు.

ఆసీస్ 'ఎ' క్లీన్‌స్వీప్
0-3తో భారత్ 'ఎ' చిత్తు

మెకే (ఆసీస్): ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ 'ఎ' మహిళల జట్టు పేలవ ప్రదర్శన కొనసాగుతూనే ఉంది. ఆదివారం జరిగిన అనధికార మూడో టీ20లోనూ నాలుగు పరుగుల తేడాతో ఓడింది. దీంతో ఆసీస్ మహిళల 'ఎ' జట్టు ఈ సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 144 పరుగులు చేసింది. మెడెలిన్ పెన్నా (39), అలీసా హీలీ (27) రాణించారు. స్పిన్నర్లు ప్రేమ రావత్, రాధా యాదవ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత మహిళలు 20 ఓవర్లలో 8 వికెట్లకు 140 పరుగులు చేశారు. ఓపెనర్ షఫాలీ (41), మిన్ను మణి (30), రఘ్వీ బిస్త్ (25) పర్వాలేదనిపించారు. సియానా జింజర్‌కు నాలుగు వికెట్లు దక్కాయి.

20 ఏళ్ల తర్వాత భారత్ క్వాలిఫై
ఆసియా కప్ అండర్-20 ఫుట్‌బాల్ టోర్నీ

యాంగాన్ (మయన్మార్) : అండర్-20 మహిళల ఆసియా కప్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌నకు భారత జట్టు అర్హత సాధించింది. ఆదివారం జరిగిన గ్రూప్-డి తుది క్వాలిఫయింగ్ పోరులో భారత మహిళలు 1-0తో మయన్మార్‌పై గెలుపొందారు. 27వ నిమిషంలో పూజ కీలకమైన గోల్ అందించింది. ఏడు పాయింట్లతో గ్రూప్-డి టాపర్‌గా నిలిచిన భారత్ 2026లో థాయ్‌లాండ్‌లో జరిగే ఆసియా కప్‌నకు క్వాలిఫై అయ్యింది. రెండు దశాబ్దాల తర్వాత భారత్ ఆ టోర్నీకి అర్హత పొందడం విశేషం. ఆసియా కప్‌నకు క్వాలిఫై అయిన భారత జట్టుకు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య రూ. 22 లక్షల నజరానా ప్రకటించింది.

బిజినెస్

ఎయిర్ ఇండియా 'ఫ్రీడమ్ సేల్ ' ఆఫర్
రూ.1,279కే టికెట్

కొచ్చి: ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా.. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'ఫ్రీడమ్ సేల్' ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ఆఫర్ కింద దేశీయ, అంతర్జాతీయ సర్వీసుల్లో సుమారు 50 లక్షల సీట్లు అందుబాటులో ఉంటాయి. ధర దేశీయ నెట్‌వర్క్‌లో రూ.1,279; అంతర్జాతీయ నెట్‌వర్క్‌లో రూ.4279 ఉంటుంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఈ ఆఫర్ కింద బుకింగ్స్ కొనసాగుతాయని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఆగస్టు 19 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 మధ్యలో ఈ టికెట్లపై ప్రయాణించే అవకాశం ఉంటుంది.

6 సెషన్లలో రూ.18,000 కోట్లు
ఆగస్టులో ఎఫ్‌పీఐ నిధుల ఉపసంహరణ వెల్లువ



న్యూఢిల్లీ: అమెరికా-ఇండియా వాణిజ్య ఉద్రిక్తతలు ఈక్విటీ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల ఫలితాలు కూడా నిరాశావహంగా ఉండడం, ఫారెక్స్ మార్కెట్లో రూపాయి బలహీనత వంటి పరిణామాలు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లను (ఎఫ్‌పీఐ) నిధుల ఉపసంహరణకు పురి గొల్పుతున్నాయి. ఫలితంగా ఎఫ్‌పీఐలు ఆగస్టు నెలలో ఇంతవరకు అంటే కేవలం ఆరు ట్రేడింగ్ సెషన్లలో రూ.18,000 కోట్ల మేరకు ఈక్విటీలను విక్రయించారు. దీంతో 2025 సంవత్సరంలో ఇప్పటివరకు వారు తరలించుకుపోయిన నిధుల పరిమాణం రూ.1.13 లక్షల కోట్లకు చేరింది. డిపాజిటరీల వద్ద ఉన్న సమాచారం ప్రకారం జూలై నెలలో వారు నికరంగా రూ.17,741 కోట్లు తరలించుకుపోగా ఈ నెల 8వ తేదీ నాటికే నికరంగా రూ.17,924 కోట్లు ఉపసంహరించారు. మార్చి నుంచి జూన్ నెలల మధ్య కాలంలో వారు రూ.38,673 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అయితే ప్రస్తుతం ఎఫ్‌పీఐల సెంటిమెంట్ చాలా బలహీనంగా ఉన్నదని, వారు ఏ మాత్రం రిస్క్ భరించే స్థితిలో లేరని ఏంజెల్‌వన్ సీనియర్ ఫండమెంటల్ అనలిస్ట్ వకర్ జావేద్ ఖాన్ అన్నారు. ప్రధానంగా భారతీయ ఉత్పత్తులపై అమెరికా రెండు దశల్లో 50% సుంకాలు విధించడం సెంటిమెంట్‌పై అధిక ప్రభావం చూపిందని అంటున్నారు. అమెరికన్ ట్రెజరీ రాబడులు మెరుగ్గా ఉండడం విదేశీ ఇన్వెస్టర్లను ఆకర్షిస్తున్న అంశమని ఖాన్ చెప్పారు.

భారత్‌పే లిస్టింగ్ యోచన వాయిదా

పబ్లిక్ ఇష్యూకి రావాలన్న ఆలోచనను భారత్‌పే ప్రస్తుతానికి వాయిదా వేసుకుంది. మార్కెట్ పరిస్థితులు చక్కబడిన తర్వాత మాత్రమే లిస్టింగ్ చేయాలనుకుంటున్నట్టు తెలిపింది. ఈలోగా అవసరం మేరకు ఇతర మార్గాల ద్వారా నిధులు సమీకరించాలని భావిస్తున్నట్టు కంపెనీ సీఈఓ నళిన్ నేగి చెప్పారు. తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను నిర్దేశిత సమయం కన్నా ముందుగానే సాధించామని ఆయన అన్నారు.

19న రెండు ఐపీఓలు

షిప్పింగ్, లాజిస్టిక్ సొల్యూషన్లు అందించే శ్రీజి షిప్పింగ్ గ్లోబల్, సూపర్ మార్కెట్ చెయిన్ పటేల్ రిటైల్ ఈ నెల 19న (వచ్చే మంగళవారం) పబ్లిక్ ఇష్యూలు జారీ చేయనున్నాయి. 21న రెండు ఇష్యూలు ముగుస్తాయి. ఇష్యూలో షేర్ల ధర శ్రేణిని రెండు కంపెనీలు సోమవారం ప్రకటించనున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 44 పబ్లిక్ ఇష్యూలు జారీ అయ్యాయి. బ్లూస్టోన్ జువెలరీ, లైఫ్‌స్టైల్ ఇష్యూలు సోమవారం, ఆగ్రో ఆధారిత సంస్థ రీగల్ రీసోర్సెస్ ఇష్యూ మంగళవారం ప్రారంభం కానున్నాయి.

పసిడి ధర మరింత ముందుకే...


న్యూఢిల్లీ: పసిడి పరుగుకు ఈ వారంలో కూడా బ్రేక్ పడే సూచనలు కనిపించడం లేదు. గత వారం జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధర రికార్డు స్థాయికి చేరింది. ఈ వారం సైతం బులియన్ మార్కెట్‌లో ఈ ర్యాలీ కొనసాగుతుందని మార్కెట్ వర్గాల అంచనా. గత వారం దేశీయ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రికార్డు స్థాయిలో రూ.1.03 లక్షలను అధిగమించింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) ధర గత శుక్రవారం ఒక దశలో రికార్డు స్థాయిలో 3,534.10 డాలర్లకు చేరింది. ప్రస్తుతం కొద్దిగా దిద్దుబాటుకు లోనై 3,400 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఈ వారం ఇది మరింత ముందుకు పరుగులు పెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. "గత నెల 28న రూ.98,079 పలికిన 10 గ్రాముల మేలిమి బంగారం, గత వారం రూ.1.03 లక్షల స్థాయికి చేరింది. ఇదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్స్ పసిడి ధర 3,268 డాలర్ల నుంచి రికార్డు స్థాయిలో 3,534.10 డాలర్లకు చేరింది. ఈ ర్యాలీ ఇప్పట్లో ఆగేలా లేదు" అని ఏంజెల్ వన్ బ్రోకరేజి సంస్థ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ (రీసెర్చి) ప్రతమేశ్ మాల్యా తెలిపారు. పరిస్థితులు ఇలానే కొనసాగితే వచ్చే మూడు నెలల్లో అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ పసిడి ధర 3,800 డాలర్లకు, దేశీయ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి ధర రూ.1.10 లక్షలకు చేరే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

ర్యాలీకి దోహదం చేస్తున్న అంశాలు.

- కొనసాగుతున్న సుంకాల యుద్ధం.
- అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గుతాయనే వార్తలు.
- కొనసాగుతున్న కేంద్ర బ్యాంకుల పసిడి కొనుగోళ్లు.
- ఫారెక్స్, స్టాక్ మార్కెట్లలో కొనసాగుతున్న నష్టాలు.
- తగ్గుతున్న అమెరికా జీడీపీ వృద్ధి రేటు.

నెక్సాకు పదేళ్లు

మార్కెట్లోకి గ్రాండ్ విటారా 'ఫాంటమ్ బ్లాక్'
ప్రారంభ ధర రూ.11.42 లక్షలు



న్యూఢిల్లీ: మారుతి నెక్సా షోరూమ్‌ల నెట్‌వర్క్ ప్రారంభమై పదేళ్లు పూర్తయింది. పదో వార్షికోత్సవ సందర్భంగా కంపెనీ బహుళ జనాదరణ పొందిన ప్రీమియం ఎస్‌యూవీ గ్రాండ్ విటారాకు స్పెషల్ ఎడిషన్ 'ఫాంటమ్ బ్లాక్'ను మార్కెట్లోకి తెచ్చింది. ఈ కారు ఎక్స్ షోరూమ్ ప్రారంభ ధర రూ.11.42 లక్షలు. ఈ కారు ప్రత్యేకమైన మ్యాట్ బ్లాక్ కలర్ ర్యాప్‌లో, స్ట్రాంగ్ హైబ్రిడ్ ఆల్ఫా+ వేరియంట్లలో అందుబాటులోకి వచ్చింది. పనోరమిక్ సన్‌రూఫ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, అధునాతన స్మార్ట్‌ప్లే ప్రో+ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్‌ప్లే, కారియన్ ప్రీమియం సౌండ్ సిస్టమ్ వంటి ఆధునిక ఫీచర్లు ఈ కారులో ఉన్నాయి. 6 ఎయిర్ బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్, ఏబీఎస్+ఈబీడీ, హిల్ హోల్డ్ కంట్రోల్, 360 డిగ్రీ వ్యూ కెమెరా వంటివి దీని ప్రత్యేక ఆకర్షణలు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	510
వరంగల్	472	గోదావరి	505
చిత్తూరు	533	విశాఖపట్నం	530
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	107
వరంగల్	98	గుంటూరు	112
కరీంనగర్	98	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	87
కర్నూలు	98	నెల్లూరు	92
విశాఖపట్నం	102	అనంతపురం	92
గోదావరి	107		

24750 పైన బుల్లిష్
(ఆగస్టు 11-14 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో ట్రెండ్


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ : 24363 (-202)

నిఫ్టీ గత వారం 24744-24344 పాయింట్ల మధ్యన కదలాడి 202 పాయింట్ల నష్టంతో 24363 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24750 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24492, 24616, 24780, 25039 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి : 24750
బ్రేక్‌డౌన్ స్థాయి : 24000
నిరోధ స్థాయిలు : 24575, 24675, 24775 (24475 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు :24150, 24050, 23950 (24250 దిగువన బేరిష్)

మార్కెట్లు పైకా.. కిందకా!

దేశీయ స్టాక్ మార్కెట్లకు ఈ వారం అత్యంత కీలకంగా మారనుంది. కొన్నేళ్ల తర్వాత నిఫ్టీ వరుసగా ఐదు వారాలు నెగటివ్‌గా ముగిసింది. ఏదేమైనా నిర్ణయాత్మక గమనం వైపు సంకేతాలు వస్తే మంచి ర్యాలీకి అవకాశం ఉంటుంది. దాదాపుగా 15 సెషన్ల తర్వాత ఎఫ్ఐఐలు గత శుక్రవారం రూ.1,932 కోట్ల నిధులు ఇన్వెస్ట్ చేయడం సానుకూలాంశం. గత వారం మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, మెటల్ మినహా అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి.

స్టాక్ రికమెండేషన్స్

ఎల్ఐసీ: ప్రస్తుతం ఈ షేర్లు కీలక శ్రేణి రూ.900 పరిధిలో కదలాడుతున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పెరుగుతోంది. తాజా ఫలితాలు బాగుండడంతో ఇన్వెస్టర్ల ఆసక్తి పెరిగింది. గత శుక్రవారం 3.2% లాభంతో రూ. 912 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.1050 టార్గెట్ ధరతో రూ.900 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. రూ. 875 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

బీపీసీఎల్: నెల రోజులుగా ఈ షేర్లు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్నా.. రిలేటివ్ స్ట్రెంత్ మాత్రం పెరుగుతోంది. షార్ట్ టర్మ్ మూమెంటమ్ క్రమంగా పుంజుకుంటోంది. చివరి ఐదు సెషన్ల సగటుతో పోలిస్తే వాల్యూమ్ పెరిగింది. గత శుక్రవారం రూ.319 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.370/390 టార్గెట్ ధరతో రూ.300 శ్రేణిలో ప్రవేశించవచ్చు. రూ.285 స్టాప్‌లాస్‌గా పరిగణించాలి.

టైటాన్: రెండేళ్లుగా ఈ షేర్లు పరిమిత పరిధిలోనే కదలాడుతూ. సైడ్‌వేస్‌లో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుండడం, పండుగల సీజన్ మొదలవడంతోఈ షేరు పట్ల ఇన్వెస్టర్లు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. స్వల్పకాల వ్యవధిలో అప్‌స్వింగ్ నమోదయ్యేలా కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.3460 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.3650/3700 టార్గెట్ ధరతో రూ. 3400 శ్రేణిలో కొనుగోలు చేయవచ్చు. రూ.3360 గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పిడిలైట్ ఇండస్ట్రీస్: మార్చిలో చక్కని అప్‌స్వింగ్ తర్వాత ఈ షేర్లు కన్సాలిడేట్ అయ్యాయి. తాజా కరెక్షన్ తర్వాత మూమెంటమ్ ప్రదర్శిస్తున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. క్రితం వారం డెలివరీ వాల్యూమ్ గణనీయంగా పుంజుకుంది. గత శుక్రవారం రూ. 3081 వద్ద ముగిసిన ఈ షేరును మదుపరులు రూ.3300 టార్గెట్ ధరతో రూ. 3000పై స్థాయిలో కొనుగోలు చేయవచ్చు. గట్టి స్టాప్‌లాస్ రూ.2960.

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్: ఈ ఏడాది మార్చి నుంచి మొదలైన బుల్‌రన్ ప్రస్తుతం నెమ్మదించింది. సరికొత్త అప్‌ట్రెండ్‌కు అవసరమైన దిద్దుబాటు జరిగింది. పైగా ఈ షేర్ల రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ మెరుగ్గా ఉంది. గత శుక్రవారం రూ. 761 వద్ద ముగిసింది. రూ. 880 టార్గెట్ ధరతో రూ. 750 వద్ద ఇన్వెస్ట్ చేయవచ్చు. రూ.725 వద్ద స్టాప్‌లాస్ తప్పనిసరి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ప్రధాన మద్దతు స్థాయి 24000

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మైనర్ రికవరీతో ప్రారంభమైనా తదుపరి నాలుగు రోజులూ బలహీనత ప్రదర్శించింది. కీలక స్థాయి 24,500 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమయించి. చివరికి వారం మొత్తం మీద 202 పాయింట్ల నష్టంతో 24,360 వద్ద ముగిసింది. వరుసగా ఆరు వారాల డౌన్ ట్రెండ్‌లో మార్కెట్ 1200 పాయింట్లు నష్టపోయి ఇప్పుడు కీలక స్వల్పకాలిక మద్దతు స్థాయి 24,000 సమీపంలోకి వచ్చింది. మిడ్‌క్యాప్-100, స్మాల్‌క్యాప్-100 సూచీలు కూడా తీవ్ర నష్టాల్లోనే ముగిశాయి. నిఫ్టీ గత వారంలో 24,500 కన్నా దిగజారినందు వల్ల టెక్నికల్‌గా పుల్‌బ్యాక్ అవకాశం ఉంది. బలమైన బౌన్స్ బ్యాక్ ఏర్పడితే తప్ప మరింత బలహీనతను కొనసాగించే అవకాశాలే ఉన్నాయి.

బుల్లిష్ స్థాయిలు: స్వల్పకాలిక పాజిటివ్ ట్రెండ్ ప్రదర్శించాలంటే మార్కెట్ ప్రస్తుత స్థాయిల్లో పునరుజ్జీవం సాధించి 24,500 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 24700, 25000.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత మద్దతు స్థాయి 24300 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. దిగువన మద్దతు స్థాయిలు 24150, 24000. ఈ 24000 కీలక స్వల్పకాలిక మద్దతు స్థాయి కావడం వల్ల ఇక్కడ కన్సాలిడేషన్ ఉండవచ్చు. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఈ స్థాయిలో నిలదొక్కుకుని బలంగా క్లోజ్ కావాలి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 610 పాయింట్ల మేరకు నష్టపోయి 55,000 సమీపంలో మూడు నెలల కనిష్ఠ స్థాయిలో క్లోజయింది. సానుకూలత కోసం ఈ స్థాయిలో బలంగా క్లోజ్ కావాలి. ప్రధాన నిరోధ స్థాయి 55,600 కన్నా పైన నిలదొక్కుకుంటే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌కు ఆస్కారం ఉంటుంది. ప్రస్తుత స్థాయిలో విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

పాటర్న్: నిఫ్టీ గత వారం ప్రధానమైన 100 డిఎంఎ కన్నా స్వల్పంగా దిగువకు వచ్చింది. 200 డిఎంఎ 24,000 వద్ద ఉంది. అలాగే మార్కెట్ ప్రస్తుతం 24,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఇక్కడ తప్పనిసరిగా బౌన్స్‌బ్యాక్ కావాలి. మార్కెట్ గత వారం మేజర్ బాటమ్ 24,500 వద్ద బ్రేక్‌డౌన్ సాధించింది.

టైమ్ : ఈ సూచీ ప్రకారం మంగళవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24460, 24500
మద్దతు	24300, 24230

ఆర్టీసీ లాభాల్లో ఉంటే తాకట్టు ఎందుకు?

» సర్కార్ సమాధానం చెప్పాలి: ఎంప్లాయీస్ యూనియన్

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఆర్టీసీ(టీజీఎస్ఆర్టీసీ) మహాలక్ష్మి పథకం ద్వారా భారీగా లాభాలు గడించిందని చెప్పి సంబరాలు చేసుకొని వారం రోజులు గడవక ముందే బ్యాంకులకు ఆర్టీసీ ఆస్తులు తాకట్టు పెట్టి అప్పులు తీసుకొనే దుస్థితి ఎందుకు వచ్చిందో సమాధానం చెప్పాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. గౌలిగూడ బస్‌స్టేషన్‌ను రూ.400 కోట్ల బ్యాంకు రుణం కోసం తాకట్టు పెట్టినట్లు పత్రికల్లో కథనం రావడంపై ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ విస్మయం వ్యక్తం చేస్తుందని తెలిపారు. ఈమేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ విషయంపై యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. బాబు, ఈదురు వెంకన్న స్పందిస్తూ.. ప్రభుత్వం, యాజమాన్యం కలిసి తెలంగాణ సమాజాన్ని, ఆర్టీసీ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పడానికి ఇదే నిదర్శనం అని తెలిపారు. అసలు మహాలక్ష్మి 'సున్నా' టికెట్ డబ్బులు ప్రతి నెలా ఆర్టీసీకి ప్రభుత్వం ఎంత ఇస్తున్నది? అన్ని వివరాలతో యాజమాన్యం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. అలాగే ప్రతీ వేదికపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.6,686 కోట్లు ఆర్టీసీకి ఇచ్చినట్లు గొప్పగా చెప్పుకొంటున్నదని గుర్తుచేస్తూ.. ఆర్థిక శాఖ ద్వారా ఇచ్చిన డబ్బుల లెక్కలపై శ్వేతపత్రం విడుదల చేసి ప్రజలకు, ఆర్టీసీ కార్మికులకు ఉన్న అనుమానాలు తొలగించాలని డిమాండ్ చేశారు. 20 నెలల నుంచి ఆర్టీసీలో ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయడం లేదని వారు ప్రశ్నించారు.

ఎస్టీఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చావ రవి



హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టిఎఫ్ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయుడు చావ రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోల్‌కతాలో జరిగిన అఖిత భారత మహాసభల్లో రానున్న మూడేళ్ల కాలానికి కొత్త జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రవి ప్రస్తుతం యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తెలంగాణ నుంచి కేంద్ర కమిటీలో మహిళా ప్రతినిధిగా సిహెచ్ దుర్గా భవాని, జనరల్ కౌన్సిల్ సభ్యులుగా ఎ.వెంకట్, ఆర్. శారద ఎన్నికయ్యారు.

నర్సింగ్ పదోన్నతుల్లో పురుషులకు అవకాశమివ్వాలి: టీఎన్‌జేఏసీ

హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నర్సింగ్ ఆఫీసర్స్ పదోన్నతుల్లో పురుషులకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని తెలంగాణ నర్సెస్ జాయింట్ యాక్షన్ (టీఎన్‌జేఏసీ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. జీవో నంబరు 466, జీవో నం.101, జీవో .126లను సవరించాలని డిమాండ్ చేసింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం జీవోలను సవరించి మహిళలు మరియూ పురుషులంటూ నర్సింగ్ సర్వీస్ రూల్స్‌లో సవరణలు చేసిందని టీఎన్‌జేఏసీ గుర్తు చేసింది.

అంబేడ్కర్ వర్సిటీలో ట్రాన్స్‌జెండర్లకు ఉచిత విద్య

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ట్రాన్స్‌జెండర్లందరికీ ఉచితంగా డిగ్రీ కోర్సులను అందించనున్నట్లు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ. ఘంటా చక్రపాణి వెల్లడించారు. ట్రాన్స్‌జెండర్లకు ఇలాంటి అవకాశం కల్పించిన మొదటి విశ్వవిద్యాలయంగా అంబేడ్కర్ వర్సిటీ నిలవనుందని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ పథకం కింద ఇంటర్ విద్యార్హత కలిగిన ఏ ట్రాన్స్‌జెండర్ అయినా వర్సిటీ అందించే డిగ్రీ కోర్సుల్లో చేరవచ్చన్నారు. కేవలం నామమాత్రపు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500 మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఇతర వివరాల కోసం హెల్ప్ డెస్క్: 040-23680333/ 040-23680555, కాల్‌సెంటర్ : 18005990101, వెబ్‌సైట్ www.braou.ac.in, www.online.braou.ac.in నుంచి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

శివశంకర్ జీవితం నేటి రాజకీయ నాయకులందరికీ స్ఫూర్తి

» ఆయన విగ్రహ ఏర్పాటుకు కృషి
» ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
» రవీంద్ర భారతిలో కేంద్ర మాజీ మంత్రి జయంతి వేడుక



శివ శంకర్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జీవితంలో అనుకున్నది సాధించడానికి పేదరికం, వెనకబాటుతనం అడ్డుకాబోదనడానికి కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ జీవితమే నిదర్శనమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆ మహనీయుడు నిరూపించారని కొనియాడారు. శక్తిమంతమైన ప్రధానమంత్రుల ఏలికలో కూడా దేశ రాజకీయాలను ప్రభావితం చేశారని, ఆయన విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పుంజాల శివశంకర్ 96వ జయంతి సభ ఆదివారం రవీంద్రభారతిలో జరిగింది. డాక్టర్ పుంజాల వినయ్ కుమార్ అధ్యక్షతన సాగిన ఈ సభకు పలువురు మంత్రులు, సామాజిక, రాజకీయ రంగాల ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కేంద్ర మాజీ మంత్రిగా, న్యాయ కోవిదుడుగా శివశంకర్ జీవితం నేటి రాజకీయ నాయకులకు స్ఫూర్తి అని అన్నారు. సామాజిక న్యాయం సాధన దిశగా కృషి చేసిన శివశంకర్ లాంటి నాయకుల స్ఫూర్తితోనే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. బీసీల గురించి గళమెత్తడానికి భయపడిన సమయంలో.. వారి గురించి నోరు విప్పిన ధీశాలి శివశంకర్ అన్నారు. న్యాయవ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికిన అరుదైన నాయకుడని వక్తలు అన్నారు. పెట్రోలియం మంత్రిగా ఎల్పీజీ సిలిండర్ల పంపిణీ వ్యవస్థను గ్రామాల వరకూ తీసుకెళ్లిన ఘనత శివశంకర్ సొంతమని చెప్పారు. రాజ్యసభలో మండల్ కమిషన్‌ను సమర్థించిన మొదటి కాంగ్రెస్ నేత కూడా ఆయనేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు,పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కే.కేశవరావు, మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, మాజీ హోం సెక్రెటరీ కే. పద్మనాభయ్య తదితరులు పాల్గొన్నారు.

5 సీజన్లు.. కోటి మెట్రిక్ టన్నులు!

రైస్‌మిల్లర్ల వద్ద పేరుకుపోయిన ధాన్యం నిల్వలు.. బియ్యంగా వసూలైతే 25 వేల కోట్ల ఆదాయం

» సామర్థ్యానికి మించి మిల్లర్లకు వడ్ల కేటాయింపులు
» రూ.50 వేల కోట్లు దాటిన పౌరసరఫరాల సంస్థ అప్పు



హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లర్ల వద్ద ధాన్యం నిల్వలు భారీగా పేరుకపోయాయి. ఐదు సీజన్లకు సంబంధించిన కోటి టన్నుల ధాన్యం రైస్‌మిల్లర్ల వద్దే ఉండిపోయింది. ధాన్యం తీసుకున్న మూడు నెలల్లోగా బియ్యం అప్పగించాల్సిన రైస్‌మిల్లర్లు.. ఏళ్లతరబడి బియ్యం అప్పజెప్పకుండా మొండికేస్తున్నారు. ఐదు సీజన్లలో కలిపి సుమారు రూ.25 వేల కోట్ల విలువైన బియ్యం రైస్‌మిల్లర్ల వద్దే బ్లాక్ అయిపోయింది. సకాలంలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) అప్పగించకపోవటంతో పౌరసరఫరాల సంస్థకు రావాల్సిన రూ.25 వేల కోట్ల ఆదాయం నిలిచిపోయింది. ఒకవైపు పాత బకాయిలు వసూలు కాకపోవటం, మరోవైపు కార్పొరేషన్ అప్పు రూ.50 వేల కోట్లు దాటిపోవడం చర్చనీయాంశంగా మారింది. రైతుల వద్ద నుంచి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలుచేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లకు కస్టమ్ మిల్లింగ్ కోసం అప్పగిస్తుంది. రైస్‌మిల్లర్లు ధాన్యం తీసుకున్న వెంటనే మిల్లింగ్ ప్రారంభించాలి. ఎప్పటికప్పుడు బియ్యం లోడ్ చేసి.. ఎఫ్‌సీఐకిగానీ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు గానీ అప్పగించాలి. కానీ కొన్నేళ్లుగా ఈ గొలుసు వ్యవస్థ దెబ్బతింది. ఫలితంగా ప్రభుత్వానికి భారీ నష్టం కలుగుతోంది. ధాన్యం సేకరించే సమయంలో ప్రభుత్వం బ్యాంకు గ్యారెంటీ ఇస్తే.. బ్యాంకుల నుంచి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అప్పు తెచ్చి రైతులకు డబ్బులు చెల్లిస్తోంది. మిల్లర్లు సీఎంఆర్ అప్పగిస్తేనే ఎఫ్‌సీఐ నుంచి పేమెంట్స్ వస్తాయి. అయితే సకాలంలో సీఎంఆర్ డెలివరీ చేయకపోవటంతో ఎఫ్‌సీఐ నుంచి డబ్బులు రావటంలేదు. దీంతో మిల్లర్ల వద్ద ధాన్యం నిల్వలు, బియ్యం బకాయిలు పెరిగిపోతుండగా.. బ్యాంకుల్లో తీసుకున్న రుణానికి వడ్డీ విపరీతంగా పెరిగిపోతోంది.

రైస్‌మిల్లుల్లో కోటి టన్నుల ధాన్యం

ఎఫ్‌సీఐ లెక్కల (ప్రొవిజనల్ కాస్టింగ్ షీట్) ప్రకారం క్వింటా బియ్యానికి రూ.3,600 ధర వస్తుంది. అంటే టన్నుకు రూ. 36 వేలు వస్తాయి. 2023- 24లో రెండు సీజన్లలో కలిపి 8.25 లక్షల టన్నుల ధాన్యం, 2024-25 వానాకాలంలో 18 లక్షల టన్నులు, యాసంగిలో 56 లక్షల టన్నుల ధాన్యం కలిపి కోటి మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యం రైస్‌మిల్లుల్లో ఉండిపోయింది. దీనిని మిల్లింగ్‌చేస్తే 68.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం వస్తుంది. ఈ బియ్యం విలువ రూ. 24,660 కోట్లు ఉంటుంది.

సీజన్ల వారీగా ధాన్యం, బియ్యం బకాయిలు, వాటి విలువ

సంవత్సరం	పంట సీజన్	మిల్లుల్లో ఉన్న ధాన్యం (టన్నులు)	బియ్యం బకాయిలు (టన్నులు)	బకాయిల విలువ (రూ.కోట్లలో)
2022- 23	యాసంగి	19 లక్షలు	13 లక్షలు	4,680
2023- 24	వానాకాలం	6 లక్షలు	4 లక్షలు	1,440
2023- 24	యాసంగి	2.25 లక్షలు	1.50 లక్షలు	540
2024- 25	వానాకాలం	18 లక్షలు	12 లక్షలు	4,320
2024- 25	యాసంగి	56 లక్షలు	38 లక్షలు	13,680
మొత్తం		10125000	68.50 లక్షలు	24,660

కేటాయింపులు సరే... రికవరీ ఏది?

ధాన్యం కేటాయింపుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయి. రైస్‌మిల్లుల సామర్థ్యానికి మించి కేటాయింపులు చేస్తున్నారు. ఇందులో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారులు, కార్పొరేషన్ మేనేజర్లు, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారుల ప్రమేయం ఉంది. బ్లాక్ లిస్టులో ఉన్న రైస్‌మిల్లులకూ ధాన్యం అప్పగిస్తున్నారు. విచిత్రమేమిటంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నడవకుండా మూతపడిన రైస్‌మిల్లులకు కూడా ధాన్యం ఇచ్చారు. అధికారులు, రైస్‌మిల్లర్లు మిలాఖత్ అయిపోయి... టన్నుకు కొంత రేటు కట్టుకొని అడ్డగోలుగా ధాన్యం కేటాయింపులు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా వర్గల్‌లో నిర్మాణం కూడా పూర్తికాని రెండు రైస్‌మిల్లులకు 50 వేల నుంచి 60 వేల క్వింటాళ్ల ధాన్యం ఇచ్చేశారు. సూర్యాపేటలో రెండు మిల్లులు రెండేళ్లుగా బియ్యం అప్పగించకపోయినా రూ.100 కోట్లకు పైగా బకాయిలున్నా మళ్లీ గడిచిన యాసంగి సీజన్‌లో ధాన్యం కేటాయింపులు చేశారు.

రాహుల్ ఆశయం మేరకు భవిష్యత్తులో బీసీ సీఎం

» తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు ఏ బీసీ నేత కాలేదు
» బీసీ రిజర్వేషన్లపై కిషన్‌రెడ్డి తికమక: మహేశ్ గౌడ్



హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాలన్నింటిలో బీసీ నాయకులు ముఖ్యమంత్రులు అయ్యారని.. కానీ తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఇప్పటివరకు ఒక్క బీసీ కూడా సీఎం కాలేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీ ఆశయాల మేరకు భవిష్యత్తులో కాంగ్రెస్ నుంచి బీసీలు సీఎం అవుతారని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సర్దార్ పాపన్న మహారాజ్ ధర్మ పాలన సంస్థ, జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 375వ జయంతి జాతీయ వారోత్సవాలు జరిగాయి. దీనికి ముఖ్య అతిథిగా మహేశ్ గౌడ్ హాజరై మాట్లాడారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు అసెంబ్లీలో మద్దతు తెలిపిన బీజేపీ నేతలు.. ఢిల్లీలో మాత్రం ముఖం చాటేశారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తికమక పెట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని స్పష్టం చేశారు. కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటన దురదృష్టకరమన్నారు. హైదరాబాద్‌లో కల్లు కాంపౌండ్లపై జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కల్లు కాంపౌండ్లకు సంబంధించి తాటి చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాల్సిన అవసరముందని చెప్పారు.

ఏడాదిలో 55 కోట్ల బీపీ, షుగర్ మాత్రలు!

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వినియోగం.. అన్ని మాత్రలు కలిపి 228 కోట్ల మేర కొనుగోలు

» టీజీఎంఎస్ఐడీసీ వార్షిక నివేదిక
» రాష్ట్రంలో 41 లక్షల మందికిపైగా అధిక రక్తపోటు, మధుమేహం బాధితులు



హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అక్షరాలా 55,69,98,087 టాబ్లెట్లు.. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే అధిక రక్తపోటు, మధుమేహ బాధితుల కోసం ఒక్క ఏడాదిలో ప్రభుత్వం ప్రభుత్వం కొనుగోలు చేసిన మాత్రల సంఖ్య ఇది. మొత్తంగా కొనుగోలు చేసిన అన్నిరకాల మాత్రల్లో ఇవే 25శాతం ఉండటం గమనార్హం. రాష్ట్రంలో అధిక రక్తపోటు, మధుమేహం బాధితుల సంఖ్య భారీగా పెరిగిపోతోందనేందుకు ఇదే సాక్ష్యం. ఇక బీపీ, షుగర్ మాత్రల తర్వాత అధికంగా విటమిన్లు, పారాసిటమాల్ మాత్రలు వినియోగం అవుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.

మొత్తం 232 కోట్ల మాత్రల కొనుగోలు

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే అన్ని రకాల ఔషధాలను తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తారు. ఏటా సుమారు రూ.500 కోట్ల విలువైన ఔషధాలు సేకరిస్తారు. గతేడాది జూలై 1 నుంచి ఈ ఏడాది జూన్ 30 వరకు కొనుగోలు చేసిన ఔషధాలు, వ్యాక్సిన్స్ సర్జికల్స్ వివరాలతో టీజీఎంఎస్ఐడీసీ తాజాగా ప్రభుత్వానికి నివేదిక అందించింది. మొత్తం 522 రకాల ఔషధాలను కార్పొరేషన్ కొనుగోలు చేస్తుంది. అందులో 284 రకాలు అత్యవసరమైన మందుల జాబితా (ఈఎంఎల్)లో, మరో 238 రకాల ఔషధాలు అదనపు మందుల జాబితా (ఏఎంఎల్) జాబితాలో ఉంటాయి. టీజీఎంఎస్ఐడీసీ గత ఏడాది కాలంలో అన్ని రకాలు కలిపి 232,48,63,500 మాత్రలు కొనుగోలు చేసింది. ఇందులో అధిక రక్తపోటు, మధుమేహానికి సంబంధించిన మాత్రలే 55 కోట్లు.. ఇందులో అధిక రక్తపోటుకు సంబంధించి 30,67,32,002 (టెల్మా, అమ్లోడిపిన్ తదితర) మాత్రలు, మరో 25 కోట్ల మేర మధుమేహం(మెట్‌ఫార్మిన్, గ్లిమెపిరైడ్ తదితర) మాత్రలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ఫార్మసీలలో వేగంగా ఖాళీ అవుతున్న మందుల జాబితాలో తొలిస్థానంలో ఇవే ఉన్నాయని.. తర్వాత విటమిన్ మాత్రలు, పారాసిటమాల్ ఉన్నాయని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం ఔషధ కొనుగోలు కోసం ఏటా రూ.500 కోట్లు ఖర్చు చేస్తోంది.

రాష్ట్రంలో 41.82 లక్షల మంది బీపీ, షుగర్ బాధితులు

ప్రభుత్వం రాష్ట్రంలో 30 ఏళ్లపైబడిన వారికి అసాంక్రమిక, దీర్ఘకాలిక (ఎన్‌సీడీ) వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేస్తోంది. ప్రధానంగా బీపీ, షుగర్ పరీక్షలు చేసి, వారికి ఉచితంగా ఔషధాలను అందిస్తోంది. ఈ పరీక్షల నివేదిక మేరకు.. రాష్ట్రంలో అధిక రక్తపోటు, మధుమేహ బాధితులు 41,82,484 మంది ఉన్నారు. ఇందులో బీపీ బాధితులు 27,49,066 మంది, 14,33,418 మంది షుగర్ బాధితులు. రాష్ట్రంలో 30ఏళ్లపైబడిన వారు 1.73 కోట్ల మంది ఉండగా... ఇప్పటివరకు 1.31 కోట్ల మందికి ఎన్‌సీడీ పరీక్షలు చేసినట్లు వైద్యారోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. అంటే పరీక్షలు చేయించుకున్న వారిలో 31.92 శాతం మంది ఏదో ఒక స్థాయిలో బీపీ, షుగర్‌తో బాధపడుతున్నట్లు వెల్లడైంది. అధిక రక్తపోటు బాధితుల్లో అత్యధికంగా గ్రేటర్ హైదరాబాద్, నల్గొండ, నిజామాబాద్, కామారెడ్డి, హన్మకొండ జిల్లాల్లో ఉన్నారు. మధుమేహ బాధితుల సంఖ్యలోనూ హైదరాబాద్ అగ్రభాగాన నిలిచింది. మరోవైపు అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నట్టు గుర్తించిన బాధితుల్లో చాలా మంది కొంతకాలం ఔషధాలు వాడి, ఆ తర్వాత ఆస్పత్రులకు రావడం లేదని వైద్యవర్గాలు తెలిపాయి. 27.49 లక్షల మంది బీపీ బాధితుల్లో నిత్యం మందులు వాడుతున్నది 10.70 లక్షల మందేనని.. 14.33 లక్షల మంది మధుమేహ బాధితుల్లో క్రమం తప్పకుండా మందులు తీసుకుంటున్నవారు 5.70 లక్షల మందేనని వైద్య శాఖ ఇటీవల సర్కారుకు ఇచ్చిన నివేదికలో పేర్కొంది. మందులు సరిగా వాడని వారిని గుర్తించి, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టేలా చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బందిని వైద్యశాఖ ఆదేశించింది.

'అడిగినంత డబ్బిచ్చి నన్ను పెళ్లి చేసుకో'

» ప్రియుడి వేధింపులతో యువతి ఆత్మహత్య

మంచిర్యాల క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రేమించానన్నాడు.. జీవితాంతం ఆనందంగా చూసుకుంటానని మాటిచ్చాడు. అతడిని నమ్మి పెళ్లి చేసుకోమని కోరగా తనకు డబ్బు కావాలన్నాడు. లేదంటే తనతో సన్నిహితంగా ఉన్న ఫొటోలను బయటపెడతానంటూ బెదిరించాడు. దీంతో భయపడిన యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మంచిర్యాలకు చెందిన ఓ యువతి(23) అదే ఊరిలో డిగ్రీ చదువుకునే రోజుల్లో తన కళాశాలకే చెందిన రంగుల శ్రీకాంత్ అనే యువకుడు ప్రేమించుకున్నారు. ఈక్రమంలో యువతి పెళ్లి ప్రస్తావన తీసుకురాగా ఇద్దరి కులాలు వేరు కావడంతో పెళ్లికి ఇంట్లో ఒప్పుకోరని చెప్పాడు. కొద్ది రోజుల తర్వాత ఫోన్ చేసి కట్నకానుకలు ఇస్తే ఇంట్లో వారు పెళ్లికి ఒప్పుకుంటారంటూ చెప్పుకొచ్చాడు. శ్రీకాంత్‌తో పాటు అతని తల్లి రాజేశ్వరి, తండ్రి కిష్టయ్య, సోదరుడు రమేశ్ యువతితో మాట్లాడి డబ్బులు ఇస్తేనే వివాహం జరుగుతుందని, అలాకాకుండా వేరొకరిని పెళ్లి చేసుకుంటే, తమ వద్ద ఉన్న ఫొటోలు బయటపెడతామంటూ ఫోన్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన యువతి ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాహుల్‌కు బిహార్ ఓటమి భయం

అందుకే నకిలీ ఓట్లు అంటూ ప్రచారం.. కాంగ్రెస్ గెలిచిన రాష్ట్రాల్లో నకిలీ ఓట్లు లేవా?

» ఢిల్లీ టూర్లు ఆపి రేవంత్ హైదరాబాద్‌వాసుల కష్టాలు చూడాలి: రాంచందర్‌రావు
» బీజేపీలో చేరిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల



రాంచందర్‌రావుతో కరచాలనం చేస్తున్న గువ్వల

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో కాంగ్రెస్ ఓడిపోతున్నట్లు తెలిసి.. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నకిలీ ఓట్లు అంటూ ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ గెలిచిన తెలంగాణ, హిమాచల్, కర్ణాటకలో నకిలీ ఓట్లు గుర్తుకు రాలేదా..? అని నిలదీశారు. రాహుల్ వైఖరి చూస్తుంటే దొంగలు పడిన ఆర్నెల్లకు కుక్కలు మొరిగినట్లు ఉందని విమర్శించారు. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఫేక్(నకిలీ) ఇండియన్ అని, నకిలీ ఇండియన్.. నకిలీ ఓట్ల గురించి మాట్లాడవద్దని అన్నారు. రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ ఎప్పుడూ ఒంటరిగా గెలవలేదని.. అందుకే భాగస్వామ్య పక్షాలతో కలిసి ఎన్నికలకు వెళుతున్నారని ఎద్దేవా చేశారు. భారీ వర్షాలతో హైదరాబాద్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. రేవంత్ ఢిల్లీ టూర్ల బదులు కనీసం కొన్ని రోజులైనా ఇక్కడ ఉండి ప్రజల కష్టాలను చూడాలని కోరారు. మునిసిపల్ శాఖ ఆయన వద్దే ఉందని, రేవంత్ ఢిల్లీ వెళుతుంటే ఇక్కడ ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. బీజేపీకి సున్నా సీట్లు వస్తాయంటూ బీఆర్ఎస్ ఎగతాళి చేసేదని, మొన్నటి ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీకే సున్నా సీట్లు వచ్చాయని ఎద్దేవా చేశారు. బీజేపీ 36 శాతం ఓట్లతో 8 ఎంపీ సీట్లు గెలుచుకుందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ సిటింగ్ స్థానాన్ని గెలుచుకుందని గుర్తుచేశారు. తాను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడయ్యాక నెల రోజుల్లో 16 జిల్లాల్లో పర్యటించానని తెలిపారు. ఈ నెల 18 తర్వాత రెండో విడత జిల్లాల పర్యటన ఉంటుందని చెప్పారు. హైకోర్టు ఆదేశాల దృష్ట్యా త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని రాంచందర్‌రావు అన్నారు. ఈ ఎన్నికల్లో ఎక్కువ శాతం సీట్లు బీజేపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

ఎవరి వల్ల రాష్ట్రమొచ్చిందో చర్చకు సిద్ధం: బాలరాజు

ప్రొఫెసర్ జయశంకర్‌ను చూసే తాను టీడీపీ, కాంగ్రెస్‌లను కాదని టీఆర్ఎస్‌లో చేరానని గువ్వల బాలరాజు అన్నారు. తెలంగాణ ఎవరి వల్ల వచ్చిందో చర్చకు సిద్ధమని ప్రకటించారు. తన అహంకారం వల్లే గత ఎన్నికల్లో ఓడిపోయానంటూ బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేశారని.. అలాగైతే, కేసీఆర్ ఎందుకు ఓడిపోయారని ప్రశ్నించారు. టీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు దళితుల అంశాలపై మాత్రమే మాట్లాడే అవకాశం ఇచ్చేవారని చెప్పారు. తన సతీమణిపై సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులు ఆపకపోతే తగిన బుద్ధి చెబుతామని బీఆర్ఎస్‌ను హెచ్చరించారు. ఎమ్మెల్యేనో, ఎంపీనో కావాలన్న ఆకాంక్ష లేదని బాలరాజు తెలిపారు.

నాంపల్లిలో ఆటోమేటెడ్ పార్కింగ్ కాంప్లెక్స్!

(మొదటి పేజీ తరువాయి)



భవనంలో కార్ల పార్కింగ్ ఇలా..

భవనంలో అత్యాధునిక మౌలిక వసతులు కల్పిస్తున్నారు. 10 అంతస్తుల్లో పార్కింగ్‌తో పాటు సినిమా థియేటర్లు ఉంటాయి. ప్రపంచంలోనే అరుదుగా ఉండే పూర్తిస్థాయి ఆటోమేటెడ్ బహుళ అంతస్తుల పార్కింగ్ వ్యవస్థను నాంపల్లిలో నిర్మించామని మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ఆదివారం వెల్లడించారు. నాంపల్లిలో నిర్మించిన ఈ భవనాన్ని ఆయన పరిశీలించారు. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి తుది అనుమతులు లభించాల్సి ఉందని, అవి రాగానే ప్రాజెక్టు ప్రజలకు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. జర్మనీకి చెందిన అత్యాధునిక 'పాలిస్' సాంకేతికతతో పూర్తి ఆటోమేటెడ్ పజిల్ పార్కింగ్ సిస్టమ్‌గా దీన్ని నిర్మించారని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అత్యాధునిక పార్కింగ్ కాంప్లెక్సుల్లో ఒకటని, భారతదేశంలో ఇదే మొదటిదని వెల్లడించారు. హెచ్ఎంఆర్ఎల్ 2 వేల గజాల స్థలాన్ని 50 ఏళ్లకు రాయితీపై ఇవ్వగా, ప్రాజెక్టు డెవలపర్లు హరికిషన్‌రెడ్డి, భావనారెడ్డి రూ.102 కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించారని తెలిపారు.

15లో 10 అంతస్తులు పార్కింగ్‌కే..

నాంపల్లి కూడలిలో నిర్మిస్తున్న ఈ భవనంలో మొత్తం 15 అంతస్తులు ఉంటాయని, అందులో 10 అంతస్తులు వాహనాల పార్కింగ్ కోసమే కేటాయిస్తున్నట్లు ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. ఇందులో 250 కార్లు, 200 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చన్నారు. 3 బేస్‌మెంట్లు, 7 పై అంతస్తులు పార్కింగ్ కోసం, మిగతా అంతస్తులను వ్యాపార కార్యకలాపాలకు అనుగుణంగా నిర్మించారని తెలిపారు. 2 మల్టీప్లెక్స్ సినిమా థియేటర్లు, 11వ అంతస్తులో నగర వీక్షణకు ఒక గ్యాలరీ ఉంటుందని రెడ్డి వివరించారు. సెన్సార్ల సహాయంతో మానవ ప్రమేయం లేకుండా జరిగే ఈ ఆటోమేటెడ్ పజిల్ పార్కింగ్ విధానం చాలా ఆసక్తికరంగా ఉంటుందన్నారు. వాహనాలు లోపలికి, బయటకు వచ్చే టెర్మినళ్లు విశాలంగా ఉండి, స్మార్ట్‌గా పని చేస్తాయని తెలిపారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులకు అనుకూలంగా ఉండేలా ఫ్లాట్ టెర్మినళ్లు ఉంటాయని చెప్పారు. వాహనం ఏ దిశలో ఉన్నా.. 360 డిగ్రీలు తిరిగగలిగే ప్యాలిస్ టేబుల్ స్వయంగా దాన్ని సరైన విధానంలో పెట్టి పార్కింగ్ చేస్తుందని ఆయన వెల్లడించారు. ఈ పార్కింగ్ ప్రక్రియ వినియోగదారులకు ఒక కొత్త అనుభూతిని కలిగిస్తుందన్నారు. "ప్రవేశద్వారంలో క్యూఆర్ కోడ్ ఉన్న టికెట్ (స్మార్ట్ కార్డ్) సూచనలతో ఇన్/అవుట్ టెర్మినల్‌కు చేరుకున్న వెంటనే, కార్డును స్వైప్ చేస్తే టెర్మినల్ గేట్ తెరుచుకుంటుంది. డ్రైవర్ టర్న్ టేబుల్ మీద కారును పెట్టి, హ్యాండ్ బ్రేక్ వేసి, ఇంజిన్ ఆఫ్ చేసి బయటకు వస్తే సరిపోతుంది. టెర్మినల్ బయట కార్డును స్వైప్ చేయగానే పార్కింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. సిస్టమ్ తనంతట తానే కారును స్కాన్ చేసి ఎస్‌యూవీ, సెడాన్‌లుగా వర్గీకరించి, వాటికి కేటాయించిన అంతస్తులో పార్క్ చేస్తుంది. వినియోగదారుడు ఫీజు చెల్లించిన తర్వాత, సూచించిన టెర్మినల్ వద్దకు వెళ్లి కార్డును స్వైప్ చేయగానే, పార్కింగ్ ప్లాట్‌ఫాం నుంచి వాహనం వినియోగదారుడి వద్దకు చేరుకుంటుంది. ఈ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్ ప్రజలకు ప్రపంచ స్థాయి పార్కింగ్ అనుభవాన్ని అందించనున్నాం" అని రెడ్డి పేర్కొన్నారు.



ముషీరాబాద్‌లోని సాగర్‌లాల్ ఆస్పత్రి చౌరస్తా వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన మంత్రి పొన్నం, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అవసరమైన ప్రతిచోటా కొత్త రోడ్లు

- వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు: పొన్నం ప్రభాకర్
- నగర ప్రజలను పట్టి పీడిస్తున్న సమస్యలు: కిషన్‌రెడ్డి
- ముషీరాబాద్‌లో 1.60 కోట్లతో సీసీ రోడ్డు పనులు

ముషీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అవసరమైన ప్రతి చోటా ఆధునిక రోడ్లు వేస్తున్నామని నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను ఆధునికీకరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని సాగర్‌లాల్ ఆస్పత్రి చౌరస్తా నుంచి దాయారం మార్కెట్ వరకు రూ.కోటి 60 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై వర్షపునీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, వరద నీటి నాలాల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రోడ్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం చాలా పెద్దదని, అభివృద్ధి పనులకు నిధుల లేమి వల్ల అనేక సమస్యలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయన్నారు. అధికారులు దృష్టి సారించి అధిక నిధులు కేటాయించాలని కోరారు.

పాపన్న గౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి: పొన్నం

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సర్వాయి పాపన్న గౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు పోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పిలుపునిచ్చారు. పాపన్న రాజ్యాధికారాన్ని స్థాపించి చరిత్రలో నిలిచారంటే ఆనాటి సామాజిక వర్గాలను కలుపుకొనిపోయి నాయకత్వం వహించినందునే అని పేర్కొన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో సర్దార్ పాపన్న మహారాజ్ ధర్మ పాలన సంస్థ(ఎస్‌పీడీపీపీ), జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 375వ జయంతి జాతీయ వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఈ ఒక్క సంవత్సరంలోనే 40 లక్షల ఈత మొక్కలు నాటిస్తున్నామని, పాపన్న గౌడ్ వారసులుగా గౌడ వృత్తిని రక్షించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమమే లక్ష్యం: మంత్రి అడ్లూరి

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యం అని, వారి కుటుంబాలలో ఆనందం చూడటమే తమ ఆశయం అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. వికలాంగుల ఉద్యోగుల బదిలీల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 34 పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వికలాంగుల ఉద్యోగ సంఘాల నేతలు ఆదివారం మంత్రి అడ్లూరితో పాటు వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యను కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 'డిఫరెంట్లీ ఏబుల్డ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ' ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. వికలాంగుల స్వయం సమృద్ధి కోసం ప్రభుత్వం వేల సంఖ్యలో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మెట్రోలో మంత్రి జూపల్లి ప్రయాణం



హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మంత్రి జూపల్లి కృష్ణారావు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులతో మాట్లాడి సాధకబాధకాలను తెలుసుకున్నారు. ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ఆదివారం ఉదయం ఎల్‌బీ నగర్ నుంచి కేపీహెచ్‌బీ వరకు మంత్రి జూపల్లి మెట్రోలో ప్రయాణించారు. మంత్రితో పాటు ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న కూడా మెట్రోలో ప్రయాణించారు.

కేసీఆర్ హయాంలో ద్వితీయశ్రేణి నగరాలకూ ఐటీ పరిశ్రమ

- సర్కార్ ఆ సంకల్పాన్ని కొనసాగించాలి: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ద్వితీయశ్రేణి నగరాలకూ కేసీఆర్ హయాంలో ఐటీ పరిశ్రమ విస్తరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సంకల్పాన్ని కొనసాగించాలని ఆశిస్తున్నానని బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నల్లగొండ, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, సిద్దిపేటలో ఐటీ హబ్‌లను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, తాజాగా.. ఆదిలాబాద్‌కూడా ఆ జాబితాలోకి చేరడం హర్షణీయమని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా ఐటీ పరిశ్రమల కోసం అవసరమైన సదుపాయాలు కల్పించడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం, యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం ఈ ఐటీ హబ్‌ల ప్రధాన ఉద్దేశమని కేటీఆర్ వెల్లడించారు.

కాంగ్రెస్‌కు 'కరప్షన్ గని'గా సింగరేణి

- హెచ్‌ఎంఎస్ కార్మిక సంస్థతో కలిసి పని చేస్తాం: కవిత



హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సింగరేణి 'కరప్షన్ గని'గా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. ఉద్యోగ నియామకాలతో సహా అన్నింట్లో కాంగ్రెస్ అవినీతికి పాల్పడుతోందన్నారు. ఆదివారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో హెచ్‌ఎంఎస్ కార్మిక సంఘ ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్, ఆ సంఘ నాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఓపెన్ కాస్ట్ మైనింగ్ వల్ల పెద్ద వాళ్లకే లాభమవుతుందని, పైగా కాలుష్యం తీవ్రమవుతోందన్నారు. అందువల్ల సింగరేణిలో అండర్ గ్రౌండ్ మ్యాన్యువల్ గనులను తెరవాలని డిమాండ్ చేశారు. ఒక్కో సింగరేణి కార్మికుడు రోజుకు ఆరు టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తూ.. ప్రభుత్వానికి రూ.30వేలు సంపాదించి పెడుతున్నారని కానీ వారికిచ్చే వేతనం చాలా తక్కువగా ఉంటోందన్నారు. కార్మికులకు భరోసా కల్పించేందుకు దసరా తర్వాత సింగరేణి యాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు. హెచ్‌ఎంఎస్ కార్మిక సంస్థ బ్రిటిష్ హయాంలో కార్మికుల కోసం పోరాడేందుకు సుభాష్‌చంద్రబోస్ ఏర్పాటుచేశారని, కార్మిక సంక్షేమమే ధ్యేయంగా హెచ్‌ఎంఎస్‌తో కలిసి పనిచేయాలని నిర్ణయించామని చెప్పారు.

బీఆర్ఎస్‌పైనే ప్రత్యేక దృష్టి ఎందుకు..?

"సీఎం రేవంత్ ఓ మాట మాట్లాడితే, మంత్రి కోమటిరెడ్డి మరోమాట మాట్లాడుతున్నారు. బండి సంజయ్‌కు ఈటల వార్నింగ్ ఇచ్చినా కూడా దానిపై చర్చలేదు. ఇలా అవతలి పార్టీల్లో కూడా చాలా సమస్యలున్నాయి." అవన్నీ వదిలేసి బీఆర్ఎస్‌పైనే ప్రత్యేక దృష్టి ఎందుకంటూ కవిత అసహనం వ్యక్తం చేశారు. కేటీఆర్‌కు రాఖీ ఎందుకు కట్టలేదంటూ ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం దాటవేశారు.

దూసుకెళ్తున్న బిల్డ్ నౌ



(మొదటిపేజీ తరువాయి)

చేశారు. జీవో 168 నిబంధనల ప్రకారం వివరాలు నమోదు చేసేలా బిల్డ్‌నౌను రూపొందించారు. దీంతో నిబంధనల ప్రకారం వివరాలుంటేనే ఆ దరఖాస్తును బిల్డ్‌నౌ స్వీకరిస్తుంది. సంబంధిత దరఖాస్తు పరిశీలన ప్రక్రియ కూడా క్షణాల్లోనే పూర్తవుతోంది. బిల్డ్‌నౌను తొలుత జీహెచ్‌ఎంసీలో అమలు చేయగా.. ఆ తర్వాత హెచ్‌ఎండీఏతో పాటు డీటీసీపీ రాష్ట్రవ్యాప్తంగా అన్నీ మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో అమలు చేస్తున్నారు.

గతంలో రోజుల తరబడి సమయం

గతంలో డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డీపీఎంఎస్), టీజీబీపాస్ అప్లికేషన్లు ఉన్న సందర్భంలో దరఖాస్తు పరిశీలన చేయడానికి ఒక ప్లానింగ్ అధికారికి రోజుల తరబడి సమయం పట్టేది. ఎన్ని అంతస్తుల భవనమైతే అన్ని ఎక్కువ రోజులు కేవలం దరఖాస్తు స్ర్కూటినీకే సమయం సరిపోయేది. కానీ ప్రస్తుతం బిల్డ్‌నౌ అప్లికేషన్‌లో దేశంలో ఎక్కడా లేని విధంగా తక్షణ అనుమతి, రిజిస్ట్రేషన్, సింగిల్ విండోలో దరఖాస్తులన్నీ క్షణాల్లో స్ర్కూటినీ అవుతున్నాయి. దక్షిణాదిలోనే అత్యంత ఎత్తైన భవనం కోకాపేటలో 69 అంతస్తులతో నిర్మించడానికి హెచ్‌ఎండీఏకు దరఖాస్తు చేయగా.. కేవలం ఒక నిమిషం 4 సెకన్లలో స్ర్కూటినీ పూర్తవ్వడం విశేషం. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏలలో బహుళ అంతస్తుల భవనాల స్ర్కూటినీ ప్రక్రియ క్షణాల్లో పూర్తవుతున్నట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఇక బిల్డ్‌నౌ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు సంబంధించి ఇప్పటివరకు 13,665 దరఖాస్తులు వచ్చాయి. అందులో తక్షణ అనుమతులిచ్చినవి 8,550, తక్షణ రిజిస్ట్రేషన్లవి 945 కాగా, సింగిల్ విండో దరఖాస్తులు 4,170 వరకు ఉన్నాయి. ఈ మొత్తం దరఖాస్తులను వివిధ స్థాయుల్లో అధికారులు 48,495 సార్లు స్ర్కూటినీ చేయగా.. అందుకు పట్టిన పూర్తి సమయం కేవలం 37.6 నిమిషాలే.. ఇక స్ర్కూటినీ పూర్తయిన తర్వాత డ్రాయింగ్ పీడీఎఫ్ చేసేందుకు అన్ని దరఖాస్తులకు కలిపి 52.47 నిమిషాల సమయం పట్టింది.

వరద సమస్యకు శాశ్వత పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

సమస్య ఎన్నేళ్లుగా ఉంది, స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటనేది నేరుగా బస్తీవాసులను ఆరా తీశారు. కాగా, బల్కంపేట నుంచి వచ్చే వరద నీటి ప్రవాహానికి అడ్డుగా కొన్ని ఇళ్లను నిర్మించడం వల్ల సమస్య వస్తోందని అధికారులు సీఎం వివరించారు. ఎస్ఆర్‌నగర్ నుంచి బౌద్ధనగర్ వరకు ఉన్న డ్రైనేజీ కాలువను చూసి సీఎం ఆశ్చర్యం వ్యక్తం చేశారు కాలనీ రోడ్డు కంటే డ్రైనేజీ కాలువ ఎక్కువ ఎత్తులో ఉండటంతో ఇరుకుగా మారి వరద తీవ్రత పెరుగుతోందని గమనించి.. వెంటనే తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంగుబాయి బస్తీ కుంట ప్రాంతాన్ని సందర్శించిన సీఎం.. అక్కడి నాలా, డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించారు. ఇళ్లలోకి నీరు రాకుండా రెండు వైపులా గోడలాంటి నిర్మాణం ఏర్పాటు చేయడం వల్ల మధ్యలో నుంచి వరద నీరు వేగంగా రావడాన్ని గమనించారు. అక్కడి కుంటను కొంత మంది పూడ్చివేసి ఓ హాస్పిటల్ పార్కింగ్‌కు వినియోగిస్తున్నారని స్థానికులు సీఎంకు ఫిర్యాదు చేశారు. ఈ కారణంగానే వరదనీరు వెనక్కి వస్తూ బస్తీ మునిగిందని అధికారులు తెలిపారు. దీంతో పూర్వాపరాలను పరిశీలించి చర్యలు చేపట్టాలని హైడ్రా కమిషనర్‌కు ముఖ్యమంత్రి సూచించారు. అనంతరం మైత్రీవనం వద్ద పరిస్థితిని పరిశీలించారు. ప్యాచ్‌వర్క్ చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదని, శాశ్వత పరిష్కారం కింద మొత్తం రీ డిజైన్ చేసి నీరు బయటకు వెళ్లటానికి ఏర్పాటు చేయాలని హైడ్రా కమిషనర్‌తో అన్నారు. బౌద్ధనగర్‌లో పర్యటిస్తున్న సమయంలో అక్కడ కనిపించిన జశ్వంత్ అనే బాలుడిని సీఎం పిలిచారు. కాలనీలో వరద పరిస్థితిపై అతణ్ని అడిగి ఆరా తీశారు. బాలుడి వివరాలు అడగ్గా.. తాను ఏడో తరగతి చదువుతున్నానని, ఇంట్లోకి వరదనీరు రావడంతో పుస్తకాలు తడిసిపోయాయని చెప్పాడు. దీంతో భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకుండా చర్యలు చేపడతామని సీఎం హామీ ఇచ్చారు. కొంతమంది బస్తీవాసులు తమ సమస్యలను విన్నవించగా శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఈ సందర్భంగా ఓ మహిళ సీఎం రేవంత్‌కు రాఖీ కట్టారు. పర్యటనలో పలువురు జీహెచ్‌ఎంసీ కార్మికులతో ముఖ్యమంత్రి మాట్లాడారు.



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో చర్చిస్తున్న సీఎం రేవంత్

హడావుడి లేకుండా సీఎం పర్యటన

సీఎం రేవంత్‌రెడ్డి అమీర్‌పేటలోని బస్తీల్లో ఎలాంటి హడావుడి, ముందస్తు సమాచారం కూడా లేకుండానే పర్యటించారు. పోలీసులు భారీ బందోబస్తు కూడా ఏర్పాటు చేయలేదు. సీఎం వెంట మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయ నేతలు ఎవరూ లేరు. స్థానిక బీజేపీ కార్పొరేటర్ కేతినేని సరళ ఒక్కరే సీఎం వెంట ఉండి సమస్యలను వివరించారు.

సీఎం రేవంత్‌తో మంత్రి తుమ్మల భేటీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆదివారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో భేటీ అయ్యారు. వ్యవసాయశాఖకు సంబంధించిన అంశాలు, శాఖ పురోగతి, సంక్షేమ పథకాలతోపాటు శాఖాపరమైన సమస్యలను కూడా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తుమ్మల తీసుకెళ్లారు. వ్యవసాయ శాఖపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి అన్ని అంశాలపై సమగ్రంగా చర్చిద్దామని ముఖ్యమంత్రి చెప్పినట్లు సమాచారం. సిద్దిపేటలో పామాయిల్ పరిశ్రమ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని, అనువైన తేదీని ఇవ్వాలని సీఎంను మంత్రి తుమ్మల కోరారు. దీంతో ఈ నెలాఖరులో ప్రారంభోత్సవం చేద్దామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిసింది. సిద్దిపేటలో రిఫైన్డ్ ఆయిల్ యూనిట్ ఏర్పాటు అంశంపైనా చర్చ జరిగింది. ఇక ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న తుమ్మల ఆ జిల్లాకు సంబంధించిన అంశాలను కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

21 వరకు భారీ వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఈనెల 21 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే రెండు వారాల పాటు ముసురు పట్టి, వాతావరణం పూర్తిగా చల్లబడి, జల్లులు, అప్పుడప్పుడు భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. సోమ, మంగళవారాల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అదేవిధంగా, ఈనెల 13 నుంచి 16 వరకు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ నాలుగు రోజులకుగాను రాష్ట్రవ్యాప్తంగా ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక, హైదరాబాద్‌లో రాబోయే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు, ఈనెల 13 నాటికి వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని కూడా వెల్లడించింది.

నాడు చెన్నారెడ్డి.. నేడు రేవంత్‌రెడ్డి

బేగంపేట: సనత్‌నగర్ నియోజకవర్గంలో సమస్యలను తెలుసుకునేందుకు ఆ ప్రాంతాల్లో ఒకప్పుడు సీఎం హోదాలో మర్రి చెన్నారెడ్డి పర్యటించగా.. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించారు. 1989లో సనత్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చెన్నారెడ్డి అప్పట్లో బేగంపేట డివిజన్‌లోని భగవంతాపూర్ బస్తీలో పర్యటించారు. పలు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అనంతరం పలువురు ముఖ్యమంత్రులుగా పనిచేసినా.. ఈ బస్తీల పరిశీలనకు ఎవరూ రాలేదు. ఇన్నాళ్ల తరువాత రేవంత్‌రెడ్డి వచ్చారు.

అమీర్‌పేట జోన్‌గా డ్రైనేజీ, నాలాలను మారుస్తాం: రంగనాథ్

వరద సమస్యలపై ఏళ్ల తరబడి సరైన పరిష్కారం చూపకపోవడంతోనే ఇప్పుడు వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో నీరు నిలుస్తోందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. ప్రతి ఏటా కురుస్తున్న వానలకు, నీరు నిలిచిపోతున్న ప్రాంతాలను ఒకచోట నుంచి మరోచోటికి మార్చుకుంటూ వచ్చారని.. శాశ్వత పరిష్కారం చేయలేదని తెలిపారు. ఆ కారణంగానే అమీర్‌పేట, బౌద్ధనగర్, గంగుబాయిబస్తీల్లో వరద ప్రభావం పడిందన్నారు. ఇకపై ఇలాంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు అమీర్‌పేట జోన్‌లో ఉన్న డ్రైనేజీ, నాలా వ్యవస్థలో కీలక మార్పులు చేయనున్నట్టు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో సీఎం రేవంత్ కూడా పలు సూచనలు చేశారని, ఆ మేరకు కొత్త ప్రణాళిక సిద్ధం చేస్తామని చెప్పారు. అమీర్‌పేట జోన్‌లో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, నాలాలను ఒక యూనిట్‌గా తీసుకుని నెలలో సమగ్ర అధ్యయనం చేసి, ప్రణాళిక రూపొందిస్తామన్నారు. అయితే ఈలోపు ఎమర్జెన్సీ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మంగళగిరిలో తెలంగాణ మంత్రులు

- ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన భట్టి, ఉత్తమ్, కోమటిరెడ్డి, వాకిటి శ్రీహరి
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ హెలీప్యాడ్ వినియోగం
- స్వాగతం పలికిన ఎమ్మెల్సీ హరిప్రసాద్

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ మంత్రులు ఆంధ్రప్రదేశ్‌కు విచ్చేశారు. ఆదివారం హెలీకాప్టర్‌లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి గుంటూరు జిల్లా మంగళగిరి చేరుకున్నారు. ఇందుకోసం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయం పక్కనే ఉన్న హెలీప్యాడ్‌ను వారు ఉపయోగించుకున్నారు. ఈ హెలీప్యాడ్‌ను పవన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నారు. మంగళగిరి వచ్చిన తెలంగాణ మంత్రులకు పవన్ కల్యాణ్ తరఫున జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఆ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. పవన్ పంపించిన కొండపల్లి బొమ్మలు, జ్ఞాపికలను హరిప్రసాద్ అందజేశారు. తిరుగు ప్రయాణంలో వారితో పాటు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెళ్లారు.

బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అడ్డంకులు

- బిహార్‌లో ఒకలా.. తెలంగాణలో మరొకలా ఎందుకు?: జైరాం రమేశ్



న్యూఢిల్లీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అడ్డంకులు సృష్టిస్తోందని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. ఎంతో చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తుంటే, కేంద్రంలోని బీజేపీ మాత్రం ఉద్దేశపూర్వకంగానే కొర్రీలు పెడుతోందని ఆదివారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. బిహార్‌లో బీసీ బిల్లు గవర్నర్ సమ్మతితో అధికారికంగా చట్టంగా మారితే.. తెలంగాణలో గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి సమ్మతి కోసం పంపారన్నారు. 4 నెలలు గడిచినా రాష్ట్రపతి నుంచి ఎటువంటి సమాధానం లేదని చెప్పారు. బిహార్‌లో బిల్లు విషయంలో ఆలస్యం చేయించడం, అడ్డుకోవడం బీజేపీకి సాధ్యం కాలేదన్నారు. అయితే తెలంగాణ విషయంలో మాత్రం బీజేపీ అడ్డంకులు సృష్టిస్తోందని.. ఆ పార్టీకి సామాజిక న్యాయంపై ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తేలిపోయిందని విమర్శించారు. బీజేపీ అడ్డుకోకపోతే 4 నెలలుగా రాష్ట్రపతి వద్దే ఆ బిల్లు పెండింగ్‌లో ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు.

తుమ్మిడిహెట్టి కట్టి తీరుతాం

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.. ఇచ్చంపల్లి నుంచే నదుల అనుసంధానం.. కేంద్రానికి ప్రతిపాదనలు: ఉత్తమ్

వరంగల్/ఖమ్మం/మధిర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తమ్మిడిహెట్టి ప్రాజెక్టును కట్టి తీరుతామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. తమ్మిడిహెట్టి కట్టి ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు నీటిని మళ్లించి ఉంటే 16 లక్షల ఎకరాలకు నీరు అందేదని, కానీ గత ప్రభుత్వం ప్రణాళికలు లేకుండా మేడిగడ్డ బ్యారేజీ నిర్మించిందని విమర్శించారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై చేసిన అప్పులకు రానున్న రోజుల్లో రూ.40 వేల కోట్ల అసలు, రూ.26 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి ఉందన్నారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ) నివేదికను బట్టి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని స్పష్టం చేశారు. ఆదివారం ములుగు జిల్లా కన్నాయిగూడెంలో గోదావరిపై నిర్మించిన సమ్మక్క-సారక్క బ్యారేజీని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి పరిశీలించారు. అనంతరం దేవాదుల ప్రాజెక్టు వద్ద అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే ఖమ్మం జిల్లాలో జవహర్ ఎత్తిపోతల పథకం శంకుస్థాపన సందర్భంగా కూడా మాట్లాడారు. ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల నీటి లభ్యత ఉందని, ఇక్కడే గోదావరి, కావేరి నదుల అనుసంధానానికి ప్రాజెక్టు నిర్మించాలని కేంద్రానికి ప్రతిపాదన చేశానని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ ఇచ్చిన నివేదికను అపహాస్యం చేసేలా బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం హేయమని విమర్శించారు. కాళేశ్వరంపై జస్టిస్ ఘోష్ రిపోర్టు జడ్జి తీర్పులాంటిదన్నారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ కోసం 2 లక్షల కోట్ల అప్పులు చేసిందని, వాటికి ఏటా రూ.16 వేల కోట్ల అసలు, వడ్డీ చెల్లిస్తున్నామని చెప్పారు. నీటి పారుదల శాఖకు కేటాయించిన రూ.23 వేల కోట్లలో 70% వాటికే పోతున్నాయన్నారు. సమ్మక్క బ్యారేజీపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందన్నారు. ఎంత నష్టం జరిగినా తెలంగాణ ప్రభుత్వం భరిస్తుందని ఛత్తీస్‌గఢ్‌కు తెలిపామని, త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



దేవాదుల ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రుల బృందం

దేవాదులను పూర్తి చేస్తాం: భట్టి విక్రమార్క

బనకచర్లను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ నిటారుగా నిలబడ్డారు కాబట్టే ఏపీ చేపట్టిన బనకచర్ల, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ఆగాయన్నారు. రాష్ట్ర విభజన అనంతరం కేసీఆర్ ముఖ్యమంత్రి, కేంద్రంలో మోదీ ప్రధాని అయిన తర్వాత అమాయకులైన గిరిజనులకు సంబంధించిన 2 లక్షల ఎకరాలను ఆర్డినెన్స్ ఇచ్చి పోలవరం కట్టుకోవడానికి ధారాదత్తం చేశారన్నారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. దేవాదులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని, పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 33 వేల ఎకరాలకు నీరందించేందుకు రూ.630 కోట్లతో చేపట్టిన జవహర్ ఎత్తిపోతల పథకానికి భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎర్రుపాలెం మండలం మొలుగుమాడులో పైలట్ ప్రాజెక్టు మాదిరిగానే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం వంటి పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.లక్షల కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని, అలా కాకుండా తక్కువ వ్యయంతో 30 వేల ఎకరాలకు నీరిచ్చేలా జవహర్ ఎత్తిపోతల పథకం రూపొందించామని మంత్రి వాకటి శ్రీహరి అన్నారు. మంత్రి సీతక్క, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వరంగల్ కాంగ్రెస్ నేతల మధ్య సమసిన వివాదం

- కలిసి పనిచేయడానికి అంగీకారం
- చర్చకు రాని రాజగోపాల్‌రెడ్డి అంశం
- మల్లు రవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశం..

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధికార కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు సమసిపోయాయి. పార్టీ కోసం కలిసి పనిచేయడానికి ఇరు వర్గాలకు చెందిన నాయకుల మధ్య అవగాహన కుదిరింది. ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి అధ్యక్షతన కమిటీ సుమారు రెండు గంటల పాటు సమావేశమై పార్టీ ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించింది. ఈ నేపథ్యంలోనే కొండా మురళి కమిటీ ఎదుట విచారణకు హాజరై వివరణ ఇచ్చారు. దీనిపై కమిటీ సంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇక ఇటీవల అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల విషయమై భేటీలో చర్చించారు. అయితే భేటీకి అనిరుధ్‌రెడ్డి హాజరు కావాల్సి ఉండగా.. ఇతర పనుల కారణంగా కమిటీ ముందుకు వచ్చి వివరణ ఇవ్వలేకపోతున్నట్టు సమాచారమిచ్చారు. తాను రాజకీయ నాయకుల గురించి మాట్లాడలేదని.. కేవలం ఆంధ్రా కాంట్రాక్టర్లపైనే వ్యాఖ్యలు చేసినట్లు వివరణ ఇచ్చారు. బీజేపీ కూటమి భాగస్వామి అయిన చంద్రబాబు నాయుడును విమర్శించినందుకు కాంగ్రెస్ సంతోషించాలంటూ ఆయన పేర్కొన్నారు. భేటీ అనంతరం మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ.. భవిష్యత్తులో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు ఇక పార్టీ కార్యక్రమాలన్నింటిలో కలిసి పని చేయడానికి ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ నాయకులు ఒప్పుకొన్నారని తెలిపారు. అనిరుధ్ రెడ్డి వివరణను టీపీసీసీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇటు మంత్రి పదవి దక్కలేదన్న అసంతృప్తితో తరచూ సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌ను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కొద్దిరోజులుగా విమర్శిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ విషయమై కమిటీకి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని మల్లు రవి స్పష్టం చేశారు. అసలు రాజగోపాల్‌రెడ్డి అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని తెలిపారు. మరోవైపు కొండా మురళి కూడా మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ తమ రక్తంలోనే ఉందని, పార్టీ ఏ ఆదేశాలు ఇచ్చినా తప్పకుండా పాటిస్తామని స్పష్టం చేశారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నందున.. పార్టీ నేతలతో కలిసి పనిచేయాలని క్రమశిక్షణ కమిటీ సూచించినట్టు చెప్పారు.

పురిటినొప్పులతో బాధపడుతున్న భార్యను రెండు కిలోమీటర్లు మోసుకెళ్లిన భర్త

» రోడ్డుపై బురదతో వారి తండాకు చేరని 108 వాహనం

» మార్గమధ్యలోనే ప్రసవం.. తల్లి, బిడ్డ క్షేమం



భార్యను అంబులెన్స్ వద్దకు మోసుకెళ్తున్న ఆమె భర్త వాసుదేవ్

నాగల్‌గిద్ద, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భార్య పురిటినొప్పులతో బాధపడుతుండటం.. రోడ్డుపై బురదతో తండాకు 108 వాహనం రాలేని పరిస్థితి ఏర్పడటంతో ఆమె భర్త ఆమెను రెండు కిలోమీటర్లు మోసుకెళ్లాడు. ఈ ఘటన ఆదివారం సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం శాంతినగర్‌తండా పంచాయతీ పరిధిలోని మున్యానాయక్‌తండాలో జరిగింది. తండాకు చెందిన కౌసల్యబాయి (26) నిండు గర్భిణి.. ఆదివారం ఆమెకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ వెంటనే బయలుదేరినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు బురదమయంగా మారడంతో వారి తండాకు రెండు కిలోమీటర్ల దూరంలోనే ఆగిపోయింది. భార్యకు పురిటినొప్పులు ఎక్కువ కావడంతో భర్త వాసుదేవ్ ఆమెను అంబులెన్స్ వద్దకు మోసుకెళ్లేందుకు నిర్ణయించుకొని బయలుదేరాడు. అయితే ఆమెకు పురిటినొప్పులు ఎక్కువై మార్గమధ్యలోనే ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఆమె వద్దకు నడుచుకుంటూ చేరుకున్న 108 సిబ్బంది ఆమెను చేతులపై తీసుకెళ్లి వాహనంలోకి ఎక్కించి, కరస్‌గుత్తిలోని ప్రభుత్వ ఆస్రతికి తరలించారు. తల్లి, బిడ్డను పరీక్షించిన వైద్యులు వారు క్షేమంగా ఉన్నారని తెలిపారు. కాగా, అధికారులు, నేతలు ఇప్పటికైనా స్పందించి రోడ్డుసౌకర్యం కల్పించాలని తండా వాసులు కోరారు.

సీఎస్ఈలో 5,261.. కోర్‌లో 6,075

» తుది విడత కౌన్సెలింగ్ తర్వాత బీటెక్‌లో మిగిలిన సీట్లు

» భర్తీ కాని సీట్లు 11,638.. 18, 19న ఇంటర్నల్ స్లైడింగ్

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఎప్‌సెట్ తుది విడత కౌన్సెలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు రెండు విడతలు పూర్తి కాగా తాజాగా చివరి విడత కౌన్సెలింగ్ కూడా పూర్తవడంతో అర్హులైన అభ్యర్థులకు ఆదివారం సీట్లు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 180 ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో మొత్తం 91,649 సీట్లు అందుబాటులో ఉండగా.. తుది విడత కౌన్సెలింగ్ పూర్తయ్యాక 80,011 (87.3%) సీట్లు భర్తీ అయ్యాయి. 11,638 సీట్లు మిగిలాయి. మిగిలిన మొత్తం సీట్లలో కంప్యూటర్ సైన్స్ (సీఎస్ఈ) అనుబంధంగా ఉన్న 19 బ్రాంచిల్లో 5,261 సీట్లున్నాయి. సీఎస్ఈలో అత్యధికంగా 30,678 సీట్లుండగా 28,787 (93.84%) భర్తీ అయి 1,891 మిగిలిపోయాయి. సీఎస్ఈ ఏఐ, ఎంఎల్ 15,189 సీట్లలో 14,167 (93.27%) సీట్లు భర్తీకాగా 1,022 సీట్లు మిగిలాయి. కోర్ ఇంజనీరింగ్‌లో సీట్ల భర్తీ ఈసారి గతంతో పోలిస్తే ఎక్కువగా ఉన్నప్పటికీ.. 6,075 సీట్లు భర్తీ కాలేదు. కళాశాల పరిధిలో ఇతర బ్రాంచిల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 18, 19న ఇంటర్నల్ స్లైడింగ్ నిర్వహించనున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ కన్వీనర్‌శ్రీదేవసేన తెలిపారు. తర్వాత స్పాట్‌కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

తొర్రూర్‌లో గజం రూ.67,500

» ఓపెన్ ప్లాట్ల వేలానికి అనూహ్య స్పందన

» రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎండీ గౌతమ్

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో సొంతింటి కల సాకారం చేసుకునే వారి కోసం ఓపెన్ ప్లాట్లకు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్వహించిన వేలంలో అనూహ్య స్పందన లభించింది. ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని తొర్రూర్‌లో గజం స్థలం రూ.65,700 పలికిందని కార్పొరేషన్ ఎండీ గౌతమ్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 300-450 చదరపు గజాల నిడివితో ఉన్న 100 ప్లాట్లకు అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ ఫంక్షన్ హాలులో వేలం నిర్వహించినట్లు పేర్కొన్నారు. చదరపు గజానికి రూ.25 వేలుగా రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ధర నిర్ణయించింది. వీటిలో కార్నర్ ప్లాట్లకు డిమాండ్ లభించింది. దాదాపు 24 కార్నర్ ప్లాట్‌లలో ఒక్కొక్కదానికి గజం రూ.67,500 చొప్పున ధర పలికిందని గౌతమ్ వెల్లడించారు. మొత్తం 100 ప్లాట్‌లకు సగటున గజం రూ.33వేల చొప్పున ధర వచ్చిందన్నారు. వేలం ద్వారా రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు రూ.105కోట్ల మేర ఆదాయం వచ్చిందని, వేలం ప్రక్రియలో 240 మంది బిడ్డర్లు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

రాజగోపాల్‌రెడ్డికి మాట ఇచ్చింది నిజమే

» సమీకరణాలతోనే మంత్రి పదవి ఇవ్వలేకపోయాం: భట్టి



హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది వాస్తవమేనని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. ఆ సమయంలో తాను కూడా ఉన్నానని తెలిపారు. అయితే క్యాబినెట్‌లో సమీకరణాల కూర్పు నేపథ్యంలో రాజగోపాల్‌రెడ్డికి అవకాశం కల్పించలేకపోయామని పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి ఇస్తానని చెప్పి మోసం చేశారంటూ రాజగోపాల్‌రెడ్డి ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో భట్టివిక్రమార్క స్పందించారు.



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై వాహనాల బారులు

హైవేపై వాహనాల రద్దీ!

» చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై బారులు

» దుద్దెడ టోల్‌ప్లాజా వద్ద అదే పరిస్థితి..

చౌటుప్పల్ టౌన్/కొండపాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని హైదరాబాద్-విజయవాడ 65వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ కొనసాగింది. శనివారం రాఖీ పండుగ, ఆదివారం పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు ఉండడంతో పట్టణం కిటకిటలాడింది. హైవేపై ఇరు వైపులా వాహనాలు బారులు తీరగా, సర్వీస్ రోడ్లతోపాటు భువనగిరి, మునుగోడు వెళ్లే రహదారులు బైకులు, పాదచారులతో నిండిపోయాయి. హైవేపై జంక్షన్ల వద్ద దాటాలంటే 10-15 నిమిషాలు ఎదురుచూడాల్సి వచ్చింది. రాఖీ పండుగకు వెళ్లిన హైదరాబాదీలు ఆదివారం సాయంత్రం నుంచి తిరుగు పయనమయ్యారు. ఇక ఆర్టీసీ బస్సులూ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఈ క్రమంలోనే హైవేపై ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఇటు సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ టోల్‌ప్లాజా వద్ద కూడా వాహనాల రద్దీ కొనసాగింది. రాఖీతో పాటు వరుస సెలవులు రావడంతో సొంతూళ్లకు వెళ్లిన వారంతా తిరిగి హైదరాబాద్ బాట పట్టారు. దీంతో సుమారు 2 కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి.

సిద్దిపేట జిల్లా దుద్దెడ టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ



హ్యాపీ టోల్ గేట్!

FASTag

పంద్రాగస్టు నుంచే అమల్లోకి ఫాస్టాగ్ వార్షిక పాస్.. ఒకసారి రూ.3వేలు కడితే చాలు

» ఏడాదిపాటు దేశవ్యాప్తంగా 200సార్లు టోల్ మీదుగా వెళ్లొచ్చు

» వీఆర్ఎన్‌తో రిజిస్టర్ అయిన ఫాస్టాగ్‌లకే పాస్ వర్తింపు

» చాసిస్ నంబరుతో రిజిస్టర్ చేసిన ఫాస్టాగ్‌లకు నో



హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): టోల్‌చార్జీల మోతతో తల బొప్పి కట్టినవారికి గొప్ప ఊరట! ఉద్యోగ, వ్యాపారాల కోసం వరుస ప్రయాణాలు చేసే వారికి టోల్ భారం గణనీయంగా తగ్గనుంది. మునుపటి మాదిరిగా నెలకు టోల్‌చార్జీల రూపంలో వేలకు వేలు వదిలించుకోవాల్సిన పని లేదు. ఈ మేరకు జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారుల కోసం కేంద్ర ప్రభుత్వం తీపికబురు తెచ్చింది. ఒకసారి రూ.3వేలు కడితే చాలు దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ఉన్న టోల్ గేట్ల మీదుగా గరిష్ఠంగా 200సార్లు ప్రయాణించే అవకాశం!! 'వార్షిక పాస్' అనే పేరుతో ఈ పథకాన్ని ఫాస్టాగ్ యూజర్ల కోసం ఈనెల 15 నుంచి అమల్లోకి తేనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులపై ఉన్న అన్ని టోల్‌గేట్లకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పాస్‌ను 'రాజ్‌మార్గ్‌యాత్ర' అనే మొబైల్ యాప్, లేదా జాతీయ రహదారుల అథారిటీ సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికార వెబ్‌సైట్ నుంచి పొందొచ్చు. దరఖాస్తు చేసుకునేవారి వాహనాల రిజిస్ట్రేషన్ వివరాలు 'వాహన్ డేటాబేస్'లో అప్‌డేట్ అయి ఉండాలి. ఆ తర్వాత వాహనానికి అనుసంధానం చేసిన ఫాస్టాగ్ వివరాలు, రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. డబ్బులు చెల్లించిన తర్వాత రెండు గంటల్లోగా వార్షిక పాస్ యాక్టివేట్ అవుతుంది. అయితే ఈ పాస్ ప్రైవేటు వాహనాలకే వర్తిస్తుంది. వాణిజ్య(కమర్షియల్) వాహనాలు, ట్యాక్సీలకు వర్తించదు. అలాగే.. ఒక వాహనానికి జారీ చేసిన పాస్‌ను మరొక వాహనానికి బదిలీ చేయడం కూడా వీలు కాదు. వాహన రిజిస్ట్రేషన్ నంబరు (వీఆర్ఎన్)తో రిజిస్టర్ చేసిన ఫాస్టాగ్‌పై మాత్రమే ఈ పాస్ వర్తిస్తుంది. చాసిస్ నంబరుతో రిజిస్టర్ చేసిన ఫాస్టాగ్‌లకు వర్తించదు. ఈ పాస్‌లు దేశంలోని జాతీయ రహదారులు (ఎన్‌హెచ్), జాతీయ ఎక్స్‌ప్రెస్ వే (ఎన్ఈ)లపై మాత్రమే పనిచేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే రాష్ట్ర రహదారులు (ఎస్‌హెచ్), ఇతర లోకల్, ప్రైవేట్ టోల్ ప్లాజాల వద్ద మాత్రం సాధారణ ఫాస్టగ్ మాదిరిగానే టోల్ చార్జీలు వసూలు చేస్తారు. వార్షిక పాస్ తీసుకున్న వాహనదారులకు టోల్‌గేట్ దాటిన ప్రతిసారి ఒక ట్రిప్‌గా పరిగణిస్తారు. క్లోజ్డ్ టోల్ గేట్ వద్ద మాత్రం ఎంట్రీ-ఎగ్జిట్ కలిపి ఒకే ట్రిప్ గా లెక్కిస్తారు. అయితే ఈ వార్షిక పాస్ కోసం మళ్లీ కొత్తగా ఫాస్టాగ్ రిజిస్టర్ చేసుకోవాల్సిన పనిలేదు. ఇప్పటికే ఉన్న ఫాస్టాగ్ పైనే యాక్టివేట్ చేసుకోవొచ్చు. ఇప్పటికే ఫాస్టాగ్ వాలెట్‌లో బ్యాలెన్ ఉంటే దాన్ని ఉపయోగించి ఈ పాస్‌ను కొనుగోలు చేయలేరు. "ప్రజల ప్రయాణ ఖర్చును తగ్గించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని తీసుకొస్తున్నాం. ఫాస్టాగ్ వినియోగంలో మరింత పారదర్శకత, వేగవంతమైన ప్రయాణాలకు ఇది దోహదం చేస్తుంది" అని కేంద్ర రవాణ శాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. వార్షిక పాస్‌పై యూజర్లకు ఎస్ఎమ్ఎస్ అలర్టులు, ట్రిప్ సమాచారాన్ని పంపిస్తారని వెల్లడించారు. అయితే ఈ పాస్ తీసుకోవడం తప్పనిసరేమీ కాదు. ఈ వార్షిక పాస్‌ను వద్దు అనుకునేవారు ప్రస్తుతం చెలామణిలో ఉన్న టారిఫ్‌ల ప్రకారమే ఫాస్టాగ్ ఉపయోగించుకోవొచ్చు.

ఎక్కువగా తిరిగే వారికి మేలు

వార్షిక పాస్ పథకం అనేది ఎక్కువగా ప్రయాణాలు చేసే వారికి ఎంతో ప్రయోజనం అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉదాహరణకు హైదరాబాద్‌కు చెందిన మధుకర్ తన ఆఫీసు అవసరాల దృష్ట్యా నెలలో కనీసం 2 సార్లు హైదరాబాద్ నుంచి విజయవాడకు కారులో వెళ్లొస్తారు. వెళ్లేటప్పుడు 4టోల్‌గేట్లలో కలిపి దాదాపు 400ఖర్చవుతుంది. మర్నాడు (24 గంటల తర్వాత) తిరుగు ప్రయాణంలో మరో 400 కట్టాలి. అంటే ఒక ట్రిప్‌కే రూ.800. అంటే.. నెలకు 4 టోల్‌గేట్ల మీదుగా 16 ట్రిప్పుల చొప్పున ఏడాదికి 192 ట్రిప్పులు అవుతాయి. ఇందుకు మదుకర్ రూ.19,200 కడుతున్నారు. ఒకవేళ 3వేలు కట్టి వార్షిక పాస్‌ను తీసుకుంటే రూ.16,200 మిగులుతాయి. ఈ పాస్ గురించి తెలిసి మధుకుమార్ సంతోషం వ్యక్తం చేశారు.

త్వరలో జిల్లా స్థాయి అసైన్డ్ కమిటీలు!

» చైర్మన్‌గా ఇన్‌చార్జి మంత్రి.. కోచైర్మన్‌గా కలెక్టర్

» గతంలోని మండల, నియోజకవర్గ కమిటీల రద్దు

» ప్రతిపాదనలు సిద్ధం చేసిన రెవెన్యూ అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయి అసైన్డ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటిదాకా ఉన్న మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలను రద్దు చేసి, జిల్లా స్థాయిలో ఒకే కమిటీ ఏర్పాటు చేయాలని రెవెన్యూ శాఖ ప్రతిపాదించినట్లు తెలిసింది. కొన్ని నియోజకవర్గాల సరిహద్దులు రెండు జిల్లాల పరిధిలో ఉన్నందున.. కమిటీల సమావేశాల నిర్వహణకు ఇబ్బందిగా ఉంటుందని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నేతృత్వంలో జిల్లాకు ఒక కమిటీని ఏర్పాటు చేస్తే అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నట్లు సమాచారం. అసైన్‌మెంట్ కమిటీకి చైర్మన్‌గా ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు కొనసాగుతారని, జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు సభ్యులుగా ఉంటారని, కలెక్టర్ కోచైర్మన్‌గా లేదా కన్వీనర్‌గా వ్యవహరిస్తారని ప్రతిపాదించారు. ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకునే పేదలకు పాస్‌పుస్తకాలు అందించడం, పీవోటీ చట్టం కింద కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరించే అంశంపైనా కమిటీలు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం భూభారతి చట్టం ద్వారా వివాదాల్లేని భూములకు ఎలక్ట్రానిక్ టైటిల్ డీడ్ కమ్ పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీ చేస్తున్న యంత్రాంగం.. ఇది పూర్తి కాగానే వివాదస్పద భూములపై దృష్టి సారించనుంది. తెలంగాణలో అటవీ సరిహద్దు వివాదాలున్న భూములు 2,18,980 ఎకరాలున్నాయి. ఇవన్నీ మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్, కొత్తగూడెం తదితర జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లోనే ఉన్నాయి. పేదలు సాగు చేసుకుంటున్న భూములను వారికే అసైన్ చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లు సైతం గతంలో నివేదికలు ఇచ్చారు. ఈ వివాదాలకు అసైన్‌మెంట్ కమిటీల ద్వారా పరిష్కారం లభించే అవకాశం ఉందని సమాచారం. తాజా ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించిన తర్వాత ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాలు భావిస్తున్నాయి.

'సృష్టి' లోకి ఈడీ ప్రవేశం?!

» 80 మంది చిన్నారుల విక్రయం

» నమ్రత 25 కోట్లు కొల్లగొట్టినట్లు హైదరాబాద్ పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ

» వివరాల కోసం సిటీ పోలీసులకు ఈడీ లేఖ?!

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సృష్టి ఫర్టిలిటీ సెంటర్ కేసు దర్యాప్తులోకి కేంద్ర దర్యాప్తు సంస్థ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)' రంగ ప్రవేశం చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసులో డాక్టర్ నమ్రత సుమారు 80 మంది చిన్నారులను విక్రయించడంతో రూ.25 కోట్లు చేతులు మారినట్లు తేలింది. దీంతో ఇప్పటి వరకూ ఈ కేసు దర్యాప్తు వివరాలను తమకివ్వాలని హైదరాబాద్ నగర పోలీసులకు ఈడీ లేఖ రాసినట్లు సమాచారం. సిటీ పోలీసుల విచారణ నివేదికలో పూర్వాపరాలు పరిశీలించి దర్యాప్తుపై నిర్ణయం తీసుకోనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. 'సృష్టి ఫర్టిలిటీ సెంటర్' పేరుతో డాక్టర్ నమ్రత చేపట్టిన అక్రమాల దందాపై సికింద్రాబాద్- గోపాలపురం పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆమెకు అంతర్ రాష్ట్ర చైల్డ్ మాఫియా ముఠాలతో లింకులుండటంతోపాటు రూ.లక్షల్లో అక్రమ ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు తేలింది. డాక్టర్ నమ్రతతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని ఐదుగురు డాక్టర్లు, టెక్నీషియన్లు, ఇతర ఏజెంట్లు, చిన్నారులను విక్రయించిన దళారులు సహా 30 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నమ్రత, ఆమె కొడుకు జయంత్ కృష్ణతోపాటు సృష్టి క్లినిక్ పేరుతో గల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. ఆయా ఖాతాల్లో రూ.కోట్లలో డబ్బు ఉన్నట్లు పోలీసులు గుర్తించారని సమాచారం. అలా అక్రమంగా కొల్లగొట్టిన సొమ్ముతో 2 తెలుగు రాష్ట్రాల్లో స్థలాలు, ప్లాట్లు, ఫామ్ హౌస్‌లు కొనుగోలు చేసిన నమ్రత.. విదేశాల్లోనూ పెట్టుబడులు పెట్టినట్లు దర్యాప్తులో తేలిన నేపథ్యంలోనే ఈడీ రంగ ప్రవేశం చేసినట్లు తెలియవచ్చింది. పిల్లల్లేని దంపతులను సరగసీకి ఒప్పించి.. మరో మహిళ గర్భంలో మీ బిడ్డను పెంచుతున్నామని డాక్టర్ నమ్రత నమ్మించే వారు. డెలివరీ సమయం వచ్చేనాటికి ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన చిన్నారులను.. సరగసీ ద్వారా పుట్టిన శిశువని సదరు దంపతుల చేతిలో పెట్టేవారు. అలా చికిత్స మొదలైనప్పటి నుంచి బిడ్డ పుట్టే వరకూ ఆ దంపతుల నుంచి రూ.30-40 లక్షలు వసూలు చేసేవారు.

సమస్యల సుడిగుండంలో పంచాయతీలు!

» పారిశుధ్య చర్యలు, డ్రైనేజీల నిర్వహణకూ ఇక్కట్లే

» 15 నెలలుగా కేంద్రం నుంచి రూ.2700 కోట్లకు బ్రేక్


హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నెలల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్రం ఇచ్చే 15వ ఆర్థికసంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎస్ఎఫ్‌సీ(రాష్ట్ర ఆర్థిక సంఘం) నిధులు అందకపోవడంతో గ్రామాల్లో చిన్న చిన్న పనులూ చేపట్టలేని దుస్థితి నెలకొంది. పారిశుధ్య చర్యలు, డ్రైనేజీల నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్, ట్రాక్టర్లకు డీజిల్ కొనుగోలు వంటివి చేపట్టడానికి వీల్లేకుండా పోతోంది. వీధి దీపాల ఏర్పాటు, మరమ్మతులు, తాగునీటి పథకాలకు సంబంధించిన విద్యుత్ బిల్లులు సైతం చెల్లించలేకపోతున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం.. వ్యాధులు ముసిరే ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామ పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాష్ట్రంలో సర్పంచుల పదవీ కాలం ముగిసి.. 18 నెలలు అయింది. 2024 ఫిబ్రవరిలో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. వెంటనే ఎన్నికలు జరపాల్సి ఉన్నా.. ఏదో ఓ కారణంతో అడ్డంకులు ఏర్పడుతున్నాయి. పాలక వర్గాలు లేని కారణంగా పంచాయతీలకు కేంద్రం విడుదల చేయాల్సిన నిధులను ఆపేసింది. రాష్ట్రంలోని 12,848 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద ప్రతి నెలా రూ.180కోట్లు రావాల్సి ఉండగా.. 15నెలలకు సంబంధించి రూ.2,700కోట్లు నిలిచిపోయాయి. ఎన్నికలు పూర్తయి.. పాలక వర్గాలు ఏర్పాటు చేస్తేనే ఈ నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు సైతం 13నెలలుగా విడుదల కావడంలేదు. మొత్తం రూ.1560కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు రాకపోవడంతో గ్రామాల్లో వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం తామే సొంతంగా ఖర్చు చేయాల్సి వస్తోందని కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే పంచాయతీలకు వచ్చే నిధులను గ్రామాల్లో విద్యుత్, నెట్ బిల్లులు, వాహనాల అద్దె చెల్లింపు, ఇతర ఖర్చులకు వినియోగించేవారు. నిధులు ఆగిపోవడంతో ఇప్పుడు ఈ చెల్లింపులన్నీ నిలిచిపోయాయి. ఏ మాత్రం ఆదాయ వనరుల్లేని 6,000పైగా చిన్న పంచాయతీల్లో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. నిధుల లేమి, గ్రామాల అభివృద్ధి కుటుంబడిపోవడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తొందరగా తేల్చి.. స్థానిక ఎన్నికలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మళ్లీ తెరుచుకున్న సాగర్ గేట్లు

నిండుకుండల్లా కృష్ణా ప్రాజెక్టులు.. ఆల్మట్టి నుంచి సాగర్ దాకా గేట్లు ఓపెన్

» జూరాల, శ్రీశైలం, సాగర్‌లలో 8 చొప్పున గేట్లు తెరిచి నీటి విడుదల

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)





సాగర్ నుంచి కిందికి పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ; హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు కుంగి ఏర్పడిన భారీ గుంత

విస్తారంగా కురుస్తున్న వానలతో కృష్ణా నది పోటెత్తుతోంది. ఎగువన ఆల్మట్టి నుంచి దిగువన నాగార్జునసాగర్ దాకా ప్రాజెక్టులన్నీ నిండు కుండల్లా మారాయి. ఎగువ నుంచి భారీగా ప్రవాహాలు కొనసాగుతుండటంతో మొత్తం అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. అందులో ఆదివారం జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్ రిజర్వాయర్లలో ఎనిమిది చొప్పున గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో సాగర్ గేట్లు ఎత్తడం ఇది రెండోసారి కావడం గమనార్హం. కృష్ణాలో ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్ల నుంచి నీటిని వదులుతున్నారు. ఆదివారం సాయంత్రం జూరాల ప్రాజెక్టుకు 90 వేల క్యూసెక్కులు, శ్రీశైలానికి 1.97 లక్షల క్యూసెక్కులు, సాగర్‌కు 65,842 క్యూసెక్కుల వరద నమోదైంది. ఎగువ నుంచి విడుదల చేసే నీటికి అనుగుణంగా జలాశయాలకు ఇన్‌ఫ్లో మారుతుంది. ఇక నది పరీవాహకం పొడవునా విద్యుత్ కేంద్రాల్లో జల విద్యుదుత్పత్తి కొనసాగుతుండటం గమనార్హం. ఎగువ పరీవాహక ప్రాంతాలతోపాటు హైదరాబాద్‌లో కొనసాగుతున్న వర్షాలతో మూసీ నదిలో వరద పెరుగుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని సంగెం, బొల్లెపల్లి గ్రామాల మధ్య కల్వర్టుపై నుంచి వరద ప్రవహిస్తుండటంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు.

దక్షిణ తెలంగాణ జిల్లాల్లో వానలు

ఆదివారం దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వానలు కురిశాయి. నారాయణపేట జిల్లా కోస్గిలో 6.5 సెంటీమీటర్ల వర్షం నమోదైంది. మద్దూర్‌లో నివాస ప్రాంతాలు నీట మునిగాయి. వనపర్తి జిల్లాలో కేశంపేట వాగు ఉప్పొంగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు కాలినడకన వాగు దాటి వెళ్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో తాండూరు, ధారూరు, బొంరాస్‌పేట్, కోట్‌పల్లి మండలాల్లో భారీ వర్షం కురిసింది. బషీరాబాద్ మండలంలోని నవాంద్గీ పెద్ద చెరువు కట్టకు గండిపడింది. మండలంలో మూడు ఇళ్లు కూలిపోయాయి. వికారాబాద్ శివారెడ్డిపేట చెరువు అలుగు పారింది. వాగులు ఉప్పొంగుతున్నాయి. దీనితో ఈసీ, మూసీ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. హిమాయత్‌సాగర్, గండిపేట జలాశయాల్లోకి భారీగా వరద వస్తోంది. ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో శనివారం అర్ధరాత్రి తర్వాత కురిసిన వర్షాలతో పలు కాలనీలు నీటమునిగాయి. హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు కుంగి భారీ గొయ్యి ఏర్పడింది. ఆదివారం ఉప్పల్, రామంతాపూర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో స్వల్ప వర్షం పడింది.

రెండు జిల్లాల్లో కాలువలకు గండ్లు

ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కుంచపర్తి వద్ద ఎన్నెస్పీ కాల్వకు గండి పడింది. నీరంతా పక్కనే ఉన్న పొలాల్లోకి ప్రవహించింది. 20 ఎకరాలకుపైగా వరి నీటమునిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ రెవెన్యూ శివారు పరిధిలో కేఎల్ఐ డీ-82 ప్రధాన కాల్వకు శనివారం అర్ధరాత్రి గండి పడింది. పక్కనే ఉన్న పొలాల్లో ఇసుక మేటలు పేరుకున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar, Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.